











హైదరాబాద్ సంపుటి : 01 సంచిక : 111, ఎడిటర్,భీముడు నాయక్ పేజిలు : 12, వెల రూ. 1 ఆదివారం - 26 - మే - 2024

PUBILSHED FROM HYDERABAD, CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

# కౌంటింగ్ డే టెన్షన్..!!

## ఘర్షణలు జరగకుండా ఈసీ పటిష్ట చర్యలు

- పిన్నెల్లి ఎపిసోడ్‌తో మరో టర్న్
- మూడు ప్రాంతాలపై ప్రత్యేక నిఘా
- ర్యాలీలు, బాణసంచాపై నిషేధం
- ప్రజల్లో అనేక సందేహాలు
- యువకులను బయటకు పంపుతున్న ఫ్యామిలీస్
- ఆ రెండులో ఇంట్లో ఉంటే మేలు




అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో 2024 ఓట్ల లెక్కింపు దగ్గర పడుతున్న కొద్దీ టెన్షన్ పెరిగిపోతోంది. గెలుస్తామా లేదా అన్న భయం నేతల్లో ఉంటే... పోలింగ్ రోజే విధ్వంసం జరిగిందని కౌంటింగ్ రోజు ఇంకెంత విధ్వంసం చూడాల్సి వస్తుందో అన్న అనుమానం సామాన్య ప్రజల్లో ఉంది. పోలింగ్ జరిగి పది రోజులు దాటినా అసలు ప్రజల నాడి ఏంటన్నది ఎవరికీ ఓ పట్టానా అర్థం కావడం లేదు. అదే టైంలో పార్టీ వ్యాఖ్యలు, నేతలు ఫిర్యాదులు, ఇలా అన్నీ ప్రజలను బెదిరగొట్టేస్తున్నాయి. ఇప్పుడు పరిణామాలు, ఘర్షణలు గెలుపు ఎవరిదీ అన్న చర్చే రాకుండా చేశాయి. తర్వాత మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి ఎపిసోడ్‌తో ఈ రాజకీయం పీక్స్‌కు వెళ్లింది. ఎన్నికల పోలింగ్ తర్వాత పల్నాడు, రాయలసీమలో కక్షపూరిత రాజకీయాలు తెరపైకి వచ్చాయి. ఓటు వేయలేదని, ఓటు వేసేందుకు అడ్డుకున్నారని, ఆధిపత్యానికి అడ్డు వస్తున్నారని ఇలా కారణాల ఏమైనా ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. దీనిపై కేంద్ర ఎన్నికల సంఘం సీరియస్‌గా దృష్టి పెట్టింది. తక్షణమే పరిస్థితి అదుపులోకి తీసుకొచ్చేందుకు మిగతా..2లో

## గర్భంలో ఉన్నది ఆడా? మగా? తెలుసుకునేందుకు భార్య పొట్ట కోసిన భర్తకు యావజ్జీవం




- 2020లో ఉత్తరప్రదేశ్‌లో ఘటన
- అప్పటికే దంపతులకు ఐదుగురు అమ్మాయిలు
- అబ్బాయి కోసం తరచూ భార్యాభర్తల మధ్య తగాదా
- 8 నెలల గర్భంతో ఉండగా భార్య పొట్టకోసిన భర్త

## అలా ఉన్నా పోస్టల్ బ్యాలెట్స్ చెల్లుబాటు

– ఏపీ సీఈవో కీలక నిర్ణయం

మొత్తం పోస్టల్ బ్యాలెట్స్ 5,39,189 ఓట్లు




అమరావతి: పోస్టల్ బ్యాలెట్ వెనుక రిటర్నింగ్ అధికారి సీల్, సంతకం లేని వాటిని కూడా పరిగణలోకి తీసుకోవాలని ఈసీని టీడీపీ నేతలు కోరారు. రాష్ట్ర సీఈఓ ముఖేష్ కుమార్ మీనా ఈ విజ్ఞప్తికి అంగీకరించారు.వీలైనంత త్వరగా లిఖిత పూర్వక ఉత్తర్వులు ఇవ్వాలని టీడీపీ నేతలు కోరారు. డిక్లరేషన్పై గెజిటెడ్ ఆఫీసర్ సంతకం చేసిన సీల్ లేకపోయినా

## పిన్నెల్లికి హైకోర్టు కీలక ఆదేశాలు



అమరావతి: వైసీపీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి తన కోసం పోలీసులు గాలిస్తుండగానే మిగతా..2లో




కడప : వైసీపీ అధ్యక్షుడి సొంత జిల్లాలో ఎన్నికలు అత్యంత కాస్ట్లీగా జరిగాయంట. గత సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి కడప జిల్లాలోని 10 అసెంబ్లీ నియోజక వర్గాల పరిధిలో దాదాపు 700 కోట్లు ఖర్చు చేశారని అంచనా వేశారు. ఈసారి కడప పార్లమెంట్ స్థానం పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాలల్లోనే అభ్యర్థులు దాదాపు 600 కోట్ల రూపాయలు ఖర్చు చేశారని అంటున్నారు. ప్రభుత్వ వ్యతిరేకత ఉందని జరిగిన ప్రచారంతో వైసీపీ కేండెట్లు ఎక్కడా తగ్గకుండా డబ్బు వెదజల్లారంట. సొంత జిల్లాలో ఒక్క స్థానం కూడా విపక్షాలకు దక్కకూడదని జగన్ ఇచ్చిన ఆదేశాలతో అభ్యర్థులు అప్పులు చేసి మరీ ఖర్చుపెట్టారంట.ఈ సారి ఎన్నికలు అన్ని పార్టీలకు డూ ఆర్ డై అన్నట్లు మారాయి. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈసారి గెలవాల్సిందేనని టీడీపీ కృతనిశ్చయంతో ఉండగా రెండోసారి అధికారం చేపట్టాలని వైసీపీ పావులు కదిపింది. మిగతా..2లో

## వలపు వలతో ఎంపీ హత్య ..!!

చర్మాన్ని ఒలిచి.. ముక్కలుగా నరికిన వైనం



కోల్‌కతా : బంగ్లాదేశ్ ఎంపీ హత్య కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. అన్వరుల్ అజీమ్ చికిత్స కోసం బంగ్లాదేశ్ నుంచి ఈ నెల 12న కోల్ కతా వచ్చారు. అయితే మే 14 నుంచి ఆయన కనిపించకుండా పోయారు. ఎంపీ హత్య కేసుకు సంబంధించి ఓ అనుమాతుడిని బెంగాల్ సీఐడీ టీం అరెస్ట్ చేయగా భయంకర విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఓ మహిళ ఆయనను వలపు వలలోకి లాగి హత్య చేసినట్లు తెలుస్తోంది. మిగతా..2లో




తెలంగాణలో విద్యాసంవత్సరం క్యాలెండర్ విడుదల...

## జూన్ 12న స్కూల్స్ ప్రారంభం

వచ్చే ఏడాది ఏప్రిల్ 23 వరకు పాఠశాలలు

దసరా, క్రిస్మస్, సంక్రాంతికి సెలవులు

ఉన్నత పాఠశాలలు ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4.45 వరకు...



## 300 మందికిపైగా సజీవ సమాధి

పపూవా న్యూగినియాలో మరింత విషాదం..

శిథిలాలు, బురదలో చిక్కుకున్న వారి ఆర్తనాదాలతో దయనీయ పరిస్థితులు

దేశంలోని ఇతర ప్రాంతాలతో కావోకలమ్ గ్రామానికి తెగిపోయిన సంబంధాలు

పెద్ద ఎత్తున కొనసాగుతున్న సహాయక చర్యలు

## మన గీతానికి పక్క రాష్ట్రం వారు పని చేయడమేమిటి...?

- కీరవాణి కంపోజ్ చేయడంపై రేవంత్ రెడ్డికి టీసీఎంఏ లేఖ
- జయ జయహే తెలంగాణను కీరవాణితో కంపోజ్ చేయించిన తెలంగాణ ప్రభుత్వం
- పక్క రాష్ట్రం వారితో కంపోజింగ్ చేయించడం చారిత్రక తప్పిదమని టీసీఎంఏ లేఖ
- తెలంగాణలో ఎంతోమంది ప్రతిభావంతులు ఉన్నారు... వారికి అవకాశమిచ్చి గౌరవించాలని విజ్ఞప్తి



హైదరాబాద్: మన తెలంగాణ రాష్ట్ర గీతాన్ని పక్క రాష్ట్రం వారు పాడటమేమిటని తెలంగాణ సినీ మ్యూజిషియన్స్ అసోసియేషన్-టీసీఎంఏ... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి శనివారం లేఖ రాసింది. జయ జయహే తెలంగాణ... గీతాన్ని రాష్ట్ర గీతంగా ప్రకటించినందుకు గర్విస్తున్నట్లు ఆ లేఖలో పేర్కొన్నారు.

## తుఫాన్ ఎఫెక్ట్..! ఏపీకి భారీ వర్ష సూచన..!

బలపడనున్న వాయుగుండం



అమరావతి :తెలుగు రాష్ట్రాల్లో వాతావరణం పూర్తిగా చల్లబడింది. ఇరు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి. తుఫాన్ ప్రభావంతో ఏపీలో మరికొన్నిరోజులు వర్షాలు కురిసే అవకాశం ఉంది. తాజా వెదర్ అప్డేట్స్ ఇక్కడ చూడండి..బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారిన తర్వాత ఈశాన్య దిశగా కదులుతూ తూర్పు మధ్య బంగాళాఖాతంలో మిగతా..2లో

## ఆరో దశ లోక్‌సభ ఎన్నికల పోలింగ్ షురూ..



ఒడిశాలో 42 అసెంబ్లీ స్థానాలకు కూడా..

ఢిల్లీలో 7 లోక్‌సభ స్థానాలకు ఆరో విడత ఎన్నికల్లోనే పోలింగ్

ఢిల్లీ: : లోక్‌సభ ఎన్నికల ప్రక్రియలో ఆరో విడత ఎన్నికల పోలింగ్ జరిగింది. దేశంలోని 6 రాష్ట్రాలు, రెండు కేంద్రపాలిత ప్రాంతాల్లోని 58 లోక్‌సభ నియోజకవర్గాల్లో శనివారం పోలింగ్ జరిగింది. ఉదయం పోలింగ్ ప్రారంభానికి ముందే ఓటర్లు పోలింగ్ కేంద్రాల దగ్గర బారులు తీరారు. ఇప్పటికే ఐదు విడతల పోలింగ్ ముగిసిపోగా ఇప్పుడు ఆరో విడత పోలింగ్ జరుగుతోంది.

# అలా ఉన్నా పోస్టల్ బ్యాలెట్స్ చెల్లుబాటు

మొదటి పేజి తరువాయి

పరిగణలోకి తీసుకోవాల్సిందేనని డిమాండ్ చేస్తోంది. రిటర్నింగ్ అధికారి ఫాసిమెయిల్, గెజిటెడ్ ఆఫీసర్ సంతకం బాధ్యత ఎన్నికల కమిషన్దే అని చెబుతోంది.ఏపీలో రికార్డు స్థాయిలో పోస్టల్ బ్యాలెట్లు పోలయ్యాయి. తాజా లెక్కలు ప్రకారం జిల్లాల నుంచి వచ్చినవి 5,39,189 ఓట్లుగా గుర్తించారు. అత్యధికంగా శ్రీకాకుళం జిల్లాలో 38,865 ఓట్లు, తర్వాతి స్థానంలో నంద్యాల జిల్లాలో 25,283 ఓట్లు, మూడో స్థానంలో కడప జిల్లాలో 24,918 పోస్టల్ బ్యాలెట్లు, అత్యల్పంగా నరసాపురంలో 15,320 ఓట్లుగా లెక్క తేల్చారు. వీరంతా ఎన్నికల విధుల్లో పాల్గొన్న వారు..త సర్వీస్ ఓటర్లు.పోస్టల్ బ్యాలెట్స్ ను బట్టి టేబుల్స్ ఏర్పాటు చేస్తారు. ఒక్కో టేబుల్లో ఎన్ని పోస్టల్ బ్యాలెట్ ట్లు లెక్కించాలనే అంశంపై రిటర్నింగ్ అధికారులకు కేంద్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు పంపింది. పోస్టల్ బ్యాలెట్ల వినియోగంలో ఈ సారి ఉద్యోగులు ఎక్కువ ఆసక్తి చూపించారు. 2019 ఎన్నికల్లో రాష్ట్రంలో 2,95,003 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇందులో 56,545 ఓట్లు చెల్లలేదు. పోలైన వాటిలో 2,38,458 ఓట్లు చెల్లుబాటయ్యాయి.చెల్లుబాటైన ఓట్లలో వైసీపీకి 1,36,768 ఓట్లు దక్కాయి. టీడీపీకి 81,608 ఓట్లు వచ్చాయి. జనసేనకు 11,326 ఓట్లు లభించాయి. మిగిలిన 8,756 ఓట్లు వివిధ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు కైవసం చేసుకున్నాయి. ఈ సారి రెండు లక్షలకుపైగా పోస్టల్ బ్యాలెట్లు పెరగడంతో ఎవరికి ప్లస్ .. ఎవరికి మైనస్ అన్న చర్చ జరుగుతోంది. డిక్లరేషన్పై గెజిటెడ్ ఆఫీసర్ సంతకం చేసిన సీల్ లేకపోయినా ఓట్లను పరిగణనలోకి తీసుకుంటామని ఈసీ చెప్పడంతో చెల్లని ఓట్లు కూడా తగ్గే అవకాశాలు ఉన్నాయి.

# పిన్నెల్లికి హైకోర్టు కీలక ఆదేశాలు

మొదటి పేజి తరువాయి

ఆయన హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేయగా.. హైకోర్టులో ఊరట లభించిన విషయం తెలిసిందే. ఈవీఎంను ధ్వంసం చేసిన కేసులో జూన్ 5వ తేదీ వరకు ఆయనపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని అధికారులను హైకోర్టు ఆదేశించింది. అనంతరం తదుపరి విచారణను జూన్ 6వ తేదీకి వాయిదా వేసింది. తాజాగా వైసీపీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఓట్ల లెక్కింపు రోజు మాచర్లకు వెళ్లవద్దని సూచించింది. నరసరావుపేట కౌంటింగ్ కేంద్రానికి వెళ్లేందుకు అనుమతి కల్పించింది. కాగా.. ఈ కేసులో పిన్నెల్లిని అరెస్ట్ చేయాలని ఎన్నికల సంఘం ఆదేశించిన విషయం తెలిసిందే.కాగా, ఎన్నికల వేళ ఆంధ్రప్రదేశ్ లోని గుంటూరు జిల్లా మాచర్ల నియోజకవర్గంలో పలు చోట్ల ఉద్రిక్తతలు చోటు చేసుకున్న విషయం తెలిసిందే. మాచర్లలో ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన అనుచరులు బీభత్సమే సృష్టించారు. పాల్వాయి గేట్ పోలింగ్ కేంద్రంలోకి వెళ్లి ఈవీఎం మిషన్ ను ధ్వంసం చేశారు. పోలింగ్ సిబ్బంది పట్ల దురుసుగా ప్రవర్తించారు.దీంతో సీఈవో ముఖేష్ కుమార్ మీనా పిన్నెల్లిని త్వరలోనే అరెస్ట్ చేస్తామని.. ఆయన కోసం పోలీసులు గాలింపులు చేపడుతున్నారని తెలిపిన విషయం తెలిసిందే.

# తుఫాన్ ఎఫెక్ట్..! ఏపీకి భారీ వర్ష సూచన..!

మొదటి పేజి తరువాయి

తుపానుగా బలపడుతుందని ఐఎండీ అంచనా వేసింది.రాబోయే 2 రోజుల్లో నైరుతి రుతుపవనాలు దక్షిణ బంగాళాఖాతం, మధ్య బంగాళాఖాతంలోని కొన్ని ప్రాంతాల్లోకి విస్తరించేందుకు అనుకూల పరిస్థితులు ఉన్నాయని వాతావరణశాఖ తెలిపింది. ప్రస్తుత వాతావరణ పరిస్థితులతో ఏపీలో మే 26వ తేదీ వరకు తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ పేర్కొంది. ఈ మేరకు తాజా బులెటిన్ ను విడుదల చేసింది.ఉత్తర కోస్తాలో శుక్ర,శని,ఆదివారాలు తేలికపాటి నుంచి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. పలు ప్రాంతాల్లో బలమైన ఈదురుగాలులు వీచే ఛాన్స్ ఉంది.దక్షిణ కోస్తాతో పాటు రాయలసీమ జిల్లాల్లోనూ వానలు పడనున్నాయి. ఇవాళ, రేపు, ఎల్లుండి తేలికపాటి నుంచి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించింది. పలు ప్రాంతాల్లో బలమైన ఈదురుగాలులు వీచే ఛాన్స్ ఉందని పేర్కొంది.ఇక తెలంగాణలో మే 25తో పాటు 26వ తేదీ ఉదయం వరకు పలుచోట్ల తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. పలు జిల్లాలకు ఎల్లో హెచ్చరికలను జారీ చేసింది. ఆ తర్వాత రాష్ట్రంలో పొడి వాతావరణమే ఉంటుందని పేర్కొంది. ఎలాంటి హెచ్చరికలు లేవని తెలిపింది.

# వలపు వలతో ఎంపీ హత్య ..!!

మొదటి పేజి తరువాయి

హత్య అనంతరం మృతదేహాన్ని అదృశ్యం చేసేందుకు నిందితులు దారుణంగా ప్రవర్తించారు. డెడ్ బాడీపై చర్మాన్ని ఒలిచి.. ముక్కలుగా చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. కేసు విచారణలో భాగంగానే పోలీసులు సీసీటీవీ దృశ్యాలను పరిశీలించారు. అమెరికాకు చెందిన ఓ మిత్రుడు కోల్ కతాలో అద్దెకు తీసుకున్న అపార్టుమెంట్ లోకి ఇద్దరు పురుషులు..ఓ మహిళతో కలిసి వెళ్లిన ఆయన ఆ తర్వాత తిరిగి రాలేదని పోలీసులు గుర్తించారు. ఓ మహిళతో హనీ ట్రాప్ చేయించి అపార్టుమెంట్ లోనికి రప్పించి ఉంటారని అనుమానిస్తున్నారు.అయితే ఆ మహిళ అన్వరుల్ స్నేహితుడికి సన్నిహితురాలిగా పోలీసులు గుర్తించారు. ఆయన స్నేహితుడు అన్వరుల్ ను చంపేందుకు రూ. 5 కోట్లు ఖర్చు చేశాడని, అందులో నిందితులకు వాటాలు కూడా ఇచ్చారని పోలీసులు తెలిపారు. ఇప్పటి వరకు ఉన్న ఆధారాలను పరిశీలిస్తే ఎంపీని గొంతు నలిమి హత్య చేసినట్లు తెలుస్తోంది. ఆ తర్వాత మృతదేహాన్ని ముక్కలుగా నరికి ఉంటారని అనుమానిస్తున్నారు. అనంతరం చర్మాన్ని వేరు చేసి..దుర్వాసన రాకుండా పసుపు కలిపి పెట్టినట్లు పోలీసులు భావిస్తున్నారు. అయితే కొన్ని భాగాలను ఫ్రిడ్జ్ లో పెట్టినట్లుగా నిర్ధారించినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం కొన్ని భాగాలను ప్లాస్టిక్ బ్యాగుల్లో తీసుకొని వివిధ ప్రదేశాల్లో పడేసి ఉంటారని చెబుతున్నారు.అయితే ఈ కేసులో బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా భారత్ లోకి వచ్చిన వలసదారుడు జిహాద్ హవల్దార్ ను ముంబాయిలో పోలీసులు అరెస్టు చేశారు. ఈ హత్యలో అతడే కీలక పాత్ర పోషించినట్లు తెలుస్తోంది. అయితే మృతుడు ఎంపీ, స్నేహితుడి ఆదేశాలతోనే ఎంపీని హత్య చేసి మృతదేహాన్ని గుర్తించడానికి వీలు లేకుండా చేసినట్లు నిందితుడు పోలీసుల ముందు అంగీకరించాడు.

### తెలంగాణలో విద్యాసంవత్సరం క్యాలెండర్ విడుదల...

# జూన్ 12న స్కూల్స్ ప్రారంభం

హైదరాబాద్: తెలంగాణలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి క్యాలెండర్ను విడుదల చేశారు. జూన్ 12వ తేదీన పాఠశాలలు ప్రారంభం కానున్నాయి. వచ్చే ఏడాది 23 ఏప్రిల్ వరకు కొనసాగుతాయి. 28 ఫిబ్రవరి 2025 లోపు పదో తరగతి ప్రీ-ఫైనల్ పరీక్షలు జరగనున్నాయి. మార్చిలో పదో తరగతి పరీక్షలు ఉంటాయి. అక్టోబర్ 2 నుంచి 14వ తేదీ వరకు దసరా సెలవులు, డిసెంబర్ 23 నుంచి 27 వరకు క్రిస్మస్ సెలవులు, జనవరి 13 నుంచి 17 వరకు సంక్రాంతి సెలవులు ఇచ్చారు. ఉన్నత పాఠశాలలు ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4.45 వరకు, అప్పర్ ప్రైమరీ పాఠశాలలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4.15 వరకు నిర్వహిస్తారు.

# 300 మందికిపైగా సజీవ సమాధి

పాపువా న్యూగినియా: పాపువా న్యూగినియాలో కొండచరియలు విరిగిపడిన ఘటనలో దయనీయ పరిస్థితులు నెలకొన్నాయి. తెల్లవారుజామున అందరూ గాఢ నిద్రలో ఉన్న సమయంలో ఒక్కసారిగా విరుచుకుపడిన కొండచరియలు వందలాదిమందిని సజీవ సమాధి చేశాయి. ఎంగా ప్రావిన్స్లోని కావోకలమ్ గ్రామంలో ఈ ఘటన జరిగింది. పెద్ద ఎత్తున కొండచరియలు విరిగిపడి ఇళ్ల మీద పడడంతో నిద్రలో ఉన్నవారు శాశ్వత నిద్రలోకి జారుకున్నారు. వందలాది ఇళ్లను కొండచరియలు నేలమట్టం చేశాయి. ఈ ఘటనలో ఇప్పటి వరకు 300 మందికిపైగా మృతి చెంది ఉంటారని అధికారులు తెలిపారు. 1182 ఇళ్లను నామరూపాల్లేకుండా తుడిచిపెట్టేశాయి. మలిటాకా ప్రాంతంలో ఆరుకుపైగా గ్రామాలపై కొండచరియలు విరిగిపడినట్టు ఆస్ట్రేలియా విదేశాంగ వ్యవహారాలు, వాణిజ్య విభాగం తెలిపింది. విరిగిపడిన కొండచరియలు జాతీయ రహదారిని దిగ్బంధం చేశాయి. ఫలితంగా హెలికాప్టర్లతో తప్ప బాధిత గ్రామాలకు చేరుకోలేని పరిస్థితి నెలకొంది. శిథిలాలు, బురదలో చిక్కుకున్న చిన్నారులు, మహిళల ఆర్తనాదాలతో కావోకలమ్ గ్రామంలో ఎటుచూసినా విషాదమే కనిపిస్తోంది. జాతీయ రహదారిపై విరుచుకుపడిన కొండ చరియలను తొలగించి గ్రామంతో తిరిగి సంబంధాలను పునరుద్ధరించేందుకు డిజాస్టర్, డిఫెన్స్, డిపార్ట్మెంట్ ఆఫ్ వర్క్స్ అండ్ హైవేస్ను రంగంలోకి దిగించినట్టు ప్రధానమంత్రి జేమ్స్ మరాపె తెలిపారు.

### గర్భంలో ఉన్నది ఆడా? మగా? తెలుసుకునేందుకు

# భార్య పొట్ట కోసిన భర్తకు యావజ్జీవం

ఢిల్లీ: గర్భవతి అయిన తన భార్య కడుపులో పెరుగుతున్నది ఎవరో తెలుసుకునేందుకు ఓ భర్త ఎవరూ పాల్పడని కిరాతకానికి పాల్పడ్డాడు. లోపలున్నది ఆడా? మగా? అని తెలుసుకునేందుకు భార్య పొట్టను చీల్చాడు. 2020లో ఉత్తరప్రదేశ్లో జరిగిన ఈ ఘటనకు సంబంధించి తాజాగా కోర్టు తీర్పు వెలువడింది. నిందితుడిని దోషిగా నిర్ధారించిన కోర్టు అతడికి యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. బదౌన్ సివిల్ లేన్స్కు చెందిన పన్నాలాల్ తన భార్య అనితపై దాడి చేసి పొట్టను కత్తితో చీల్చాడు. ఈ ఘటనలో ఆమె త్రుటిలో ప్రాణాపాయం నుంచి బయటపడినా లోపలున్న కవలలు బాబు, పాప ప్రాణాలు కోల్పోయారు. పన్నాలాల్, అనితకు వివాహమై 22 ఏళ్లు అయింది. అప్పటికే వారికి ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. ఎలాగైనా అబ్బాయి పుట్టాలని పన్నాలాల్ కలలు కనేవాడు. ఈ విషయంలో భార్యాభర్తలకు తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈసారి బాబుకు జన్మనివ్వకుంటే విడాకులు ఇచ్చి మరొకరిని పెళ్లాడతానని భార్యను బెదిరించేవాడు. ఈ క్రమంలో అనిత మరోమారు గర్భం దాల్చింది. ఆమె 8 నెలల గర్భిణిగా ఉన్నప్పుడు మరోమారు ఇద్దరికీ ఇదే విషయంలో గొడవైంది. దీంతో కోపంతో ఊగిపోయిన పన్నాలాల్ లోపల పెరుగుతున్నది ఆడా? మగా? ఎవరో తెలుసుకునేందుకు కత్తితో ఆమె పొట్టను చీల్చాడు. దీంతో ప్రాణభయంతో రక్తమోడుతూనే ఆమె వీధుల వెంట పరుగులు తీసింది. అనిత అరుపులు విన్న ఆమె సోదరుడు వెంటనే ఆమెను ఆసుపత్రికి తరలించాడు. ఈ ఘటన తర్వాత పన్నాలాల్ పరారయ్యాడు. చికిత్స తర్వాత అనిత కోలుకున్నప్పటికీ ఆమె పిల్లలిద్దరూ మరణించారు. తనపై కేసు పెట్టేందుకు భార్యే తనకు తానుగా పొట్ట చీల్చుకుందని పన్నాలాల్ కోర్టును నమ్మించే ప్రయత్నం చేశాడు. తాజాగా, ఈ కేసు విచారణకు రాగా ఆధారాలను పరిశీలించిన కోర్టు నిందితుడిని దోషిగా తేల్చి యావజ్జీవ శిక్ష విధిస్తూ తీర్పు చెప్పింది.

# కౌంటింగ్ డే టెన్షన్..!!




మొదటి పేజి తరువాయి

పార్టీలకు కొమ్ము కాస్తున్న అధికారులను తప్పించింది. ఓ సిట్ను ఏర్పాటు చేసి అసలు కారణాలు వెలికి తీయడంతోపాటు పరిస్థితిని చల్లబరచాలని సూచించింది. సిట్ రాకతో పరిస్థితిలో కొంత మార్పు వచ్చినప్పటికీ అది ఎంత వరకు ఉంటుందనే అనుమానం చాలా మందిలో ఉంది. ఇంతలో పిన్నెల్లి ఓ పోలింగ్ బూత్లోకి వెళ్లి ఈవీఎం ధ్వంసం చేయడం, ఇంతలో అరెస్టు భయంతో ఆయన పరారీ కావడంతో ఘర్షణల ఎపిసోడ్ వేరే మలుపు తిరిగింది. ఆయనపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని హైకోర్టు చెప్పడంతో పోలీసులకు, ఎన్నికల సంఘానికి పెద్ద రిలీఫ్గా చెప్పవచ్చు. అయితే అందరి దృష్టి పిన్నెల్లి ఎపిసోడ్పై ఉన్నప్పటికీ పోలింగ్ తర్వాత గొడవలతో రణరంగంలా మారిన చంద్రగిరి, పల్నాడు, తాడిపత్రిలో పరిస్థితి మాత్రం పిన్ తీసిన బాంబులా ఉంది. అది ఎప్పుడైనా పేలే ప్రమాదం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. అందుకే ముందు జాగ్రత్తగా అక్కడ అధికారులను అప్రమత్తం చేశారు. పరిస్థితి సద్దుమణిగేందుకు ఏర్పాటు చేసిన సిట్ బృందాలు ఆ మూడు ప్రాంతాల్లో కాపు కాశాయి. మూడు ప్రాంతాలు కూడా ఖాకీ నిఘా నీడలో ఉన్నాయి. వాటితోపాటు ఇంకా సమస్యాత్మకంగా భావించిన ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా పెట్టింది ఎన్నికల సంఘం. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకున్న ఎన్నికల సంఘం కూడా పటిష్ట చర్యలు తీసుకుంటోంది. ప్రత్యర్థులను రెచ్చగొట్టేందుకు వీలు లేకుండా ర్యాలీ, ఊరేగింపులను కూడా నిషేధించింది. బాణసంచా విక్రయాలు, పేలుళ్లపై ఆంక్షలు పెట్టింది. పలు జిల్లాల్లో బాణసంచా విక్రయదారులపై కూడా దాడులు చేస్తోంది. సమస్యాత్మక ప్రాంతాల్లోనే కాకుండా దాదాపు అన్ని నియోజకవర్గాల్లో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నారు. అనుమానితులను గుర్తింపు కార్డులు లేని వాళ్లను అదుపులోకి తీసుకుంటున్నారు. రిజిస్ట్రేషన్ లేని, సరైన పత్రాలు లేని వాహనాలను సీజ్ చేస్తున్నారు.అయినా ప్రజల్లో ఇంకా ఏదో సందేహం వెంటాడుతూనే ఉంది. ఎన్నికల రోజుల ఎలాంటి పరిణామాలు చోటు చేసుకుంటాయో అన్న ఆందోళన అందరిలో ఉంది. అసలు ఆ రెండు రోజులు అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లకపోవడమే ఉత్తమం అని చాలా మంది ప్రజలు మాట్లాడుకుంటున్నారు.చంద్రగిరిలో మొన్న జరిగిన ఘర్షణల్లో విద్యార్థులు, టెక్కీలపై కూడా పోలీసులు కేసులు పెట్టారు. దీంతో కౌంటింగ్ సమయానికి ఇంట్లో ఉండే యువకులు, ఉద్యోగులు విహారయాత్రలకు వెళ్లిపోవాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. లేకుంటే అనవసరంగా కేసుల్లో ఇరుక్కునే ప్రమాదం ఉందని చిన్న ఘర్షణలు జరిగినా కేసులు తప్పవనే ఆలోచన వారు చేస్తున్నారు. ఇప్పటికే చంద్రగిరిలో చాలా మంది టెక్కీలు తమను అనవసరంగా కేసుల్లో ఇరికించారని ఎన్నికల సంఘానికి మొరపెట్టుకున్నారు. ఆ టైంలో ఊరిలో ఉన్నందునే తమపై కేసులు పెట్టారని అంటున్నారు. దీనిపై ఈసీ కూడా ఆరా తీస్తున్నట్టు తెలుస్తోంది. కౌంటింగ్ రోజు ప్రశాంతంగా ఇంట్లో ఉండి విజేతలు ఎవరో లెక్కలు చూసుకోండి తప్ప ఆ రెండు రోజులు మాత్రం బయటకు రాకండని సోషల్ మీడియాలో ప్రచారం నడుస్తోంది. వేరే రాష్ట్రాల్లో ఉన్న సన్నిహితులు కూడా ఆంధ్రప్రదేశ్లో ఉన్న బంధువులకు ఇదే సలహా ఇస్తున్నారు. పోలీసు వ్యవస్థ, ఎన్నికల సంఘం మరింత ఫోకస్డ్గా ఉండి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని కోరుకుంటున్న వాళ్లు కూడా ఉన్నారు.

# జగన్కు కడప టెన్షన్!? ఖర్చు 600 కోట్లు!!

మొదటి పేజి తరువాయి



ఆ క్రమంలో కడప జిల్లాలో ఎన్నికలు వైసీపీ, ఎన్డీఏ కూటమితో పాటు కాంగ్రెస్కు కూడా సవాలుగా మారాయి. ఒకింత ఆలస్యంగా ఎంట్రీ ఇచ్చిన పీసీసీ చీఫ్ షర్మిల నేతృత్వంలో కాంగ్రెస్ జిల్లాలో బలమైన అభ్యర్థులనే పోటీకి దింపింది. దాంతో అక్కడ ఎన్నికల ప్రచారం హోరాహోరీ సాగిందిఅన్ని పార్టీల అభ్యర్థులు డబ్బులను మంచినీళ్లప్రాయంగా ఖర్చు చేశారంట. ఈ సారి కడప లోక్సభ సెగ్మెంట్ పరిధిలో ఎన్నికల ఖర్చు ఎంత లేదన్నా 600 కోట్ల రూపాయలు ఉంటుందని రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు. ఎన్నికలకు ఆరు నెలల ముందు నుంచే టీడీపీ .. బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ అంటూ జనంలోకి వెళ్లింది. దానికి ముందు నుంచే వైసీపీ నేతలు గడప గడపకు మన ప్రభుత్వం పేరిట ఇళ్ల చుట్టూ తిరిగారు. అలా అప్పటి నుంచే పార్టీ నాయకుల జేబులకు చిల్లులు పడటం మొదలైంది.అయితే టీడీపీ నేతలు సొంత ఖర్చుతో తిరగడం మొదలుపెడితే .. వైసీపీ నాయకులు ఆ కర్చుని గవర్నమెంట్ అకౌంట్లో వేసిన నడిపించేశారు. గడపగడప ప్రోగ్రాంని ప్రభుత్వ కార్యక్రమంలా నిర్వహించారు. ఇక ఎన్నికల షెడ్యూలు దగ్గర పడేకొద్దీ పార్టీల ప్రచారాలు ముమ్మరమయ్యాయి. షెడ్యూల్ వెలువడ్డాక పీక్ స్టేజ్కి చేరాయి. పోల్ మేనేజ్మెంట్లో ఎవరూ ఎక్కడా తగ్గలేదంట. అధికార పార్టీ బద్వేల్, ప్రొద్దుటూరు, పులివెందులలో పెద్ద ఎత్తున ఖర్చు పెట్టిందంటున్నారు. ఓటుకు సరాసరి వెయ్యి నుంచి 3 వేల వరకు ఇవ్వడంతో ఎన్నికల ఖర్చు అమాంతంగా పెరిగిందిట.అన్ని పార్టీల నేతలు షెడ్యూలు రాక ముందునుంచే ప్రచారం నిర్వహించారు. ఇక షెడ్యూలు వచ్చిన తరువాత రోజువారి ప్రచారాలు, వచ్చిన వారికి డబ్బులు, మద్యం, ఫ్లెక్సీలు, ఎలక్ట్రానిక్ మీడియా ప్రింట్ మీడియాకు ప్రకటనలు, సోషల్ మీడియాలో కాన్వాసింగ్, కరపత్రాలు, ప్రచార వాహనాలు ఇలా అన్నీ కలుపుకుంటే ఖర్చు భారీ స్థాయికి చేరింది. టీడీపీ, వైసీపీ ఏమాత్రం తీసిపోకుండా పోటీ పడి ఓట్లను కొనుగోలు చేశాయంటున్నారు. 80 శాతం మంది ఓటర్లకు డబ్బులు పంపిణీ చేసినట్లు జిల్లాలో టాక్ నడుస్తుంది.కడపలో ఓటుకు వెయ్యి చొప్పున రెండు పార్టీలు పంపిణీ చేశారంట. అంటే ఒక్కో పార్టీ ఓట్ల కోసమే 20 కోట్లు ఖర్చు పెట్టినట్లు చెప్తున్నారు. మిగతా పార్టీలు శక్తిమేర చెల్లించాయంట. కడపలో చంద్రబాబునాయుడు, సీఎం జగన్ల భారీ బహిరంగసభలు జరగాయి. ఆ మీటింగులకు కూడా కోట్లలోనే ఖర్చైనట్టు లెక్కలు వినిపిస్తున్నాయి. మైదుకూరులో హోరాహోరీ ఎన్నికలు జరిగాయి. పాతకాపులే మళ్లీ పోటీ పడ్డారు. ఈ సారి ఎలాగైనా గెలవాలన్న కషితో టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్ యాదవ్ సర్వశక్తులు ఒడ్డారు. వైసీపీ నుంచి టీడీపీలోకి పెద్దఎత్తున చేరికలు జరిగాయి.మైదుకూరులో పోలింగ్ రోజు కూడా రెండుపార్టీలు దేనికి తీసిపోలేదు .. ఒక్కో ఓటుకు ఒక్కో పార్టీ 2వేలు పంచిందంట అంటే ఒక్కో పార్టీ ఓట్లకోసమే సుమారు రూ.40 కోట్లు ఖర్చు పెట్టినట్లు అంచనా వేస్తున్నారు. ఇతర ఖర్చులు ఎంత తక్కువ అనుకున్నా 10 కోట్లు ఉంటాయి. అంటే రెండు పార్టీలు కలుపుకుంటే 100 కోట్లకు పైగా ఖర్చు పెట్టాయని ఆ నియోజకవర్గంలో ప్రజలు చెవులు కొరుక్కుంటున్నారు.బద్వేలు పొత్తులో భాగంగా బిజేపీకి కేటాయించారు. వైసీపీ నుంచి సిట్టిగ్ ఎమ్మెల్యే సుధారాణి పోటీ చేశారు. ఇక్కడ బీజేపీ రూ. వెయ్యి పంచితే వైసీపీ రూ. 1500 పంచిందంటున్నారు. కమలాపురంలో.. టీడీపీ నుంచి పుత్తా కృష్ణచైతన్యరెడ్డి తొలిసారిగా బరిలో దిగితే వైసీపీ నుంచి జగన్ మేనమామ, సిట్టింగ్ ఎమ్మెల్యే రవీంద్రనాథ్రెడ్డి పోటీ చేశారు. ఎలాగైనా ఈసారి గెలవాలనే కసితో టీడీపీ శ్రేణులు ప్రచారంలో పనిచేశాయి. హ్యాట్రిక్ విజయంపై కన్నేసిన రవీంద్రనాథ్రెడ్డి కూడా సర్వశక్తులు ఒడ్డారు .. ప్రధాన ప్రత్యర్థుల పట్టుదలలతో కమలాపురం ఓటర్ల పంట పడిందంట .. రెండు పార్టీల వారు ఓటుకు రెండు వేలు రేటు కట్టి పంచారంటున్నారు.ప్రొద్దుటూరు ఎన్నికలు జిల్లావ్యాప్తంగా ఆసక్తి రేకెత్తించాయి. టీడీపీ నుంచి మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి పోటీ చేయగా.. వైసీపీ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి పోటీ చేశారు. రాచమల్లు ఆర్థికంగా బలవంతుడు.. ఆయన ఒక్కో ఓటుకు 2,500 పంచారని అంటున్నారు. కొన్నిచోట్ల ముక్కుపుడకలు, చీరలు, కాళ్ల పట్టీలు సైతం గిఫ్టులుగా ఇచ్చారంట. టీడీపీ 2 వేలు పంపిణీ చేసినట్లు తెలుస్తుంది. మొత్తానికి ప్రొద్దుటూరులో రెండు పార్టీ ఎన్నికల ఖర్చు 100 కోట్ల మార్క్ దాటిందన్న ప్రచారం జోరుగా సాగుతోంది.జమ్మలమడుగు లో సీట్ల సర్దుబాటులో భాగంగా బీజేపీ నుంచి మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డి పోటీ చేయగా వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే సుధీర్రెడ్డి బరిలో నిలిచారు. ఇద్దరూ ఏ మాత్రం తీసిపోకుండా ఒక్కో ఓటుకు 2వేలు పంచారంట చీరలు, ఇతరత్రా వస్తువులు కూడా తాయిలాలుగా ఇవ్వడంతో అక్కడ 80కోట్లు పైమాటే ఖర్చు అయిందని చెబుతారు.ఇది సీఎం జగన్ సొంత నియోజకవర్గం పులివెందులలో కూడా భారీగానే పంపిణీలు జరిగాయంట. జగన్పై టీడీపీ నుంచి మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి బరిలో దిగారు. మరోవైపు వివేకాను చంపిన హంతకులకు ఓటు వేయవద్దని వివేకా కూతురు సునీత, జగన్ సోదరి షర్మిల పులివెందుల నియోజకవర్గ వ్యాప్తంగా విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. వివేకా హత్య వ్యవహారం ఎక్కడ డ్యామేజ్ చేస్తుందో అన్న భయంతో వైసీపీ శ్రేణులు .. కొన్ని ప్రాంతాల్లో 2,500 నుంచి 3వేల వరకు పంపిణీ చేశారని అంటున్నారు. ఇక టీడీపీ కూడా వెయ్యి పంచిందంట.ఓట్ల కొనుగోలే కాకుండా సీఎం జగన్ ప్రొద్దుటూరు, పులివెందుల, మైదుకూరు, కడపలో జరిగిన బహిరంగసభల్లో పాల్గొన్నారు. వాటిని ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పార్టీ శ్రేణులు జనసమీకరణకు విచ్చలవిడిగా డబ్బులు ఖర్చు చేశాయి సభకు వచ్చిన వారికి డబ్బు, మద్యం, బిర్యానీలు సరఫరా చేయడంతో భారీగా ఖర్చు అయిందంటున్నారు. టీడీపీ కడప, ప్రొద్దుటూరులో నిర్వహించిన సభలకు చంద్రబాబునాయుడు వచ్చారు. వాటికి కూడా గట్టిగానే ఖర్చైందంట.అసంతృప్తి నేతలను కూడా వైసీపీ అభ్యర్థులు క్యాష్ కొట్టి లైన్లోకి తెచ్చుకున్నారంట.. పులివెందులలో అయితే నాయకుడు స్థాయిని బట్టి లక్ష మొదలుకుని 20 లక్షల వరకు ఇచ్చినట్లు చెబుతారు. ఇదే ఫార్ములాను - జమ్మలమడుగు, ప్రొద్దుటూరులో అమలు చేశారంట. ఇక ఇతర పార్టీల్లోని వారిని కూడా డబ్బులు ఇచ్చి వైసీపీలోకి తీసుకువచ్చారన్న ప్రచారం జరుగుతుంది. మొత్తమ్మీద బూత్, ఇతరత్రా ఖర్చులు కలిపితే ఏడు సెగ్మెంట్లలో 600 కోట్లు ఈజీగా ఖర్చయ్యాయంటున్నారు విశ్లేషకులు.

### మన గీతానికి పక్క రాష్ట్రం వారు

# పని చేయడమేమిటి...?

మొదటి పేజి తరువాయి

ఈ గీతం విషయంలో గత ప్రభుత్వం తప్పులు చేసిందన్నారు. తెలంగాణ ఏర్పాటుకు ముందే ఇది ఎంతో ప్రాచుర్యం పొందిందని గుర్తు చేశారు. అయితే ఈ గీతానికి సంగీతం అందించమని... ప్రముఖ సంగీత దర్శకుడు కీరవాణిని కోరటం చారిత్రక తప్పిదమవుతుందని పేర్కొంది. తెలంగాణ అస్తిత్వం మీకు (సీఎం రేవంత్ రెడ్డి) తెలియంది కాదు... ఉద్యమం ఎందుకు పుట్టిందో కూడా తెలియంది కాదు... మన ఉద్యోగాలు మనకే... మన అవకాశాలు మనకే అనే నినాదంతో ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడిందని గుర్తు చేసింది. సకల జనుల సహకారంతో... అమరవీరుల త్యాగంతో రాష్ట్రం ఏర్పడిందని... ఈ నేపథ్యంలో ఈ గీతాన్ని పక్క రాష్ట్రాలవాళ్లు పాడటం ఏమిటని ఆ లేఖలో ఆవేదన వ్యక్తం చేశారు. అలా చేస్తే తెలంగాణ కళాకారులను అవమానించడమే అవుతుందన్నారు. తెలంగాణలోనూ ఎంతోమంది ప్రతిభావంతులు ఉన్నారని... కాబట్టి మన తెలంగాణ వారికి అవకాశమిచ్చి మనవారికి గౌరవాన్ని ఇస్తారని ఆశిస్తున్నామని తెలిపింది. తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర గీతంపై కసరత్తు చేస్తోంది. జూన్ 2న సోనియా గాంధీ చేతుల మీదుగా ఈ గీతాన్ని విడుదల చేయాలని నిర్ణయించింది. అందెశ్రీ రాసిన జయ జయహే తెలంగాణ గీతానికి కొన్ని మార్పులు చేశారు. ఒకటిన్నర నిమిషాల నిడివిలో ఈ గీతం సిద్ధమవుతోంది. ఈ గేయాన్ని కీరవాణితో తెలంగాణ ప్రభుత్వం కంపోజ్ చేయించింది. ఈ అంశంపై తెలంగాణ సినీ మ్యూజిషియన్స్ అసోసియేషన్... సీఎంకు లేఖ రాసింది.

### ఏపీలో హింసాత్మక ఘటనల నేపథ్యంలో...

# ప్రతి జిల్లాకు ప్రత్యేక పోలీసు అధికారుల నియామకం

ఏపీలో పోలింగ్ రోజున, ఆ తర్వాత అల్లర్లు

పల్నాడు, తిరుపతి, అనంతపురం జిల్లాల్లో ఘటనలు

జూన్ 4న ఓట్ల లెక్కింపు

అదనపు ఎస్పీ, డీఎస్పీ స్థాయి అధికారులను నియమిస్తూ డీజీపీ ఉత్తర్వులు




అమరావతి: ఏపీలో పోలింగ్ రోజున, ఆ తర్వాత పలు హింసాత్మక ఘటనలు జరిగిన సంగతి తెలిసిందే. తిరుపతి, పల్నాడు, అనంతపురం జిల్లాలు అల్లర్లతో అట్టుడికాయి. ఈ నేపథ్యంలో, రాష్ట్ర ప్రభుత్వం ప్రతి జిల్లాకు ప్రత్యేక పోలీసు అధికారులను నియమించింది. అడిషనల్ ఎస్పీ, డీఎస్పీ స్థాయి అధికారులను నియమిస్తూ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. మొత్తం 56 మందిని ప్రత్యేక అధికారులుగా నియమించారు. ఇవాళ సాయంత్రం లోగా ఆయా జిల్లాల ఉన్నతాధికారులకు రిపోర్ట్ చేయాలని వారిని ఆదేశించారు. సున్నిత ప్రాంతాల్లో శాంతిభద్రతల బాధ్యతలను ప్రత్యేక అధికారులకు అప్పగించాలని డీజీపీ తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా, సమస్యాత్మక ప్రాంతాల్లో ఒకటిగా ఉన్న పల్నాడు జిల్లాకు 8 మంది పోలీసు అధికారులను కేటాయించారు. వారిలో ఆరుగురు అదనపు ఎస్పీలు, ఇద్దరు డీఎస్పీలు ఉన్నారు.

# ఆరో దశ లోక్సభ ఎన్నికల పోలింగ్ షురూ..

మొదటి పేజి తరువాయి



జూన్ 1న జరిగే చివరి విడతతో లోక్సభ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ముగియనుంది. జూన్ 4న ఒకేసారి ఓట్లను లెక్కించి ఫలితాలు విడుదల చేయనున్నారు. ఆరో విడత పోలింగ్ జరగనున్న రాష్ట్రాల జాబితాలో బీహార్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, ఢిల్లీ, హర్యానా రాష్ట్రాలు ఉన్నాయి. బీహార్లో 8, హరియాణాలో 10, జమ్ముకశ్మీర్లో 1, జార?ండ్లో 4, ఢిల్లీలో 7, ఒడిశాలో 6, యూపీలో 14, బెంగాల్లో 8 స్థానాల్లో పోలింగ్ జరగనుంది. జమ్ముకశ్మీర్లోని అనంతనాగ్లో మూడో విడతలోనే పోలింగ్ జరగాల్సి ఉండగా వాయిదా పడింది. ఆరో విడతలో ఆ లోక్సభ స్థానానికి పోలింగ్ నిర్వహిస్తున్నారు. ఆరో విడతలో వివిధ పార్టీల నుంచి కీలక అభ్యర్థులు బరిలో దిగుతున్నారు. ఢిల్లీలో 7 లోక్సభ స్థానాలకు ఆరో విడత ఎన్నికల్లోనే పోలింగ్ జరగనుంది. లిక్కర్ స్కామ్ కేసు, స్వాతి మాలివాల్పై దాడి లాంటి పరిణామాలు అక్కడి రాజకీయాలను వేడెక్కించాయి. దాంతో ఆరో విడత లోక్సభ ఎన్నికలపై ఎప్పుడూ లేనంతగా ఉత్కంఠ నెలకొంది. న్యూఢిల్లీ నుంచి కేంద్ర మాజీ మంత్రి, దివంగత సుష్మా స్వరాజ్ కూతురు బన్సూరి స్వరాజ్ బీజేపీ తరపున బరిలోకి దిగుతున్నారు. ఆమె ఆప్ అభ్యర్థి సోమ్నాథ్ భారతితో తలపడనున్నారు. ఈశాన్య ఢిల్లీలో ఈసారి టఫ్ ఫైట్ కనిపించేలా ఉంది. కాంగ్రెస్ తరపున కన్హయ్య కుమార్ బరిలోకి దిగగా, బీజేపీ తరపున సిట్టింగ్ ఎంపీ మనోజ్ తివారీ పోటీ చేస్తున్నారు. యూపీలోని సుల్తాన్పూర్లో బీజేపీ తరపున మేనకాగాంధీ బరిలోకి దిగారు. సమాజ్వాది పార్టీ నుంచి రామ్ బువల్ నిషద్ బరిలో ఉన్నారు. ఇక యూపీలోనే మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్ సోదరుడు ధర్మేంద్ర యాదవ్ ఆజాంగఢ్ నుంచి బరిలోకి దిగారు. 2014, 2019 ఎన్నికల్లో ఇక్కడి నుంచే బరిలోకి దిగిన అఖిలేష్ యాదవ్ విజయం సాధించారు. ఈ సారి కూడా తమ పార్టీ అభ్యర్థి గెలుస్తాడన్న నమ్మకంతో ఉన్నారు. ఒడిశాలోని పూరి నియోజకవర్గంలో బీజేపీ తరపున సంబిత్ పాత్ర పోటీ చేస్తున్నారు. ఇక్కడ బీజేడీ తరపున అరుప్ పట్నాయక్, కాంగ్రెస్ నుంచి జయ్ నారాయణ్ పట్నాయక్ బరిలో ఉన్నారు. హర్యానాలోని కురుక్షేత్రలో బీజేపీ తరపున నవీన్ జిందాల్ బరిలో ఉన్నారు. కర్నాల్ నియోజకవర్గం నుంచి హర్యానా మాజీ ముఖ్యమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ పోటీ చేస్తున్నారు. గుడ్గావ్లో కాంగ్రెస్ తరపున రాజ్ బబ్బర్.. బీజేపీ సిట్టింగ్ ఎంపీ ఇంద్రజిత్ సింగ్తో తలపడుతున్నారు. ఒడిశాలోని 42 అసెంబ్లీ స్థానాలకు కూడా లోక్సభ ఆరో విడత ఎన్నికలతోపాటే పోలింగ్ జరుగుతోంది.

# ఇటీవలే రోడ్డు ప్రమాదానికి గురైన జునెద్ కు 5000/- ఆర్థిక సాయం చేసిన ప్రముఖ సంఘ సేవకులు

## శివంపేట్ జెడ్పీటిసి పబ్బ మహేష్ గుప్తాలి



నర్సాపూర్ **(గౌతమ్ న్యూస్ ):** శివంపేట్ మండలంలోని చిన్నగొట్టిముక్కల గ్రామానికి చెందిన "ఖదీర్ కొడుకు జునేద్" ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో గాయాలైన విషయం తెలుసుకున్న జిల్లా ఆర్థిక ప్రణాళిక సభ్యుడు - ప్రముఖ సంఘ సేవకుడు మండల జడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్తా తన సొంత నిధులతో 5000/- రూపాయలు ఆర్థిక సహాయం చేశాడు. ఈ కార్యక్రమంలో శివ, గౌస్, గ్రామ అధ్యక్షుడు నసిరుద్దీన్, రసూల్, మాజీ ఉపసర్పంచ్ బిక్షపతిరావు, ఎంపీటీసీ దశరథ, హఫీజ్ ,బాధితుని తండ్రి ఖదీర్, శంకర్ గౌడ్,నారన్ రావు, మాజీ ఎంపీటీసీ నర్సింగరావు , మాజీ సర్పంచ్ బాలమణి నరేందర్, పాపయ్య చారి, ఐదో వార్డ్ నెంబర్ సలీం, అక్బర్, మణికుమార్ ,అన్వర్, గుమ్మడి ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# భారీ వర్షాల పట్ల ప్రజలు జాగ్రత్త!!

## ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దు!!.....

## వనపర్తి పట్టణ ఎస్సై జయన్న



నాగర్ కర్నూల్ వనపర్తి బ్యూరో**(గౌతమ్ న్యూస్ ):** రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న అకాల వర్షాల వల్ల అల్పపీడనం బంగాళాఖాతంలో వచ్చి ఏ సమయంలో భారీ వర్షాలు వచ్చినా వనపర్తి పట్టణ ప్రజలు ముఖ్యంగా విద్యార్థులు చిన్న పిల్లలు తగు జాగ్రత్త వహించాలని వనపర్తి పట్టణ ఎస్ఐ జయన్న తెలిపారు, తెలిసి తెలవక ప్రాణాలు కొని తెచ్చుకోవద్దని ముందు జాగ్రత్త పాటిస్తే ఎలాంటి ప్రాణనష్టం జరగదని ఆయన ఈ సందర్భంగా అన్నారు, ఉండే వర్షాకాలం ప్రారంభం అవుతున్న సందర్భంలో ఏ సమయంలో క్షణంలో వర్షం వచ్చినా విద్యుత్ వైర్ల కింద చెట్ల కింద, శిథిలావస్థలో ఉన్న మట్టి మిద్దెలు, ఇండ్లు, కింద వేచి ఉండకుండా జాగ్రత్త ఉండాలని గత కొన్ని సంవత్సరాల క్రితం వనపర్తి బస్సు డిపో ముందు వర్షం వస్తున్న సమయంలో తలదాచుకోవడానికి వెళ్లిన ఒక వ్యక్తి ఇల్లు స్లాబు పెచ్చులు ఊడిపడి అక్కడే ఉన్న వ్యక్తి మరణించిన విషయం ప్రతి ఒక్కరు గుర్తుపెట్టుకోవాలని ఆయన సూచించారు, వర్షాలతో పాటు గంటకు 40 , నుంచి 50 కిలోమీటర్ల వేగంతో వీచే గాలులు ఈ సీజన్లో రాబోయే కొన్ని రోజుల్లో వచ్చే అవకాశాలు ఉన్నాయని ఈదురు గాలులతోపాటు భారీ వర్షాలకు బయటకి రాకుండా కరెంట్ షాటుకు గురి కాకుండా మనం ఉన్నచోట ఏ విధంగా ఉందో ఆలోచించి నిలబడాలని తొందరపాటు చర్య వల్ల వర్షం వస్తే వెంటనే తల దాచుకోవడానికి ఏదో ఒక ప్రదేశంలో ఉండడానికి ప్రయత్నిస్తుంటారని అందుకోసం ఎక్కడ ఎలాంటి ఇబ్బంది లేని ప్రదేశాలలో తల దాచుకోవాలని ఎస్సై జయన్న కోరారు, వర్షాకాలం సందర్భంగా విద్యుత్ శాఖ అధికారులు కూడా తగు జాగ్రత్త పాటించి ప్రజలకు ప్రాణ నష్టం జరగకుండా తుప్పు పట్టిన వైర్లు విద్యుత్ స్తంభాలను తొలగించాలని వనపర్తి పట్టణ కేంద్రంలో ప్రమాద భరితంగా ఉన్న విద్యుత్ కరెంటు స్తంభాలతో పాటు చెట్లకు అడ్డంగా తగిలి ఉన్న వైర్లను తొలగించాలని ఎస్సై కోరారు,

# ఏనుగుల రాకేష్ రెడ్డి విజయం కోసం బిఆర్ఎస్ ప్రచారం

## బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాత గణేష్



బయ్యారం, **(గౌతమ్ న్యూస్ ):** వరంగల్ ఖమ్మం నల్గొండ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఉప ఎన్నిక బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డి విజయాన్ని ఆకాంక్షిస్తూ, మండలంలోని బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు,నాయకులు మండల ఎమ్మెల్సీ ఓటర్లను కలిసి ఏనుగుల రాకేష్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు తాత గణేష్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ



అభ్యర్థి సమాజ సేవకోసమే పార్టీలో చేరారని,ఉన్నత విద్యావంతుడని,మన మధ్యనే ఉండే ఇ లాంటి అరుదైన నాయకులు చట్టసభల్లో ప్రవేశించినట్లయితే తమ సమస్యలు చేపుకొలేని లక్షల మంది నిరుద్యోగుల గళమై గర్జిస్తాడని, ప్రశ్నించే గొంతుక వైపు పట్ట భద్రులు నిలిచి మండల పట్టభద్రులు ఆలోచించి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థించారు. అభూత కల్పనలకు తావివ్వకుండా ఉండాలని విజ్ఞతతో తమ ఓటు వినియోగించుకోవాలని కోరారు. మాయదారి మల్లన్న మాటలు గడప దాటవని ,యూట్యూబ్ జర్నలిజంతో ప్రతి ఒక్కరినీ బ్లాక్ మెయిల్ చేసి కోట్లు దండుకున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నీలారపు సంపత్,రేఖా యాకయ్య , మండా నవీన్,కీర్తి ఉదయ్, కంబాల లెనిన్, దావ శ్రీకాంత్ పోతుగంటి గణేష్,హెచ్,రమేష్, మందుల గణేష్, నాగరాజు,రవి,ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

# తీన్మార్ మల్లన్న గెలుపే నిరుద్యోగులకు మలుపు

## మల్లన్న గెలుపు లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో ఇంటింటి ప్రచారం

## ఇల్లందు ఏ -బ్లాక్ ఉపాధ్యక్షులు రావూరి రామ చంద్రయ్య



బయ్యారం **(గౌతమ్ న్యూస్ ):** మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం లో నల్లగొండ ఖమ్మం వరంగల్ పట్టభద్రుల ఎం. ల్. సి.ఎన్నికల ప్రచారంలో భాగంగా బయ్యారం మండలంలో చింతపండు నవీన్ (తీన్మార్ మల్లన్న) ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపు కోరుతూ ఇల్లందు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఏ బ్లాక్ ఉపాధ్యక్షులు రావూరి రామచంద్రయ్య బయ్యారం మండలం లోని పలు గ్రామాలలో ఇంటింటి ప్రచారంలో పాల్గొనడం జరిగింది. ఈ యొక్క ప్రచారంలో రావూరి రామచంద్రయ్య మాట్లాడుతూ పట్టభద్రులు ప్రతి ఒక్కరు తీన్మార్ మల్లన్నకు మీ మొదటి ప్రాధాన్యత ఓటును వేసి అధిక మెజారిటీతో గెలిపించాలని బ్యాలెట్ పత్రంలో రెండో నెంబర్ పై మీ ఒకటో సంఖ్య వేసి విజయ పతాకాన్ని ఎగురవేయాలని అందరినీ కోరడం జరిగింది.ఎన్నో నిర్బంధాలను ఎదుర్కొని బి ఆర్ ఎస్ ప్రభుత్వం చేస్తున్న అవినీతిని ఎదిరిస్తూ ప్రశ్నించే గొంతుకగా సామాజిక మధ్యమాల్లో డైనమిక్ లీడర్ గా గత తెలంగాణ ప్రభుత్వం యొక్క కుటిల రాజకీయ ఎత్తులను చిత్తు చేసుకుంటూ ప్రశ్నించే గొంతుకతో మీ ముందుకు వచ్చాడని అటువంటి వ్యక్తికి మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నాయకత్వనా కాంగ్రెస్ పీసీసీ ప్రధాన కార్యదర్శి వెన్నం శ్రీకాంత్ రెడ్డి, డీసీసీబీ అధ్యక్షులు భరత్ చందర్ రెడ్డి, మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళి నాయక్,ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆదేశాల మేరకు విస్తృత ప్రచారం చేయడం జరుగుతుందని అయన అన్నారు.ఈ కార్యక్రమంలో బయ్యారం మండలం సింగారం గ్రామంలో చాట్ల వెంకన్న రాందాసు చంద్రు ఎంపీటీసీ చెరుకుపల్లి రవి బాదావత్ లాల్య సపటూ రామదాసు భానుచంద్రు కొత్తపల్లి సీతారాములు సుంచు రాంబాబు కోమంద్ర వెంకన్న మేదరి నర్సయ్య గుగులోతు లక్ష్మ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, తీన్మార్ మల్లన్నకు లక్ష ఓట్ల భారీ మెజార్టీతో గెలిపించాలని వారు అన్నారు కాంగ్రెస్ పార్టీ అభిమానులు పాల్గొన్నారు.

# తీన్మార్ మల్లన్న గెలుపు కోసం ప్రచారాన్ని హెూరెత్తించిన కాంగ్రెస్ పార్టీ

## సొసైటీ చైర్మన్ మూల మధుకర్ రెడ్డి.



బయ్యారం, **(గౌతమ్ న్యూస్ ):** నల్లగొండ ఖమ్మం వరంగల్ పట్టభద్రుల ఎం. ల్. సి.ఎన్నికల ప్రచారంలో భాగంగా కొత్త పేట, గంధం పల్లి గ్రామ పంచాయతీలో చింతపండు నవీన్ (తీన్మార్ మల్లన్న) ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపు కోరుతూ బయ్యారం సొసైటీ చైర్మన్



మూల మధుకర్ రెడ్డి, మండల అధ్యక్షులు ముసలయ్య ఆధ్వర్యంలో పలు గ్రామాలలో ఇంటింటి ప్రచారం నిర్వహించడం జరిగింది.ఈ యొక్క ప్రచారంలో మూల మధుకర్ రెడ్డి మాట్లాడుతూ పట్టభద్రులు ప్రతి ఒక్కరు తీన్మార్ మల్లన్నకు మీ మొదటి ప్రాధాన్యత ఓటును వేసి అధిక మెజారిటీతో గెలిపించాలని బ్యాలెట్ పత్రంలో రెండో నెంబర్ పై మీ ఒకటో సంఖ్య వేసి విజయ పతాకాన్ని ఎగురవేయాలని అందరినీ కోరడం జరిగింది.ఎన్నో నిర్బంధాలను ఎదుర్కొని బిఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న అవినీతిని ఎదిరిస్తూ ప్రశ్నించే గొంతుకగా సామాజిక మధ్యమాల్లో డైనమిక్ లీడర్ గా గత తెలంగాణ ప్రభుత్వం యొక్క కుటిల రాజకీయ ఎత్తులను చిత్తు చేసుకుంటూ ప్రశ్నించే గొంతుకతో మీ ముందుకు వచ్చాడని అటువంటి వ్యక్తికి మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆదేశాల మేరకు విస్తృత ప్రచారం చేయడం జరుగుతుందని అయన అన్నారు ఈ కార్యక్రమం లో భూక్యా ప్రవీణ్ నాయక్, కిషన్ నాయక్, సాల్లా సురేష్, సతీష్, రవి, రాంబాబు, దుర్గ రావు తదితరులు పాల్గొన్నారు.

### బయ్యారం ప్రచారంలో భాగంగా ......

ఖమ్మం వరంగల్ నల్లగొండ నియోజకవర్గం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా శనివారం మండల కేంద్రం బస్టాండ్ సెంటర్ లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న కు మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించటం జరిగింది.ఈ ప్రచారంలో బయ్యారం మండల కాంగ్రెస్ నాయకులు, బయ్యారం పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాయిని శ్రీనివాస్ రెడ్డి, బయ్యారం



మాజీ వార్డు మెంబర్ పోతుగంటి సుమన్, పగడాల శ్రీనివాస్, వీరబోయిన సంపత్, గంద్రాతి బాస్కర్ రెడ్డి, బీరెడ్డి శ్రీనివాస్, రావుల శ్రీనివాస్, ఖాదర్, జానీ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు..

# గతం ఎంతో ఘన కీర్తి

## నిజాం కాలం నాటి ఆర్టీసీ చరిత్ర మొట్టమొదటి డిపో వనపర్తి



నాగర్ కర్నూల్ వనపర్తి బ్యూరో**(గౌతమ్ న్యూస్ ):** గతం ఎంతో ఘన కీర్తి వనపర్తి జిల్లా కేంద్రంలో ఎన్,ఎస్,ఆర్,ఆర్,టి,డి నిజాం స్టేట్ రైల్వే అండ్ రోడ్డు ట్రాన్స్పోర్ట్ డిపార్ట్మెంట్ గా నిజాం కాలం లో మొట్టమొదటి డిపోగా చరిత్రలలో నిలిచిపోయింది, ఆనాటి చరిత్ర నేటికీ మాయని మచ్చగా మిగిలిపోయింది, 1932 సంవత్సరంలో భారత దేశంలో మొట్టమొదటి నిజాం స్టేట్ డిపో గా వనపర్తి జిల్లా కేంద్రంలో నిజాం నవాబులు ఏర్పాటు చేశారు, భారత దేశంలోనే ప్రజా రవాణా వ్యవస్థ లేని సందర్భంలో హైదరాబాద్ సంస్థానాన్ని పరిపాలించిన 6 వ నిజం మహిముద్ అలీ ఖాన్ రెండవ కోడలైన జహీరా బేగం పెండ్లి సందర్భంలో తల్లితండ్రులు కట్నం కానుకలు కింద ఆనాడు వజ్రాలు బంగారం మొత్తం తొమ్మిది కోట్ల రూపాయల



విలువగల ఆస్తులను ఆమెకు కట్నం కింద ఇచ్చారని చరిత్రలు చెబుతున్నాయి, ఆమెకు కట్నం కింద ఇచ్చిన ఆస్తి పైన ఇస్లాం ముస్లిం మతం ప్రకారం పూర్తి హక్కులు ఉంటాయని అందుకే జహీరా బేగం హైదరాబాద్ నగరంలో నాంపల్లి రైల్వే స్టేషన్ ప్రాంతంలో పల్లకిలో పర్యటిస్తున్న సందర్భంలో ఆమె కు ప్రత్యక్షంగా ఆనాడు కేవలం రైల్వే లైన్ మాత్రమే ఉన్న నేపథ్యంలో ప్రయాణికులు నాంపల్లి స్టేషన్ లో రైలు దిగి వృద్ధులు చిన్నపిల్లలు, చేతగాని ఎంతోమంది ప్రయాణికులు తమ తమ సామాగ్రిని వస్తువులను లగేజీ బ్యాగులను తలపై పెట్టుకుని నడుచుకుంటూ పోతున్న దృశ్యాన్ని కనులారా చూసిన జహీరా బేగం తాను పల్లకిలో పర్యటిస్తూ ఆమె పేద ప్రజల కష్టాలను కళ్ళతో చూసినా ఆమె ఈ బాధలు ఎప్పుడు రాకూడదని ఎవరు పడకూడదని పేద ప్రజల కష్టాలలో జహీరా బేగం బాగం పంచుకొని తనకు కట్నం కింద ఇచ్చిన 9 కోట్ల రూపాయల డబ్బులలో 3, లక్షల 71 వేల రూపాయలు ఖర్చుపెట్టి వెంటనే ఇతర దేశాలైన స్కాట్ ల్యాండ్ నుంచి 22 బస్సులను కొనుగోలు చేసి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లో 9 ఎన్, ఎస్ ,ఆర్ ,ఆర్ టి ,డి బస్సు డిపోలను ప్రారంభించింది, అప్పట్లో ప్రతి నిజం స్టేట్ రైల్వే రోడ్డు ట్రాన్స్పోర్ట్ పేరుతో నా రిజిస్ట్రేషన్ చేయబడి ఉన్న బస్సులను ఆ తర్వాత హెచ్, వై ,జెడ్ తో నెంబరు రిజిస్ట్రేషన్ చేయగా ఆ తర్వాత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో ఏపీ జెడ్ గా మార్పు చేశారు, ఆ తర్వాత తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు తర్వాత ప్రతి బస్సు కు టి ఎస్ జెడ్ నెంబర్ నెంబర్ తో తిరుగుతున్నాయి, అనే సిరీస్ జహీరా బేగం పేరు మీద ఆనాటి నిజాం పరిపాలనలో నామకరణ చేశారు, ఇప్పటికీ జెడ్ పేరు మీద తెలంగాణ ఆర్టీసీ బస్సులతో పాటు ఆంధ్రప్రదేశ్ ఆర్టిసి బస్సులు తిరుగుతున్నాయి, ప్రజా రవాణా లేని ఆనాడు ప్రజల కష్టాలు కన్నీళ్లు బాధలు చూసిన నిజాం కాలం నాటి ఆరవ నవాబు కోడలు మానవత్వం చాటుకుని తల్లిదండ్రులు పెళ్లిరోజు ఇచ్చిన వరకట్నం డబ్బులతో బస్సులు కొనుగోలు చేసి బస్సు డిపోలను ఏర్పాటు చేసి మెరుగైన రవాణా వ్యవస్థను ఆమె తీర్చిదిద్దడంలో చరిత్రలో




మిగిలిపోయింది, మీర్ అలీ ఖాన్ కోడలైన జహీరా బేగం కృషి ఫలితంగానే ఈరోజు దేశవ్యాప్తంగా ప్రజా రవాణా ఆర్టీసీ వ్యవస్థ మెరుగుపడి ప్రజలు ప్రయాణిస్తున్నారని చెప్పడానికి సందేశం లేదు, కేవలం 120 మంది సిబ్బందితో 1932 సంవత్సరంలో వనపర్తి తో పాటు హైదరాబాదులో కేవలం రెండు డిపోలు మాత్రమే ఉన్నాయి, రాను రాను కాలానుగుణంగా మారుతున్న సాంకేతిక పరిజ్ఞానం వల్ల ఆర్టీసీ రవాణా వ్యవస్థ పూర్తిస్థాయిలో మెరుగుపడి ప్రయాణికులకు తగ్గట్టు బస్సులు, బస్సు డిపోలు ఏర్పాటు కావడం గర్వకారణం ఆనాటి ఆరవ నిజాం కాలంలో రైల్వే లైన్ వ్యవస్థ ఉన్నప్పుడు అట్టి రైల్వే లైన్ వ్యవస్థకు వనసంధానంగా నిజాం స్టేట్ రైల్వే రోడ్డు ట్రాన్స్పోర్ట్ డిపార్ట్మెంట్ గా పేరు పెట్టి ఆనాటి బస్సులను రైల్వే స్టేషన్లకు అనుసంధానం చేశారు, వనపర్తి డిపో చరిత్ర ఇప్పటికీ మరపురాని



మాయని మచ్చగా మిగిలిపోయింది, 1932లో ఏర్పాటుచేసిన డిపో ఇప్పటికి కూడా వనపర్తి డిపోలో నీ దర్శనమిస్తుంది, ఆనాడు జహీరాబాద్ బేగం కొనుగోలు చేసిన ఆర్టీసీ బస్సు ఇప్పటికీ



హైదరాబాద్ బస్సు భవన్ లో ప్రయాణికుల దర్శనం కోసం దర్శనమిస్తుంది, ప్రస్తుతం వనపర్తి ఆర్టీసీ డిపోలో 400 మంది ఆర్టీసీ కండక్టర్లు డ్రైవర్లతో పాటు సిబ్బంది పనిచేస్తున్నట్లు వనపర్తి డిపో లాభాల బాటలో ముందు వరుసలో ఉందని వనపర్తి ఆర్టిసి డిపో మేనేజర్ వేణుగోపాల్ తెలిపారు, నిజాం కాలం నాటి వనపర్తి ఆర్టీసీ డిపో ఇప్పటికి చెక్కుచెదరకుండా ప్రయాణికులకు ప్రజలకు దర్శనం ఇవ్వడం అభినందనీయమని ప్రయాణికుల సంక్షేమమే ఆర్టీసీ దేయంగా ఆర్టీసీ సంస్థ పని చేస్తుందని డిపో మేనేజర్ అన్నారు,

# నందిగామ సబ్ రిజిస్టార్ కార్యాలయం అక్రమార్కులకు అడ్డ

నందిగామ **(గౌతమ్ న్యూస్ ):** నందిగామ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అక్రమార్కులకు అడ్డగా మారుతుందన్నే విమర్శలు వినిపిస్తున్నాయి. దీనికి ఉదాహరణగా కార్యాలయం చుట్టు వెలసిన ప్రైవేటు వ్యక్తులు ఏర్పాటు చేసిన ప్రైవేటు అడ్డలు కనిపిస్తాయి. వివిధరకాల పనులు నిమిత్తం కార్యాలయానికి వచ్చే వినియోగదారులను ఆకట్టుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయి. కార్యాలయంలో రిజిస్ట్రేషన్ కు సంబంధించిన సమాచారం ఇచ్చేందుకు రిసెప్షన్ కౌంటర్ లేదు. కనీసం కార్యాలయంలో ల్యాండ్ వేల్యూషన్ మరియు నకళ్ళు, ఇతర పత్రాలకు సంబంధించిన అప్లికేషన్ కూడా దొరకవు. వీటిని వినియోగదారులు బయట ప్రైవేటు వ్యక్తులు ఏర్పాటుచేసిన అడ్డాల్లో కొనుగోలు చేయవలసి వస్తుంది. ఆ అప్లికేషన్లకు వెళ్ళిన వినియోగదారులను మీరు వెళ్లకుండానే మీకు కావాల్సినవన్నీ తెచ్చిస్తామని ప్రభుత్వ రుసుము కన్నా ఎక్కువ వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాగే కార్యాలయంలో ఆన్లైన్ రిజిస్ట్రేషన్ లో జరగవలసి ఉండగా వీటిని సైతం ఆమె ఆన్లైన్ చేసి రిజిస్ట్రేషన్ చేపిస్తామని వివిధ రకాలుగా ప్రభుత్వం విధించిన రుసుముల కంటే అధికంగా వసూలు చేస్తున్నారు. అదేమని అడిగితే మొత్తం మాకే కాదని సబ్ రిజిస్టర్ కార్యాలయంలో మామూలు ఇవ్వాలని చెబుతూ వినియోగదారుల దగ్గర ముక్కు పిండి మరి వసూలు చేస్తున్నారు. అలాగే ఈ స్టాంప్ లో పేరిట స్టాంప్ వెండర్లు పది రూపాయలు స్టాంపుకి 20, 20 రూపాయలు స్టాంపుకి 30 రూపాయలు, వంద రూపాయలు స్టాంపుకి 130 నుండి 150 వరకు వసూలు చేస్తున్నారు. అంతేకాకుండా నక్కళ్ళు మరియు వివిధ సేవలకు ఆన్లైన్ చలానాలు తీయవలసి ఉండగా కార్యాలయం చుట్టూ ఉన్న ప్రైవేటు వ్యక్తులు ప్రభుత్వ రుసుముల కన్నా రెండింతలు వసూలు చేసి చలానాలు తీసి ఇస్తున్నారు. అలాగే ఈ కార్యాలయంలో జరిగే ప్రతి రిజిస్ట్రేషన్ కు వినియోగదారుల వద్ద ప్రభుత్వ రుసుముల కన్నా ఒకటి నుండి రెండు పర్సెంట్ వసూలు చేస్తున్నారు. ఈ పర్సంటేజ్ లో కార్యాలయంలో పనిచేసే సిబ్బందికి ఇవ్వాలంటూ బహిరంగంగానే ప్రైవేటు వ్యక్తులు చెప్తుండటం గమనార్హం. సి ఆర్ డి ఏ చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత నందిగామ చుట్టుపక్కల ప్రాంతంలో సీఆర్డీఏ అనుమతులు లేకుండా వేసిన ప్రైవేటు వెంచర్లలో ప్లాట్లను అక్రమ పద్ధతిలో కార్యాలయం




చుట్టుపక్కల ఉన్న ప్రైవేటు ఏజెంట్లుగా చెప్పుకునే కొంతమంది కార్యాలయంలోని ఒక కీలక వ్యక్తి ద్వారా రిజిస్ట్రేషన్ చేస్తున్నట్లు సమాచారం. మీరు భాగవతాలు బయటకు రాకుండా ఉండేందుకు ఒక ప్రైవేటు ఏజెంటు పాత్రికేయుడుగా ఉంటూ అక్రమాలను బయటకు రానీయకుండా మరికొంతమంది పాత్రికేయులకు మామూలు ఇప్పిస్తున్నట్లు సమాచారం. ఇలా ఉంటే కార్యాలయానికి రిజిస్ట్రేషన్ నిమిత్తం వచ్చిన వినియోగదారుడు ఇచ్చిన సమాచారం మేరకు సంబంధిత స్థలాన్ని కానీ ఇల్లును కానీ కార్యాలయం సిబ్బందిలో ఒకరు స్వయంగా చూసి ఆ తర్వాత మాత్రమే రిజిస్ట్రేషన్ చేయవలసి ఉంటుంది. అయితే అధికారికంగా కార్యాలయం చేయవలసిన పనులను కార్యాలయం చుట్టూ ఉన్న ప్రైవేటు వ్యక్తులే చేస్తూ వీటిని అక్రమ పద్ధతుల్లో రిజిస్ట్రేషన్ చేయిస్తున్నట్లు సమాచారం. గత కొన్ని సంవత్సరాల క్రితం సబ్ రిజిస్టార్ కార్యాలయంలో అన్ని రకాల పనులు చేసేందుకు ప్రభుత్వం కొంతమంది వ్యక్తులకు లైసెన్సులు మంజూరు చేసింది. అయితే ఈ లైసెన్స్ వ్యక్తులు కార్యాలయాల విధులలో అనధికారి జోక్యం చేసుకుంటూ చలానాల విషయంలోనూ స్టాంపులు విషయంలోనూ భారీ కుంభకోణాలకు పాల్పడిన సంఘటనలు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కలిగించడంతో ప్రభుత్వం వారిని తొలగించింది అయినప్పటికీ వారు నేటికీ కొనసాగుతూ ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు. వీరికి స్థానిక సబరి స్టార్ కార్యాలయంలోని ఒక అసిస్టెంట్ సబ్ రిజిస్టర్ అధికారి పూర్తి సహకారం అందిస్తున్నారని ఆరోపణ వినిపిస్తున్నాయి. నందిగామ సబ్ రిజిస్టార్ కార్యాలయంలో సబ్ రిజిస్టర్ ప్రైవేట్ ఏజెంట్లతో తప్ప స్వయంగా కొన్ని పనుల నిమిత్తం వచ్చే వారితో మాట్లాడరని, ఏదైనా అడిగితే అసిస్టెంట్ సబ్ రిజిస్టార్ ని అడిగి తెలుసుకోవాలని చెప్తుంటారని వినికిడి. అయితే అసిస్టెంట్ సబ్ రిజిస్టర్ ప్రతిపనికి ఒక రేటు నిర్ణయించి ఆ రేటు ప్రకారమే ప్రైవేటు వ్యక్తుల ద్వారా పనులు చేస్తుంటారనే ఆరోపణ వినిపిస్తున్నాయి. ప్రైవేట్ రియల్ ఎస్టేట్ కి సంబంధించి అనుమతులు లేని వెంచర్ల లో పెద్ద ఎత్తున ప్లాట్లు రిజిస్ట్రేషన్ అవుతున్నాయనే ఆరోపణలో ఉన్న జిల్లా రిజిస్టారిస్థాయి అధికారులు ఎవరు నందిగామ సబ్ రిజిస్టర్ కార్యాలయం వైపు కన్ను ఎత్తి చూడటం లేదని ఆరోపణలు ఉన్నాయి. ప్రైవేటు వ్యక్తులు బడాబడా కార్యాలయం ఏర్పాటు చేసి సబ్ రిజిస్టార్ కార్యాలయంలో ప్రతి పనికి అధిక రేట్లు వసూలు చేస్తూ పనులు చక్కబెట్టుకుంటున్నరనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా నందిగామ సబ్ రిజిస్టర్ కార్యాలయం పక్కనే ఉన్న ప్రైవేటు వ్యక్తుల కార్యాలయం పై సంబంధిత అధికారులు నిఘా ఏర్పాటు చేసి వారు చేస్తున్న అవినీతి కార్యకలాపాలను నిరోధించాలని, నందిగామ సబ్ రిజిస్టార్ కార్యాలయంలో ప్రవేట్ వ్యక్తులు జోక్యాన్ని నివారించాలని, కార్యాలయంలో రిసెప్షన్ కౌంటర్ ఏర్పాటు చేసి వివిధ పనుల నిమిత్తం ఇచ్చే వారికి సలహాలు సూచనలు అందించే ఏర్పాటు చేయాలని ప్రజల కోరుకుంటున్నారు.

# కానిస్టేబుల్ కన్నె రాజు (స్విమ్మర్ రాజు) పుట్టినరోజు సందర్భంగా నిత్యవసర సరుకుల పంపిణీ కార్యక్రమం




వరంగల్(**గౌతమ్ న్యూస్ ):** పున్నెల్ గ్రామం , అయినవోలు మండలం , హనుమకొండ జిల్లాకు చెందిన కొమురవెల్లి విజయలక్ష్మి ( దివ్యాంగురాలు ) గత కొంతకాలంగా ఆర్థికంగా ఇబ్బంది పడుతుంది. విజయలక్ష్మి కి భర్త , తల్లిదండ్రులు చనిపోవడం , పిల్లలు కూడా లేకపోవడం. సొంత ఇల్లు కూడా లేదు. ఇటీవల కాలంలో కాలు , చెయ్యి కూడా విరగడం జరిగింది. బొల్లికుంట గ్రామానికి చెందిన దేవర రాజు ద్వారా ఆర్థిక సమస్యతో బాధపడుతున్న విజయలక్ష్మి కి బ్లడ్ డోనర్ అండ్ బ్లడ్ మోటివేటర్ , వరంగల్ పోలీస్ కానిస్టేబుల్ కన్నె రాజు ( స్విమ్మర్ రాజు ) తన పుట్టినరోజు సందర్భంగా 25కేజీల బియ్యం , 10 రోజులకు సరిపడా నిత్యవసర సరుకులు పంపిణీ చేయడం జరిగింది. నా పుట్టినరోజు సందర్భంగా ఈ అవకాశం కల్పించిన బొల్లికుంట గ్రామానికి చెందిన దేవర రాజు కు ప్రత్యేక కృతజ్ఞతలు

# బధిరుల ఉన్నత పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి దరఖాస్తులు స్వీకరణ

## పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జె.లక్ష్మీ నర్సమ్మ




పర్వతగిరి (గౌతమ్ న్యూస్ ): శ్రీ వేంకటేశ్వర బధిరుల ఉన్నత పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను ప్రవేశాలకు దరఖాస్తులను స్వీకరిస్తునట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జె.లక్ష్మీ నర్సమ్మ ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఆధ్వర్యంలో శ్రీ వేంకటేశ్వర బధిరుల ఉన్నత పాఠశాలలో విద్యార్థినీ, విద్యార్థులకు 1వ తరగతి నుండి 10వ తరగతి వరకు ఉచిత విద్యాబోధన, బాల, బాలికలకు వేరు వేరుగా వసతి గృహం, ఉచిత భోజనం కల్పిస్తున్నామని, మా పాఠశాలలో ప్రవేశం పొందినవారికి ప్రత్యేక బీఈడీ చేసిన అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే సమగ్ర విద్యాబోధన, ప్రతి సంవత్సరం 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు 100% ఫలితాలతో ఉత్తీర్ణత సాధించడం జరుగుతుందని తెలిపారు. ఇటీవల ప్రకటించిన పది ఫలితాల్లో 16 మంది విద్యార్థులకు గాను 16 మంది ఉత్తీర్ణులయ్యారని, వారిలో ప్రథమ, ద్వితీయ స్థానాలను డి.జ్యోత్స్న 9.5 జిపిఎ, పి.సాత్విక 9.2 జిపిఏ సాధించినట్లు తెలిపారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రత్యేకంగా చిత్రలేఖనంలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పోటీలలో శిక్షణ ఇవ్వబడుతుందని పేర్కొన్నారు. అలాగే 6వ తరగతి నుండి 10వ, తరగతి వరకు అమ్మాయిలకు ప్రత్యేకంగా టైలరింగ్ లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే శిక్షణ ఇవ్వబడుతుందని, అలాగే 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు విద్యార్థులకు కంప్యూటర్ లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే శిక్షణ ఇవ్వబడుతుందని తెలిపారు. 1వ తరగతి నుండి 5వ.తరగతి వరకు చదువుచున్న విద్యార్థుని విద్యార్థులు దరఖాస్తు చేసుకొనుటకు అర్హులని, ఈ దరఖాస్తులు జూన్ 12వ తేదీ వరకు తీసుకోబడును. దరఖాస్తుతో పాటు తప్పని సరిగా ఈ క్రింద తెల్పిన పత్రాలను జతపర్చుటకు తీసుకొని రాగలరు. 1).వికలాంగుల సదరం సర్టిఫికెట్ 2).పుట్టిన తేది సర్టిఫికెట్ 3).స్టడీ సర్టిఫికెట్, 4).కులం, ఆదాయం ధ్రువీకరణ సర్టిఫికెట్, 5).ఆధార్ కార్డు, 6).రేషన్ కార్డు పత్రం, 7).4 పాస్ ఫోటోలు మిగతా వివరాలకు సంప్రదిచవలసిన మా ఫోన్ నెంబర్లు: 6300585912, 9440739423,8801117608,9866673486,8008136309. అలాగే ప్రత్యక్షంగా సంప్రదిచవలసిన అడ్రస్ శ్రీవేంకటేశ్వర బధిరుల ఉన్నత పాఠశాల, మయూరి గార్డెన్ లైన్, ప్రగతి నగర్, హన్మకొండ.

# ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో సమావేశమైన

## సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు.



భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి (**గౌతమ్ న్యూస్ ):** హైదరాబాద్ జూబ్లీహిల్స్ నందు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి స్వగృహంలో ఉమ్మడి నల్గొండ,వరంగల్, ఖమ్మం జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం లో పాల్గొన్న మిత్రపక్షాల నాయకులు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పల్ల వెంకట్ రెడ్డి,భాగం హేమంత్ రావు, సిపిఎం రాష్ట్ర నేత జూలకంటి రంగారావు, టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం తదితరులు పాల్గొన్నారు.

# పేకాట రాయుళ్లు అరెస్టు

## కేసు నమోదు చేసిన ఎస్ ఐ మౌలానా

బయ్యారం(**గౌతమ్ న్యూస్ ):** మహబూబాబాద్ జిల్లా బయ్యారం : ఎస్ ఐ మౌలానా నమ్మదగిన సమాచారం మేరకు కొత్తపేట గ్రామం లో పేకాట ఆడుతున్నారనే సమాచారం రాగా మహబూబాబాద్ డిఎస్పీ తిరుపతిరావు ఆదేశానుసారం శుక్రవారం ఉదయం అట్టి గృహమును తన సిబ్బంది తో కలిసి సోదా చేయగా 9 మంది పేకాట ఆడుతూ పట్టుబడినారు.సంఘటన ప్రాంతంలో వారివద్ద నుంచి 40,850/- నగదు,5 సెల్ ఫోన్స్ , పేక ముక్కలు స్వాధీనపర్చుకొని సదరు నిందితులను పిఎస్ కు తరలించి ఎస్ ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్థున్నట్లు తెలిపారు.

# స్పెటర్ ప్లాంట్ల ఏర్పాటు



మెట్ పల్లి (**గౌతమ్ న్యూస్ ):** మున్సిపల్ కమిషనర్ మోహన్ ఆదేశాల మేరకు పట్టణంలోని పాత బస్టాండ్ శాస్త్రి చౌరస్తాలో, బస్ డిపో చౌరస్తా వద్ద స్పైటర్ ప్లాంట్లను శనివారం ఏర్పాటు చేశారు. అలాగే నేషనల్ హైవే డివైడర్ల పైన పూల మొక్కలు ఏర్పాటు చేయాలని, నాటిన మొక్కలకు ప్రతిరోజు నీరు పట్టాలని, చెట్ల మధ్యలో పెరిగిన పిచ్చి గడ్డిని పిచ్చి మొక్కలను తొలగించాలని కమిషనర్ ఆదేశించారు. కార్యక్రమంలో ముజీబ్, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా గొంతుక,సుప్రీంకోర్ట్ న్యాయవాది శేషగిరిరావుగౌడ్ ను గెలిపించాలి

## మోకుదెబ్బ నాయకులు రమేష్ గౌడ్



నర్సంపేట (**గౌతమ్ న్యూస్ ):** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో ప్రజా గొంతుక లాంటి సుప్రీంకోర్టు న్యాయవాది ఈద శేషగిరిరావు గౌడ్ ను భారీ మెజారిటీతో గెలిపించాలని గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్ గౌడ్ పిలుపునిచ్చారు. నల్గొండ, ఖమ్మం వరంగల్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో శేషగిరి రావు గౌడ్ ను గెలిపించాలని కోరుతూ నర్సంపేట మండలం లోని ఇటుకాలపల్లి, మహేశ్వరం, లక్నెపల్లి, గురిజాల గ్రామాలలో శనివారం మోకుదెబ్బ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా రమేష్ గౌడ్ మాట్లాడుతూ రాజ్యాంగం పట్టభద్రులకు కల్పించిన హక్కులు, సంక్షేమ, అభివృద్ధి ఫలాలు పొందాలంటే చట్ట సభలో నిలదీసే సత్తా గల విద్యా వేత్త శేషగిరి రావు గౌడ్ మాత్రమే నన్నారు. ఉన్నత విద్యావంతుడైన అభ్యర్థి ని చట్ట సభకు పంపినప్పుడే పట్ట భద్రులకు సరైన న్యాయం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణా రాష్ట్రంలో బీసీ ముఖ్యమంత్రి అవసరాన్ని దృష్టిలో ఉంచుకొని శేషగిరి రావు గౌడ్ లాంటి వ్యక్తులకు చట్ట సభలకు పంపాల్సిన అవసరం విద్యావంతులయిన పట్టబద్రులు ముందుండాలని సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్సి, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఆర్థికంగా వెనుకబడిన అగ్రకుల వ్యక్తులను కలుపుకొని పోవాల్సిన అవసరం ఎంతయినా ఉండన్నారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడుటకు, జనాభా దామాషా ప్రకారం మనమేంతో మనకంత వాటా అనే నినాదంతో పోరాటం చేస్తున్న ఈద శేషగిరి రావు గౌడ్ కు వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గం నుండి సీరియల్ నెంబర్ 12 కు ప్రథమ ప్రాధన్యత ఓటు వేసి గెలిపిచాలని, లేని పక్షంలో 2 వ ప్రాధాన్యత ఓటు ఐనా వేయాలని రమేష్ గౌడ్ పట్టభద్రులను కోరారు. ఈ కార్యక్రమంలో మోకుదెబ్బ జిల్లా అధ్యక్షులు గోపగాని వెంకటేశ్వర్లు గౌడ్, మండల కమిటీ ఉపాధ్యక్షులు గోడిశాల అశోక్ గౌడ్, గుండెబోయిన కిరణ్ సాగర్ గౌడ్, లక్నెపల్లి గౌడ సంఘం అధ్యక్షులు మర్ద సురేష్ గౌడ్, పరాచికపు రమేష్, దార దిలీప్, గన్న రాజేష్, ఐలోని ప్రశాంత్, ఆరెపల్లి సాయికుమార్, సూత్రపు కళ్యాణ్, ఏమ్ము కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఏనుగుల రాకేష్ రెడ్డి ని గెలిపించండి

## మండల అధ్యక్షుడు బోయినపల్లి సుధాకర్ రావు



అన్నపురెడ్డిపల్లి(**గౌతమ్ న్యూస్ ):** అన్నపురెడ్డిపల్లి మండలంలో పట్టభద్రుల ఇంటింటికి వెళ్లి ఓటును అభ్యర్థిస్తూ జోరుగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం - మండల అధ్యక్షుడు బోయినపల్లి సుధాకర్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి మండల వ్యాప్తంగా పట్టభద్రుల శనివారం ఇంటింటికి వెళ్లి ఓటు ను అభ్యర్థిస్తూ ఏనుగుల రాకేష్ రెడ్డి గెలుపు కోసం మండలం లో ఎమ్మెల్సీ ప్రచారం సాగుతోంది.. నల్లగొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీగా బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డిని గెలిపించాలని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బోయినపల్లి సుధాకర్ కోరారు.అశ్వారావుపేట



నియోజకవర్గం అన్నపురెడ్డిపల్లి మండలం లోని పట్టభద్రులను ఆయన పలు శాఖల విభాగాల్లో ఉద్యోగులను, పట్టభద్రులను కలిసి ఓటు అభ్యర్థించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏనుగుల రాకేష్ రెడ్డి ఉన్నత విద్యావంతుడు, సమాజ సేవకుడని కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలంటే ప్రశ్నించే గొంతుక శాసన మండలిలో ఉంటేనే నెరవేరుతాయని అన్నారు.రాజకీయాల్లోకి యువత రావాలని.. అందులోనూ నీతి నిజాయితీ ఉన్న వ్యక్తులు రావాలని కోరుకోవాలని తెలిపారు. ఒక వ్యాపారంలో ఒక వ్యక్తికి నష్టం వస్తే.. అది అతనికి, దానికి సంబంధించిన కొంత మందికి మాత్రమే నష్టం వస్తుందని.. అలాగే ఓ వ్యక్తి ఆరోగ్యం చెడిపోతే అతనికి మాత్రమే నష్టం చేకూరుస్తుందని.. కానీ రాజకీయాల్లోకి మోసగాళ్లు, స్వార్థపరులు, అవినీతిపరులు వస్తే.. అది మొత్తం సమాజానికే నష్టం జరుగుతుందంటూ చెప్పుకొచ్చారు. అందుకే మనకు కావాల్సింది సమాజం కోసం నిలబడి పని చేసే నాయకులని.. అది కూడా యువతరమే కావాలని వివరించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో ఏనుగుల రాకేష్ రెడ్డి సామాన్య రైతు కుటుంబంలో పుట్టి.. బిట్స్ పిలానీ లాంటి సంస్థల్లో చదివి ఏనుగుల రాకేష్ రెడ్డి గోల్డ్ మెడల్ సంపాదించాడని వివరించారు. అమెరికాలాంటి దేశాలకు వెళ్లే అవకాశం ఉన్నా వదులుకుని.. సమాజ సేవ కోసం రాజకీయాల్లోకి వచ్చాడని తెలిపారు. వరదల సమయంలో, యువతకు ఉద్యోగాల కల్పన కోసం పోరాటంలో ఇలా అనేక సందర్భాల్లో తన వంతు కృషి చేశాడని చెప్పుకొచ్చారు,అలాంటి రాకేష్ రెడ్డి ఈ పట్టభద్రుల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా నిలబడ్డాడని తెలిసి చాలా సంతోషించదగా విషయం అందుకే.. మొదటి ప్రాధాన్యత ఓటుగా రాకేష్ రెడ్డికి వేసి.. అఖండ మేజార్టీతో గెలిపించి.. మనల్ని మనం గెలిపించుకోవాలని పట్టభద్రులను ఓట్లు అభ్యర్థిస్తున్నారు . ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ప్రెసిడెంట్ పర్స మాధవరావు ,బిఆర్ఎస్ నాయకులు పెదగుండ్ల పుల్లారావు, చల్ల రాంబాబు,చల్ల నాగరాజు, వడ్డేపల్లి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

# తీన్మార్ మల్లన్న గెలుపు ఖాయం

## హర్షం వ్యక్తం చేసిన మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి అందరివాడు భూక్యా బాలు నాయక్



కురవి(**గౌతమ్ న్యూస్ ):** ఈ రోజు డోర్నకల్ నియోజక వర్గంలోని కురవి మండల కేంద్రంలో కురవి గ్రామ శాఖ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నారాయణ రాజేందర్ అధ్యక్షతన వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల కాంగ్రెస్ ఎమ్మెల్సి ఎన్నికల సన్నాహక సమావేశం జరిగింది ఈ య్యొక్క సమావేశానికి మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్



పార్టీ అధికార ప్రతినిధి అందరివాడు భూక్య బాలు నాయక్ ముఖ్య అతిధిగా పాల్గొని వారు మాట్లాడుతు ప్రశ్నించే గొంతుక తీన్మార్ మల్లన్నను భారీ మెజార్టితో గెలిపించి శాసన మండలికి పంపించాలని పట్టభద్రులకు, మేదావులకు విన్నవించారు మతతత్వ బీజేపీతో ఎస్టీ, ఎస్సి, బీసీ మైనారిటీ వర్గాలకు తీవ్రమైన నష్టం వాటిల్లుతుందని అదేవిదంగా బి.ఆర్.ఎస్ ప్రభుత్వం రాష్టాన్ని అప్పుల పాలు చేసిందని బీజేపీ, బి.ఆర్.యస్ పార్టీలను ఈ ఎన్నికల్లో తుక్కు తుక్కుగా ఓడించాలని కోరారు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జేన్నా రెడ్డీ భరత్ చందర్ రెడ్డి, స్థానిక శాసన సభ్యులు ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోతు రాంచందర్ నాయక్, మహబూబాబాద్ శాసన సభ్యులు డాక్టర్ భూక్యా మురళి నాయక్, కాబోయే యం.పి. పోరిక బలరాం నాయక్ గార్లు తీన్మార్ మల్లన్న ను భారీ మెజార్టితో గెలిపించటానికి ప్రత్యేకమైన కృషి చేస్తున్నారన్నారు ఈ య్యొక్క కార్య క్రమములో కురవి మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఆవిరే మోహన్ రావు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బానోత్ తుకారాం నాయక్, కాంగ్రెస్ జిల్లా నాయకులు యస్.కె. బషిరుద్దీన్, బి.సి. సెల్. నాయకులు గణేష్, కాంగ్రెస్ నాయకులు నాగరాజు, యూత్ ప్రెసిడెంట్ వీరన్న, కాంగ్రెస్ కార్యకర్తలు మరియు పట్టభద్రులు తదితరులు పాల్గొన్నారు

**ఇట్లు నారాయణ రాజేందర్**
**కాంగ్రెస్ పార్టీ కురవీ గ్రామ అధ్యక్షులు**

# నాణ్యతా ప్రమాణాలు పాటించని పలు స్వీట్ హౌస్ లపై దాడులు నిర్వహించి జరిమానా విధించిన కమిషనర్



మెట్పల్లి(గౌతమ్ న్యూస్ ): శనివారం రోజున మున్సిపల్ కమిషనర్ శ్రీ టి మోహన్ ఆదేశాలతో నాణ్యతా ప్రమాణాలు పాటించని పలు స్వీట్ హౌస్ లపై దాడులు నిర్వహించి జరిమానా విధించడమైనది కమిషనర్ మాట్లాడుతూ స్వీట్ హౌస్ లో హోటల్స్ రెస్టారెంట్లు నాణ్యత ప్రమాణాలు పాటించాలని పరిశుభ్రత పాటించాలని ప్లాస్టిక్ కవర్స్ వాడ రాదని జూట్ బ్యాగులు వాడాలని తెలిపినారు ఈ కార్యక్రమంలో ముజీబ్ పున్నం నాయక్ నరసయ్య పాల్గొన్నారు

# వర్షాకాలంలో ముందు జాగ్రత్త చర్యలు..!!




హైదరాబాద్: తుపాన్, వాయుగుండం, అల్పపీడనాలు ఏర్పడటం వల్ల ఈ సారి ముందే వర్షాలు కురుస్తున్నాయి. నైరుతి రుతు పవనాలు కూడా ముందుగానే రావడంతో వానలు ముందే పడనున్నాయి. చినుకు పడితే హైదరాబాద్ నగరం చిత్తడి అవుతుందనే సంగతి తెలిసిందే. ఈ సారి అలా కాకుండా పకడ్బందీగా చర్యలు తీసుకుంటామని తెలంగాణ ప్రభుత్వం చెబుతోంది. వర్షాకాలంలో తీసుకోవాల్సిన ముందుజాగ్రత్త చర్యలపై సీఎం రేవంత్ రెడ్డి శనివారం నాడు సమీక్ష చేశారు. వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. సమీక్షలో పోలీసు, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు. వానాకాలం వస్తోన్న క్రమంలో సిటీలో ఇబ్బంది ఎదుర్కొనే ప్రాంతాల గురించి చర్చించారు. లోతట్టు ప్రాంతాలు ఉన్న చోట ఎలాంటి చర్యలు తీసుకోవాలి..? జనం ఇబ్బంది పడకుండా ఉండాలని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశం చేసినట్టు తెలుస్తోంది. ట్రాఫిక్, జీహెచ్ఎంసీ, విద్యుత్, వాతావారణ శాఖ అధికారుల నుంచి పలు ప్రతిపాదనలను తీసుకున్నట్టు సమాచారం. సలహాలు, సూచనలు తీసుకొని, ప్రజలకు ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

గౌతమ్ న్యూస్
తెలుగు దిన పత్రిక

సంపాదకీయం

# ఆరోదశలో అపారనష్టాలు...!

(విశ్లేషణ)

లోక్‌సభ ఎన్నికల తుది దశలు బీజేపీకి మరింత కలవరం కలిగించనున్నాయి. ముఖ్యంగా పిహెచ్‌డి రాష్ట్రాలు-పంజాబ్, హర్యానా, ఢిల్లీలలో ప్రత్యర్థి కూటమి నుంచి తీవ్ర పోటీ నెదుర్కోనున్నది. పంజాబ్‌లో తుది దశ ఎన్నికలు మరో వారం రోజుల్లో జరగనున్నాయి. ఈ ఆరవ దశలో హర్యానాలో పది, ఢిల్లీలో 7 స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఉత్తర్‌ప్రదేశ్‌లోని పూర్వాంచల్, బిహార్, జార?ండ్, పశ్చిమ బెంగాల్, ఒడిషాలలో మొత్తం 40 నియోజకవర్గాలలో కూడా నేడు పోలింగ్ జరగనున్నది. జమ్మూ-కశ్మీర్‌లోని అనంతనాగ్- రజౌరి స్థానానికి కూడా శనివారం ఎన్నిక జరగనున్నది. ఈ ఆరవదశలో పోలింగ్ జరగనున్న 58 స్థానాలలో 40ని 2019లో బీజేపీ గెలుచుకున్నది. దాని మిత్రపక్షాలకు మరో ఐదు లభించాయి. ఇందుకు భిన్నంగా కాంగ్రెస్, ఐదు సంవత్సరాల క్రితం ఈ 58 స్థానాల్లో ఒక్కదాన్ని కూడా గెలుచుకోలేదు. ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలు ఐదు స్థానాలను కైవశం చేసుకున్నాయి. బహుజన్ సమాజ్ పార్టీ, బిజూ జనతాదళ్‌లు చెరో 4 స్థానాలను గెలుచుకున్నాయి. 2019 అనంతరం జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో ఇండియా కూటమి పక్షాలు 22 స్థానాలలో ఆధిక్యతను సాధించాయి. అయితే అసెంబ్లీ ఎన్నికల ఫలితాల ప్రభావం పార్లమెంటరీ ఎన్నికలకు వర్తించకపోయినప్పటికీ ప్రస్తుత దశ సార్వత్రిక ఎన్నికలలో బెంగాల్, ఒడిషా మినహా ఇతర రాష్ట్రాలలో బీజేపీ ఎదురుగాలుల నెదుర్కొంటున్నది. హర్యానా, ఢిల్లీలో ప్రచండ వేడి గాడ్పులు వీస్తున్నాయి. కమలనాథుల పట్ల ఓటర్ల వ్యతిరేకత కూడా బహుశా తీవ్ర స్థాయిలో వ్యక్తమయ్యే అవకాశమున్నది. హర్యానాలోని పది సీట్లను గత సార్వత్రిక ఎన్నికలలో బీజేపీ భారీ మెజారిటీతో గెలుచుకున్నది. అయితే ఆ తరువాత చాలా అంశాలు బీజేపీకి వ్యతిరేకంగా పరిణమించాయి. వాటిలో ముఖ్యమైనది రైతుల ఉద్యమం. కొత్త సాగు చట్టాలకు వ్యతిరేకంగా జరిగిన ఆ ఆందోళన పర్యవసానంగా ఒక బలమైన రైతు సామాజిక వర్గం కాంగ్రెస్ వైపు మొగ్గింది. జాట్, జాట్‌యేతరుల మధ్య విభేదాలు తనకు లబ్ధినిస్తాయని బీజేపీ ఆశిస్తున్నది గానీ, ఆ పార్టీ ఆశలు నెరవేరే అవకాశం లేదు. జీవనాధారాలపై ఆందోళన, ధరల పెరుగుదల పెరుగుతున్న నిరుద్యోగిత, అగ్నివీర్ పథకం పట్ల తీవ్ర వ్యతిరేకత మొదలైనవి ఇండియా కూటమికి బాగా కలిసివచ్చే విషయాలు. దీనికితోడు కాంగ్రెస్ తన అభ్యర్థుల ఎంపికలో సామాజిక సమతుల్యతను పాటించింది. జాట్ అభ్యర్థులకు కేవలం రెండు సీట్లే ఇవ్వడం వల్ల జాట్, జాట్ యేతరుల మధ్య విభేదాలు కాంగ్రెస్ విజయావకాశాలపై ప్రతికూల ప్రభావాన్ని కలిగించకపోవచ్చు. లోక్‌సభ ఎన్నికలను ప్రకటించిన తరువాత ముఖ్యమంత్రిని మార్చినప్పటికీ బీజేపీకి ప్రయోజనం లేకపోయింది. పలుకుబడి గల పలువురు నేతలు బీజేపీ నుంచి నిష్క్రమించేందుకు ఆ చర్య పురిగొల్పింది. హర్యానా రాజకీయాలలో గతంలో ప్రభావశీలంగా ఉన్న జాట్ కేంద్రిత ఇండియన్ నేషనల్ లోక్‌దళ్, జన్‌నాయక్ జనతా పార్టీల ప్రభావం ఈ సారి పెద్దగా కన్పించకపోవడం కూడా కాంగ్రెస్‌కు కలిసివచ్చే విషయం. మొత్తంమీద సగానికి పైగా సీట్లను కాంగ్రెస్ గెలుచుకునే అవకాశం తప్పకుండా ఉన్నది. మొత్తం పది సీట్లను గెలుచుకునే అవకాశాన్ని కూడ కొట్టివేయలేము. హర్యానాకు పొరుగున ఉన్న ఢిల్లీలో సైతం బీజేపీకి విజయావకాశాలు తక్కువే. ఆమ్ ఆద్మీ పార్టీ, కాంగ్రెస్‌లు తమ విభేదాలను పక్కన పెట్టి ఉమ్మడి ప్రత్యర్థి బీజేపీని కలసికట్టుగా ఎదుర్కొంటున్నాయి. ఈ రెండు పార్టీలు కలిసి పనిచేయడం ఇదే మొదటిసారి. ఆప్ నాలుగు స్థానాలకు పోటీ చేస్తుండగా కాంగ్రెస్ మూడు స్థానాలకు పోటీ చేస్తోంది. 2019లో ఈ ఏడు స్థానాలను బీజేపీ పెద్ద మెజారిటీతో గెలుచుకున్నది. అయితే ఆ తరువాత అసెంబ్లీ ఎన్నికలలో ప్రతి నియోజక వర్గంలోనూ ఆప్ ఆధిక్యత సాధించింది. ఆప్-కాంగ్రెస్‌లకు కార్మిక శ్రేణులు, దళితులు, ముస్లింలలో గట్టి మద్దతు ఉన్నది. ఆ పార్టీల మధ్య ఓట్ల బదిలీ జరిగే అవకాశం ఉంది. అలాగే, అరవింద్ కేజ్రీవాల్ అరెస్ట్ ఉదంతం ఆయనకు మోదీని మించిన ప్రాధాన్యాన్ని సంతరించి పెట్టింది. కాగా బీజేపీ తన సిట్టింగ్ ఎంపీలలో ఆరుగురిని మార్చివేయడం గమనార్హం. ఉత్తరప్రదేశ్‌లో ఈ దశలో కూడా 14 నియోజకవర్గాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఇందులో రెండు అవధ్ ప్రాంతంలో, మిగతావి పూర్వాంచల్‌లో ఉన్నాయి. 2019 ఎన్నికలలో ఈ 14 సీట్లలో 9ని బీజేపీ గెలుచుకున్నది. ఓట్ల వాటా 45.7 శాతం. ఇది రాష్ట్ర వ్యాప్తంగా సగటు ఓట్ల వాటా 50.8 శాతం కంటే తక్కువ. గత సార్వత్రిక ఎన్నికలలో సమాజ్‌వాది పార్టీ- బిఎస్‌పి కూటమి మంచి ఫలితాలనే సాధించింది. 44.9 శాతం ఓట్లతో ఐదు స్థానాలను ఈ కూటమి గెలుచుకున్నది. ఇందులో నాలుగు బిఎస్‌పి కైవసం చేసుకున్నవి. ఈ ఎన్నికలలో ఒకటి లేదా రెండు శాతం మొగ్గు ఇండియా కూటమి వైపు ఉంటే బీజేపీ విజయావకాశాలకు తీవ్ర విఘాతం కలుగుతుంది. సుల్తాన్‌పూర్, అలహాబాద్, శ్రావస్తి నియోజకవర్గాలలో ఇండియా కూటమి పట్ల స్వల్ప మొగ్గుతో బీజేపీకి తీవ్ర నష్టం వాటిల్లడం ఖాయం. బిహార్ వాయవ్య ప్రాంతం (తిర్హత్‌గా ప్రసిద్ధి)లోని ఎనిమిది నియోజకవర్గాలలో నేడు పోలింగ్ జరగనున్నది. గత సార్వత్రిక ఎన్నికలలో ఎన్డీఏ ఆ ఎనిమిది స్థానాలనూ గెలుచుకున్నది. ఏడు సీట్లను భారీ మెజారిటీతో కైవసం చేసుకున్నది. అయితే వాటిలో ఒకటైన వాల్మీకినగర్ స్థానానికి 2020లో జరిగిన ఉప ఎన్నికలో బీజేపీ బొటాబొటీ మెజారిటీతో గెలుచుకున్నది. 2020 అసెంబ్లీ ఎన్నికలలో ఆయా పార్టీలు సాధించుకున్న ఓట్ల వాటా ప్రాతిపదికన చూస్తే గతంలో జనతాదళ్(యు) కైవసం చేసుకున్న శివాన్ నియోజకవర్గాన్ని ఈసారి రాష్ట్రీయ జనతాదళ్ గెలుచుకునే అవకాశం మెండుగా ఉంది. ఈ ఎనిమిది నియోజకవర్గాలలో అగ్ర కులాల ఓటర్లు గణనీయమైన సంఖ్యలో ఉన్నారు. ఈ కారణంగా ఇండియా కూటమికి అంతగా లబ్ధి చేకూరకపోవచ్చు. పశ్చిమ బెంగాల్‌లో ఈ ఆరోదశలో ఎన్నికలు జరగనున్న 8 నియోజకవర్గాలలో 5ను బీజేపీ అనూహ్యంగా గెలుచుకున్నది. గిరిజనులు అత్యధికంగా ఉండే ఝర్‌గ్రామ్, పురూలియా, మేదినీపూర్, బంకూరా నియోజకవర్గాలు (వీటన్నిటినీ కలిపి జంగల్‌మహల్ ప్రాంతంగా వ్యవహరిస్తారు) కూడా బీజేపీ కైవసం చేసుకున్న వాటిలో ఉన్నాయి. 2018 పంచాయత్ ఎన్నికల నాటినుంచి ఆ నియోజకవర్గాలు బీజేపీ వైపు మొగ్గు చూపుతున్నాయి. సంఘ్ పరివార్ సంస్థలు ఆ ప్రాంతాలలో బాగా క్రియాశీలంగా ఉన్నాయి. 2021 అసెంబ్లీ ఎన్నికలలో తృణమూల్ కాంగ్రెస్ ఆ నియోజకవర్గాలలో మళ్లీ పట్టు సాధించింది. ఝర్‌గ్రామ్, మేదినీపూర్, బంకూరా నియోజకవర్గాలలో ఆధిక్యత సాధించింది. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలలో కంటే ఈ ప్రాంతంలోనే బీజేపీ ఓటర్ల మద్దతును అధికంగా పొందింది. 2019 విజయాలను పునరావృతం చేసుకోవడానికి ప్రయత్నిస్తోంది. తమకు ఎస్టీ హోదా కల్పించాలన్న కుర్మీల డిమాండ్, ఒక స్వతంత్ర అభ్యర్థి బరిలో ఉండడం బీజేపీ విజయావకాశాలను ఏ తీరున ప్రభావితం చేయనున్నాయో వేచి చూడవలసి ఉంది. బీజేపీలో చేరిన తృణమూల్ నాయకుడు సువేందు అధికారి కుటుంబానికి కొన్టాయి, తామ్లుక్, ఘటాల్ నియోజకవర్గాలు కంచుకోటలు. ఈ నియోజకవర్గాలలో 2019లో కంటే 2021 అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీ ఎక్కువ ఓట్లను పొందింది. ప్రస్తుత ఎన్నికలలో ఆ నియోజకవర్గాలలో బీజేపీ గెలుపోటములపై సువేందు అధికారి రాజకీయ భవితవ్యం ఆధారపడి ఉన్నది. జార?ండ్ తూర్పు ప్రాంతంలోని రాంచి, ధన్‌బాద్, గిరిడి, జంషెడ్‌పూర్ నియోజకవర్గాలలో నేడు ఓటింగ్ జరగనున్నది. ఇవన్నీ పట్టణ ప్రాంతాల నియోజకవర్గాలు. బీజేపీ, దాని మిత్రపక్షం ఆల్ జార?ండ్ స్టూడెంట్ యూనియన్ పార్టీకి మంచి బలం ఉన్నది. అయితే జంషెడ్‌పూర్‌లో ఈసారి ఇండియా కూటమి గెలిచే అవకాశమున్నది. ఒడిషాలో భువనేశ్వర్, కటక్‌లతో పాటు కెయోంఝర్ (ఎస్టీ), సంబల్‌పూర్, ఢెంకనాల్, పూరి నియోజకవర్గాలలో నేడు ఎన్నికలు జరగనున్నాయి. 2019లో సంబల్‌పూర్, భువనేశ్వర్‌లను బీజేపీ గెలుచుకోగా మిగతావాటిని బిజూ జనతాదళ్ కైవసం చేసుకున్నది. ఒడిషాలో బిజూ జనతాదళ్‌లకు సుస్థిరమైన పునాదులు ఉన్నాయి. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌కు ప్రజల్లో, ముఖ్యంగా మహిళల్లో మంచి ఆదరణ ఉన్నది. గతంలో తాను ఓడిపోయిన మూడు నియోజకవర్గాలను బిజూ జనతాదళ్ నుంచి ఈసారి కైవసం చేసుకోగలనని బీజేపీ ఆశిస్తున్నది. మొత్తం మీద తూర్పు భారత రాష్ట్రాలలో బీజేపీకి లాభనష్టాలు సమతుల్యంగా ఉండవచ్చు. అయితే హర్యానా, ఢిల్లీలో వాటిల్లే నష్టాల కారణంగా అధికారపక్షం ఆరో దశలో మొత్తంగా పది సీట్లను కోల్పోయే అవకాశమున్నది. నేడు జరగనున్న లోక్‌సభ ఎన్నికల ఆరవదశలో బెంగాల్, ఒడిషా మిగతా రాష్ట్రాలలో భారతీయ జనతా పార్టీకి ఎదురుగాలులు వీస్తున్నాయి. హర్యానా, ఢిల్లీలో వాటిల్లే భారీ నష్టాల కారణంగా అధికారపక్షం ఈ దశలో మొత్తంగా పది సీట్లను కోల్పోయే అవకాశం ఉంది.

# భూ సర్వేపై కదలిక..

ల్యాండ్ రికార్డు కమిషనర్ కార్యాలయం ప్రణాళిక

ఎన్ని నిధులు కావాలి?

ఎందరు సిబ్బంది అవసరం?

సర్వేకు పట్టే కాలమెంత?

తలెత్తే ఇబ్బందులేమిటి?

సమగ్ర అంచనాలతో నివేదిక రూపకల్పన

సర్వేకు 300 కోట్లు.. కేంద్రం నుంచే పొందే ఆలోచన

2025-26 నాటికి పూర్తి చేయాలన్న కేంద్ర ప్రభుత్వం

పదేళ్ల కిందటే రూ.83.85 కోట్లు మంజూరు

గత ప్రభుత్వం ఖర్చు చేసింది కేవలం రూ.2.65 కోట్లే



హైదరాబాద్, : రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర భూ సర్వేపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఇందుకు సర్వే సెటిల్మెంట్ ల్యాండ్ రికార్డు కమిషనర్ కార్యాలయం అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. భూ సర్వే పూర్తి చేసేందుకు ఎన్ని నిధులు కావాలి? ఎంత మంది సిబ్బంది అవసరం? ఎన్ని రోజుల్లో ఈ కార్యక్రమాన్ని పూర్తి చేయొచ్చు? సర్వే ద్వారా రైతులకు, ఇతర యజమానులకు కలిగే ప్రయోజనం ఎంత? సర్వే చేపట్టేటప్పుడు క్షేత్రస్థాయిలో నెలకొనే ఇబ్బందులేమిటి? తదితర అంశాలను అంచనా వేస్తూ, సమగ్ర నివేదికను తయారు చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి.. సర్వే సెటిల్మెంట్ ల్యాండ్ రికార్డ్ కమిషనర్‌తో సమావేశమయ్యారు. భూ సర్వే చేపట్టేందుకు నివేదికలు రూపొందించాలంటూ ఆ విభాగాన్ని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాల్లో భూ సర్వే చేపట్టి భూ రికార్డులను అప్‌డేట్ చేసేందుకు డీఐఎల్‌ఆర్‌ఎంపీ (డిజిటల్ ఇండియా ల్యాండ్ రికార్డు మోడ్రనైజేషన్) కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. అందులో భాగంగా ఆయా రాష్ట్రాలు కోరిన నిధులు కూడా మంజూరు చేస్తోంది. ఈ కార్యక్రమం ద్వారానే సర్వే కోసం నిధులు సమకూర్చుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు భూ సర్వే కోసం సిబ్బంది, అత్యాధునిక పరికరాలు, రికార్డుల అప్‌డేట్, తదితర అవసరాల కోసం దాదాపు రూ.300 కోట్లు కేటాయిస్తే, సర్వే పూర్తి చేసి రికార్డులు అప్‌డేట్ చేస్తామని చెప్పేందుకు సర్కారు సిద్ధమవుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇటీవలే కేంద్ర ప్రభుత్వం భూ సర్వేకు సంబంధించి ఆయా రాష్ట్రాల సర్వే సెటిల్మెంట్ ల్యాండ్ రికార్డ్ కమిషనర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించింది. ఒక్కో రాష్ట్రంలో చేపట్టిన పురోగతిని కేంద్రం అడిగి తెలుసుకుంది. మన రాష్ట్రంలోనైతే ఈ కార్యక్రమం ఇంకా పట్టాలెక్కలేదు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం భూ సర్వేపై హడావుడి చేసి మధ్యలోనే వదిలేసింది. 2017 ఆగస్టు 18న అప్పటి సీఎం కేసీఆర్ 'తెలంగాణలో ప్రతి అంగుళం భూమిని కొలుస్తాం. కొలిచిన భూమికి డిజిటల్ మ్యాప్ ఆఫ్ తెలంగాణను తయారు చేస్తాం' అని చెప్పారు. అనంతరం 2020 సెప్టెంబరు 9న మరోమారు భూముల సర్వే కోసం టెండర్లు పిలవాల్సి ఉందని, సభలో బిల్లులకు ఆమోదం తెలిపిన వెంటనే సర్వే కోసం ముందుకు వెళ్తామని కేసీఆర్ చెప్పారు. 2021 జూన్ 7న మంత్రివర్గ సమావేశంలో సమగ్ర భూ సర్వేపై చర్చించారు. జూన్ 9న డిజిటల్ సర్వే కోసం కొన్ని గ్రామాలను పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసినట్లు ప్రకటించారు. డిజిటల్ భూ సర్వే చేపట్టేందుకు 29 ఏజన్సీలు ముందుకొచ్చినా అడుగు కూడా ముందుకు పడలేదు. డిజిటల్ భూ సర్వే ప్రక్రియ కోసం కేంద్ర ప్రభుత్వం రూ.83.85 కోట్లు కూడా మంజూరు చేసింది. ఈ నిధుల్లో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.2.65 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. తర్వాత ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లలో కూడా ఈ కార్యక్రమానికి నిధులు కేటాయించినా నామమాత్రంగానే ఖర్చు చేశారు. తాజాగా ఇదే విషయాన్ని సర్వే సెటిల్మెంట్ ల్యాండ్ రికార్డ్ కమిషనర్ కేంద్రానికి వివరించారు. దీంతో 2025-26 మార్చి 31 నాటికి సమగ్ర భూ సర్వే కార్యక్రమం పూర్తి చేయాలని కేంద్రం గడువు విధించింది. గత ప్రభుత్వంలో మంజూరు చేసిన నిధులకు యుటిలైజేషన్ సర్టిఫికెట్ ఇవ్వాల్సి ఉంది. ఈ సర్టిఫికెట్ ఇస్తే ప్రతిపాదించిన నిధులు మొత్తం కేంద్రం మంజూరు చేసే అవకాశం కూడా ఉంది.

సర్వేతో వివాదాలకు పూర్తి పరిష్కారం

భూముల పరంగా క్షేత్రస్థాయిలో హద్దు రాళ్ల పరంగా తీవ్ర వివాదాలున్నాయి. రికార్డుల్లో పేర్కొన్నంత భూమి క్షేత్రస్థాయిలో లేకపోవడంతో కొనుగోలు, అమ్మకందారుల మధ్యన వివాదాలు నెలకొంటున్నాయి. పట్టా భూములెన్ని?, ప్రభుత్వ భూములెన్ని? అటవీ భూములెన్ని? ఎండోమెంటు భూములెన్ని? వక్ఫ్‌బోర్డు, భూదాన్ భూమూలెన్ని? అన్న వివరాలు రికార్డుల్లో నమోదై ఉన్నప్పటికీ క్షేత్ర స్థాయిలో వీటికి సబంధించిన హద్దులు, మ్యాప్‌లు లేవు. ఫలితంగా లక్షల సంఖ్యలో భూ వివాదాలు నెలకొన్నాయి. వీటిని సమూలంగా పరిష్కరించి కొత్త రికార్డులను రూపొందిస్తేనే భూసమస్యలు పరిష్కారమవుతాయని అభిప్రాయాలున్నాయి. సర్వే చేపడితే ప్రధానంగా ఇద్దరి వ్యక్తుల మధ్యన, దాయాదుల మధ్యన నెలకొన్న భూవివాదాలు పరిష్కారం అవుతాయి. క్షేత్రస్థాయిలో ఉన్న భూమి విస్తీర్ణం, రికార్డుల్లో నమోదు చేసిన వివరాలకు సమానంగా ఉంటే భూమికి సంబంధించిన సమస్యలే తలెత్తవు. సర్వే నిర్వహిస్తే రికార్డుల అప్‌డేట్ కూడా జరిగిపోతుంది. ఏళ్ల తరబడి కోర్టులో కొనసాగుతున్న పలు భూ వివాద కేసులు కూడా తగ్గిపోతాయి. అంతే కాకుండా అటవీ, రెవెన్యూ శాఖల సరిహద్దుల్లోని భూముల వివాదాలకు పరిష్కారం దొరుకుంది. రాష్ట్రాల సరిహద్దుల వివాదాలు, గ్రామాలు, జిల్లాల మధ్యన నెలకొన్న సరిహద్దు వివాదాలు పరిష్కారమవుతాయి.

రూల్స్‌ప్రకారం ప్రతి 30 ఏళ్లకోసారి..

నిబంధనల ప్రకారం ప్రతి 30 ఏళ్లకోసారి రెవెన్యూ రికార్డుల నవీకరణ జరగాలి. అప్పుడే ఎవరు యజమానులో తేలిపోతుంది. పారదర్శకంగా రైతుబంధు, రుణాల పంపిణీ, రుణమాఫీ, బీమా, భూముల సేకరణ వంటి అంశాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కారమవుతాయని రెవెన్యూ నిపుణులు చెబుతున్నారు. నిరంతర ప్రక్రియగా రీ-సర్వే జరగాలి. నిజాం రాజుల కాలంలోనే 1936-42 కాలంలో సమగ్ర భూముల సర్వే జరగ్గా, హైదరాబాద్‌తో పాటు పట్టణాల్లో 1972 టౌన్ సర్వే జరిగింది. ప్రతి భూమి పది మంది కంటే తక్కువ కాకుండా చేతులు మారినప్పటికీ రికార్డుల నవీకరణ జరుగలేదు. తెలంగాణ వ్యాప్తంగా 32 జిల్లాల్లో (హైదరాబాద్ కాకుండా) 1.64 కోట్ల సర్వేనంబర్లు/సబ్ డివిజన్లుండగా 74 లక్షల మంది పట్టాదారులున్నారు. భూముల సరిహద్దు పత్రా(టిప్పన్)లు కూడా 75 ఏళ్ల పాతవే. ఒకసారి భూములు కొలవడానికి ఈ పత్రాలు తీయగానే చిరిగిపోతుంటాయని మండల సర్వేయర్లు వాపోతున్నారు. రీ సర్వే చేపడితే రికార్డులన్నీ అవుతాయని సూచిస్తున్నారు.

పట్టాదారుకు భూ ఆధార్ జారీ

భూములు సర్వే చేసిన అనంతరం సంబం?ధిత యజమానికి 14 అంకెలతో కూడిన భూ ఆధార్ నంబరును జారీ చేస్తారు. ఈ నంబరు ద్వారా ఆ భూమికి సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకోవచ్చు. ఈ నంబరును ఆన్‌లైన్‌లో కొడితే యజమాని పేరు, భూమి విస్తీర్ణం, భూమి స్వభావం, అక్షాంశాలు, రేఖాంశాల సహితంగా హద్దులు తెలుస్తాయి.

# ఆగని ప్రీ లాంచ్ దందా..

నమ్మించి వంచిస్తున్న రియల్ సంస్థలు

రూ.కోట్లు వసూలు చేసి బిచాణా ఎత్తేస్తున్న వైనం

భూముల కొనుగోలులోనూ గొలుసు కట్టు స్కీంలు

మరిన్ని రాయితీలు ఇస్తామని ఆకర్షించే యత్నాలు

నమ్మి సమిధలవుతున్న మధ్యతరగతి కుటుంబాలు

రెరా వచ్చినా.. గత ఏడేళ్లలోకఠిన చర్యలు కరువు

ప్రజలు మోసపోయాక తీరిగ్గా కేసులు.. అరెస్టులు

నెల, రెండు నెలల్లోగా.. అక్రమార్కులు బయటకు!

బాధితులు నిలదీస్తే కోర్టులో తేల్చుకోవాలని సలహా

హైదరాబాద్: రియల్ ఎస్టేట్ రంగంలో ప్రీ లాంచ్ దందాలు ఆగట్లేదు. కొన్ని సంస్థలు 'ప్రీలాంచ్' పేరిట ఆకర్షణీయమైన ఆఫర్లతో వల వేసి.. సొంతింటి కలగనేవారిని నిలువునా మోసం చేస్తున్నాయి. ఈ మోసాలకు మధ్యతరగతివారే ఎక్కువగా సమిధలవుతున్నారు. పైసా పైసా పోగు చేసి కూడబెట్టిన సొమ్మును.. రియల్ ఎస్టేట్ సంస్థల చేతుల్లో పోసి నట్టేట మునుగుతున్నారు. పలు సంస్థలు ఇలా కోట్లాది రూపాయలు దండుకుని ఆనక బిచాణా ఎత్తేస్తున్నాయి. స్థిరాస్తి రంగంలో మోసాలను అరికట్టేందుకుగాను.. 'రియల్ ఎస్టేట్ యాక్ట్-2016'కు అనుగుణంగా రాష్ట్రప్రభుత్వం 2017లో రియల్ ఎస్టేట్ రెగ్యులేషన్ అథారిటీ (రెరా) నిబంధనలతో ఆదేశాలు జారీ చేసింది. కానీ ఇప్పటి వరకూ రెరా ఆధ్వర్యంలో చేపట్టిన చర్యలు అరకొరగానే ఉన్నాయి. తక్కువ ధరకే ఫ్లాట్ అంటూ ఇటీవల మధ్య తరగతి కుటుంబాల నుంచి రూ.60 కోట్ల మేర వసూళ్లు చేసి బిచాణా ఎత్తేసిన 'భారతి బిల్డర్స్' రెరా దృష్టిలో పడకపోవడం గమనార్హం.

కరోనా తర్వాత..

కరోనా సమయంలో నగరాలు, పట్టణాల్లో అద్దె ఇళ్లల్లో నివసించేవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కరోనా సోకితే ఇంటి యజమానులు వారిని నిర్దాక్షిణ్యంగా గెంటేసిన ఘటనలూ జరిగాయి. దీంతో.. చాలామంది మధ్యతరగతివారు సొంతింటి కోసం ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఎక్కడ తక్కువ ధరకు దొరికితే అక్కడ కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపారు. ధర తక్కువగా పెడితే సామాన్య, మధ్యతరగతి ప్రజలు అడ్వాన్సులు ఇస్తారనే విషయం అనేకమంది రియల్టర్లకు అర్థమైంది. ఈ విషయాన్ని అర్థం చేసుకున్న ఇతర రంగాలకు చెందినవారు సైతం నిర్మాణ రంగంలోకి అడుగుపెట్టారు. పలువురు స్థల యజమానులు సైతం డెవలపర్లుగా అవతారమెత్తారు. తమ దగ్గర ఉన్న స్థలాన్ని చూపించి భారీ ప్రాజెక్టును తీసుకొస్తున్నామని ఆఫర్లు ప్రకటించారు. సోషల్ మీడియా వేదికగా విస్తృత ప్రచారం చేశారు. కోట్లాది రూపాయలు ప్రజల నుంచి ముందుగా వసూలు చేసి ఆపై చేతులెత్తేశారు. ఉదాహరణకు.. హైదరాబాద్ శివారులో అమీన్‌పూర్ దగ్గర 23 ఎకరాల్లో భారీ ప్రాజెక్టు అంటూ 'సాహితీ ఇన్ఫ్రా' కంపెనీ విస్తృతంగా ప్రచారం చేసింది. ఆరు టవర్లు.. పది టవర్లు నిర్మిస్తామంటూ ఆకర్షణీయమైన ప్రకటనలు చేసింది. భారీ ఎత్తున ఫ్లాటన్లు విక్రయించింది. ప్రీ లాంచ్‌లో 1200 మందికి పైగా కస్టమర్లు ఫ్లాట్ కొనుగోలు చేశారు. 2023 మార్చినాటికి నిర్మాణం పూర్తి చేస్తామని హామీ ఇచ్చిన సాహితీ ఇన్ఫ్రా.. ఇప్పటికీ ప్రాజెక్టును ప్రారంభించనేలేదు. అసలు నిర్మాణమే చేపట్టకపోగా.. భూమిని సైతం అమ్మేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవడంతో బాధితులు పోలీసస్టేషన్ మెట్లు ఎక్కారు. దాంతో సాహితీ ఇన్ఫ్రాటెక్ ఎండీ లక్ష్మీనారాయణ జైలుకెళ్లారు. కానీ పైసా పైసా పోగు చేసి డబ్బులు చెల్లించిన మధ్య తరగతి కుటుంబాలు మాత్రం రోడ్డున పడ్డాయి. మరో ఉదాహరణ చూస్తే.. ఏపీలోని రేణిగుంటకు చెందిన ఓబిలి హౌసింగ్ అనే సంస్థ సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం వెంకటాపురం గ్రామంలో హైవే ప్యారడైజ్ పేరుతో ప్రీలాంచ్ ఆఫర్ ప్రకటించింది. ఈ ఆఫర్ కింద గజం వెయ్యి రూపాయలకే ఇస్తామంటూ బ్రోచర్లను పంచిపెట్టింది. ఔటర్ రింగ్ రోడ్డుకు సమీపంలో, ఐఐటీ కందికి చేరువలోనే ప్రాజెక్టు అంటూ ఊదరగొట్టింది. తక్కువ ధరకే ఓపెన్ ప్లాట్ వస్తుండడంతో పలువురు పెద్దఎత్తున కొనుగోలు చేశారు. ఇలా దాదాపు 50 మంది నుంచి రూ.15 కోట్ల వరకు వసూలు చేసిన ఓబిలి సంస్థ.. ప్లాట్ల కేటాయింపులు చేయలేదు. బాధితులంతా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఓబిలి హౌసింగ్ ఎండీ పాపన్నగారి రామచంద్రారెడ్డిని సైబరాబాద్ ఈవోడబ్ల్యూ పోలీసులు 15 రోజుల క్రితం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అలాగే.. నగరంలోని హఫీజ్‌పేట్ సర్వే నెంబర్ 80 పరిధిలోని భూములు వివాదంలో ఉన్నాయి. ఈ భూములపై ప్రభుత్వానికి, కొందరు ప్రైవేటు వ్యక్తుల మధ్య సుప్రీం కోర్టులో కేసు ఉంది. ఈ విషయం అక్కడి నివాసితులకు, అధికారులకు, రాజకీయ నాయకులకు మాత్రమే తెలుసు. చాలా మందికి వివాద భూములని తెలియకపోవడంతో ఓ ప్రముఖ నిర్మాణ సంస్థ.. అక్కడ 35 అంతస్తుల భవనాన్ని నిర్మిస్తున్నట్టు బ్రోచర్ విడుదల చేసింది. ప్రీలాంచ్ ఆఫర్ కింద చదరపుటడుగు ధర కేవలం రూ.4500గా పెట్టింది. రెండు వారాల్లో వంద శాతం సొమ్ము చెల్లిస్తేనే ఆఫర్ వర్తిస్తుందని షరతు కూడా విధించింది. ఆ భూమి న్యాయపరమైన చిక్కుల్లో ఉందనే విషయం తెలుసుకోకుండా.. కొందరు దాంట్లో పెట్టుబడి పెడుతుండడం గమనార్హం.

గొలుసుకట్టు స్కీములు..

కొన్ని సంస్థలైతే ప్రీలాంచ్ ఆఫర్ల పేరుతో గొలుసుకట్టు స్కీములను ప్రోత్సహిస్తున్నాయి. ప్రధానంగా.. యాదాద్రి, సంగారెడ్డి, షాద్‌నగర్ ప్రాంతాల్లో.. నిరుద్యోగులకు ఉపాధి కల్పన పేరుతో భారీ దందాలు చేస్తున్నాయి. చదరపు గజం రూ.10వేలు పలికే ప్రాంతంలో రూ.6666, రూ.5999లకే చదరపు గజం అని, 120 చదరపు గజాలు కేవలం రూ.6 లక్షలకే అని.. ఆకర్షిస్తూ ప్రకటనలు చేస్తున్నాయి. ప్రీలాంచ్ పేరుతో వంద శాతం పేమెంట్ జరపాలనే షరతులు విధిస్తున్నాయి. ఒక్కసారి మొత్తాన్ని చెల్లిస్తే ఆఫర్ వర్తిస్తుందని చెబుతున్నాయి. అంతేకాక.. తమతో పాటు మరొకరిద్దరితో కొనుగోలు చేయిస్తే రాయితీలు ఇస్తామంటూ ఆకర్షిస్తున్నాయి. ఆ ఆఫర్లను చూసి పేద, మధ్య తరగతి కుటుంబాలవారు తమ బంధుమిత్రులను కూడా కొనుగోళ్లకు ప్రేరేపిస్తున్నారు.

రెరా కఠిన చర్యలు చేపడితేనే..

రెరా ఏర్పడి ఏడేళ్లు గడుస్తున్నా.. ప్రీలాంచ్ దందా చేస్తున్న సంస్థలపై తీసుకున్న చర్యలు నామమాత్రంగానే ఉన్నాయి. ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థలు, డెవలపర్లు యథేచ్ఛగా అక్రమ దందాలు నిర్వహిస్తున్నా.. రెరా ఉలుకూపలుకూ లేకుండా నిద్రమత్తులో తూగుతోంది. దీనిపై విమర్శలు రావడంతో.. ఏడాదిన్నర క్రితం పూర్తిస్థాయిలో ఓ ఐఏఎస్ అధికారి, ఇద్దరు సభ్యులతో రెరా కమిటీ ఏర్పాటు చేసినా.. అదిగత ప్రభుత్వ పెద్దల ఆదేశాలకు అనుగుణంగా పని చేసిందనే ఆరోపణలున్నాయి. అయితే.. ఎన్నికలకు ముందు రెరా ఒక్కసారిగా 13 రియల్ ఎస్టేట్ కంపెనీలకు, ప్రముఖ సంస్థలో పని చేసే రియల్ ఎస్టేట్ ఏజెంట్లకు నోటీసులివ్వడం చర్చనీయాంశమైంది. నోటీసులు అందుకున్న సంస్థల్లో కొత్త రియల్ కంపెనీలతోపాటు బెంగళూరుకు చెందిన ప్రెస్టీజ్ ఎస్టేట్స్ వంటి సంస్థలు ఉండటం గమనార్హం. నీమ్స్ బోరో గ్రూప్, ఎక్సలెన్స్ ప్రాపర్టీస్, సనాలి గ్రూప్, అర్బన్ యార్డ్స్, హ్యాపీ డ్రీమ్ హోమ్స్, విరతా డెవలపర్స్, రి వెండల్ ఫామ్స్, కావూరి హిల్స్, సెవెన్ హిల్స్, బిల్డాక్స్ రియల్ ఎస్టేట్స్, సుమధుర ఇన్ఫ్రా ప్రాజెక్ట్.. ఇలా పలు సంస్థలు నోటీసులు అందుకున్నాయి. కానీ.. ఇటీవల మధ్య తరగతి కుటుంబాలను దాదాపు రూ.60 కోట్ల మేర ముంచేసిన భారతి బిల్డర్స్ అనే సంస్థ ఎలాంటి నోటీసూ అందుకోకపోవడం గమనార్హం. ఆ సంస్థ కొంపల్లిలో 6.23ఎకరాల్లో 'భారతి లేక్ వ్యూ' పేరుతో ప్రాజెక్టును ప్రకటించి చదరపు అడుగుకు రూ.5వేలకు పైగా పలికేచోట కేవలం రూ.3200లకే చ.అడుగు అంటూ బురిడీ కొట్టించింది. కాగా.. ప్రీలాంచ్ ఆఫర్లతో మోసం చేసేవారిని పోలీసులు అరెస్ట్ చేసి, చీటింగ్ కేసు నమోదు చేసి జైలుకు పంపినా.. నెల, రెండు నెలలకు వారు తమ పలుకుబడితో బయటకు వస్తున్నారు. బాధితులకు మాత్రం సొమ్ము తిరిగిరావట్లేదు. తమ డబ్బు తమకు ఇవ్వాలని వారు ఆయా సంస్థల నిర్వాహకులను కోరితే.. వారు కోర్టులో తేల్చుకుందామంటున్నారు. తమ దగ్గరకు రావొద్దని కరాఖండిగా చెబుతున్నారు. దీంతో... కోర్టుల చుట్టూ తిరిగే ఓపిక, ఆర్థిక సామర్థ్యం లేని మధ్యతరగతి జీవులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ప్రీలాంచ్‌ల పేరుతో మోసం చేసిన సంస్థలు, ఏజెంట్ల నుంచి బాధితుల సొమ్మును రాబట్టే విధంగా రెరా కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



కఠినంగా వ్యవహరించాలి

ఇల్లు లేదా ఫ్లాట్ కొనాలనుకునేవారు రెరా రిజిస్ట్రేషన్ కలిగిన ప్రాజెక్టులోనే కొనాలి. ప్రీలాంచ్ ఆఫర్లను నమ్మి.. రెరా రిజిస్ట్రేషన్ లేని ప్రాజెక్టుల్లో కొనకూడదని ఎంతగా చెప్పినా చాలా మంది వినియోగదారులు పట్టించుకోవట్లేదు. తక్కువ ధరకు వస్తుందనగానే వెనుకా ముందూ చూడకుండా డబ్బులు చెల్లిస్తున్నారు. కనీసం ఆ సంస్థ నేపథ్యం గురించి తెలుసుకునే ప్రయత్నం కూడా చేయట్లేదు. కాబట్టి.. ఇలాంటి దందాలను అరికట్టాలంటే ప్రీలాంచ్ పేరుతో మోసం చేసే సంస్థల పట్ల ప్రభుత్వం, రెరానే కఠినంగా వ్యవహరించాలి.

- రాజశేఖర్ రెడ్డి,
క్రెడాయ్ హైదరాబాద్ అధ్యక్షుడు

ఆఫర్లను చూసి మోసపోవద్దు

ప్రీలాంచ్ ఆఫర్లను చూసి ప్రజలు మోసపోకూడదు. రెరా అనుమతులు పొందిన ప్రాజెక్టుల్లోనే కొనుగోలు చేయాలి. రియల్ ఏస్టేట్ వ్యాపారంలో పారదర్శకత ఉండాలి.

- ఎం.విజయసాయి, నారెడ్కో అధ్యక్షుడు

భూముల విలువ తెలుసుకొనేందుకు క్షేత్ర స్థాయి పర్యటనలు

రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో స్థిరాస్తుల మార్కెట్ విలువలను పెంచే దిశగా ఒక అడుగు ముందుకు పడింది. పెంపు మార్గదర్శకాలను రూపొందించడానికి కేంద్రీయ విలువల సలహా మండలి సమావేశమైంది. రిజిస్ట్రేషన్లు, స్టాంపుల కమిషనర్ నవీన్ మిత్తల్ అధ్యక్షతన ఈ కమిటీ సమావేశం జరిగింది. పట్టణాల సమీపంలోని గ్రామీణ ప్రాంతాలు, అవుటర్ రింగ్‌రోడ్డు, జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ, వ్యవసాయేతర భూములు, ఇళ్లు, ఇళ్ల స్థలాలు, నివాసాలు, వ్యాపార సముదాయాలు తదితర స్థిరాస్తుల విలువలను పెంచేందుకు రాష్ట్ర వ్యాప్తంగా క్షేత్ర స్థాయి పర్యటనలు చేయాలని కమిటీ నిర్ణయించింది. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో పేర్కొనే మార్కెట్ విలువలకు బహిరంగ మార్కెట్ విలువలకు మధ్య వ్యత్యాసం తెలుసుకొనేందుకు క్షేత్ర పర్యటనలు తప్పనిసరి అని అభిప్రాయపడింది. 2013 తర్వాత కేంద్రీయ కమిటీ సమావేశం కావడం ఇదే ప్రథమం. బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2021 జులై, 2022 ఫిబ్రవరిలో స్థిరాస్తుల రిజిస్ట్రేషన్ మార్కెట్ విలువను సవరించినపుడు క్షేత్రస్థాయి పర్యటనలు చేయలేదు. పాత విలువలను పరిగణనలోకి తీసుకొని పైన కొంతశాతం చేర్చి పెంచేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈసారి శాస్త్రీయ పద్ధతులను అనుసరిస్తున్నారు. బహిరంగ మార్కెట్ విలువ భారీగా ఉండి, రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో పేర్కొనే మార్కెట్ విలువ బాగా తక్కువగా ఉంటే ఆ వ్యత్యాసాన్ని తొలగిస్తారు. ఈ క్రమంలో సబ్ రిజిస్ట్రార్ పరిధిలోకమిటీల అభిప్రాయాలను తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకుంటారు.

## కాంగ్రెస్‌కు ఓటు వేయని సోనియా, రాహుల్..



ఢిల్లీ: ఆరో విడత లోక్‌సభ ఎన్నికల పోలింగ్ సందర్భంగా ఓ అరుదైన ఘటన చోటుచేసుకుంది. సాధారణంగా సోనియాగాంధీ, రాహుల్ గాంధీ పేర్లు చెబితే గుర్తొచ్చేది కాంగ్రెస్ పార్టీ.. ఆ ఇద్దరు ఓటు ఎవరికి వేస్తారని ఎవరిని అడిగినా వెంటనే వచ్చే సమాధానం కాంగ్రెస్ పార్టీ.. హస్తం గుర్తు.. కానీ ఈ ఎన్నికల్లో సోనియా, రాహుల్ గాంధీలు హస్తం గుర్తుకి ఓటు వేయలేదు. వేరే పార్టీ అభ్యర్థికి ఓటు వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. వాళ్లిద్దరూ పొరపాటున వేరే పార్టీ అభ్యర్థికి ఓటు వేయలేదు. పొత్తులో భాగంగా ఆ ఇద్దరూ వేరే పార్టీ అభ్యర్థికి ఓటు వేయాల్సిన పరిస్థితి వచ్చింది. ఢిల్లీలోని ఏడు లోక్‌సభ స్థానాలకు ఆరో విడతలో భాగంగా ఈరోజు పోలింగ్ జరుగుతోంది. న్యూఢిల్లీ నియోజకవర్గంలో సోనియా, రాహుల్ గాంధీకి ఓటు హక్కు ఉంది. దీంతో న్యూఢిల్లీలోని నిర్మాణ్ భవన్‌లో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రంలో వాళ్లిద్దరూ ఇవాళ ఉదయం ఓటు హక్కు వినియోగించుకున్నారు.

కాంగ్రెస్‌కు ఎందుకు వేయలేదంటే..

ఢిల్లీలో ఆప్‌తో కాంగ్రెస్ పొత్తు పెట్టుకుంది. మొత్తం 7లోక్‌సభ స్థానాలున్న ఢిల్లీలో ఆప్ నాలుగు స్థానాల్లో పోటీచేస్తుండగా.. కాంగ్రెస్ మూడు స్థానాల్లో పోటీచేస్తోంది. దీనిలో భాగంగా న్యూఢిల్లీ లోక్‌సభ స్థానం నుంచి ఆమాద్మీ అభ్యర్థి భారతి పోటీచేస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి పోటీలో లేకపోవడంతో సోనియా, రాహుల్ కాంగ్రెసేతర అభ్యర్థులకు ఓటు వేయాల్సి వచ్చింది. ఉదయం 9.30 గంటలకు నిర్మాణ్ భవన్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రానికి చేరుకుని తమ ఓటు వేశారు. న్యూఢిల్లీ లోక్‌సభ నియోజకరవ్గం నుంచి ఆప్ అభ్యర్థిగా సోమనాథ్ భారతి పోటీచేస్తుండగా.. బీజేపీ అభ్యర్థిగా బీజేపీ దివంగత నేత సుష్మాస్వరాజ్ కుమార్తె బన్సూరి స్వరాజ్ పోటీచేస్తున్నారు. ఓటు వేసిన తర్వాత సోనియా, రాహుల్ తమ చేతి వేలిపై సిరా చుక్కను చూపిస్తూ పోలింగ్ బూత్ బయట తీసుకున్న సెల్ఫీని రాహుల్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ప్రజాస్వామ్య దేశంలో ఎన్నికలు పండుగ లాంటివని.. అమ్మ, నేను ఈ ప్రజాస్వామ్య పండుగలో పాల్గొన్నామని.. మిగతా ఓటర్లు తమ ఇంటి నుంచి బయటకు వచ్చి ఓటు హక్కు వినియోగించుకోవాలని ఈ సందర్భంగా రాహుల్ గాంధీ కోరారు.

## ఓటరు జాబితాలో లేని జైశంకర్ పేరు.. తీరా చూస్తే..



ఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల ఆరో విడత పోలింగ్ శనివారం జరుగుతోంది. ఆరు రాష్ట్రాలు, రెండు కేంద్రపాలిత ప్రాంతాల్లోని 58 లోక్‌సభ స్థానాలకు ఓటింగ్ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలోనే.. ఓటర్లందరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలింగ్ బూత్స్‌కి తరలి వెళ్తున్నారు. కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ కూడా ఓటు వేసేందుకు పోలింగ్ బూత్‌కు చేరుకున్నారు. సుమారు 20 నిమిషాల పాటు ఆయన క్యూలో నిలబడ్డారు కూడా! కానీ.. ఆ తర్వాత ఊహించని ట్విస్ట్ వెలుగు చూసింది. ఓటరు జాబితాలో ఆయన పేరు లేదని తేలింది. దీంతో ఖంగుతిన్న జైశంకర్.. మరోసారి ఆ జాబితాను చెక్ చేశారు. చివరికి తన పేరు లేదని కన్ఫమ్ చేసుకున్న ఆయన.. ఓటు వేయకుండా ఇంటికి చేరుకున్నారు. ఇంటికెళ్లిన తర్వాత జాబితాలో తన పేరు ఎందుకు లేదని మరోసారి తనిఖీ చేశారు. అప్పుడు అసలు విషయం వెలుగులోకి వచ్చింది. తన ఓటింగ్ కేంద్రం మరో ప్రాంతంలో ఉందని తెలుసుకున్నారు. దీంతో.. ఆ పోలింగ్ బూత్‌కి వెంటనే వెళ్లి, తన ఓటు వేశారు. ఇక్కడే మరో ఆసక్తికర పరిణామం తెరమీదకు వచ్చింది. ఆ కేంద్రంలో ఓటు వేసిన తొలి పురుషుడు తానే కావడంతో.. అధికారులు ఆయనకు ఓ సర్టిఫికెట్ ఇచ్చారు. ఈ విషయాన్ని ఆయన తన ఎక్స్ ఖాతాలో షేర్ చేసుకుంటూ.. ఆ సర్టిఫికెట్‌ను చూపించారు. ఇదే సమయంలో.. రికార్డ్ స్థాయిలో ఓటు వేయాలని ఓటర్లకు జైశంకర్ విజ్ఞప్తి చేశారు. న్యూ ఢిల్లీలో తాను తన ఓటు హక్కుని వినియోగించుకున్నానని, ఇతర ఓటర్లు సైతం ఈ ఆరో దశ లోక్‌సభ ఎన్నికల్లో రికార్డ్ సంఖ్యలో ఓటు వేయాలని కోరుతున్నానని ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. అలాగే ఓటు వేసిన అనంతరం మీడియాతోనూ మాట్లాడారు. "భారతదేశానికి ఇదొక నిర్ణయాత్మక తరుణం కాబట్టి.. ప్రజలందరూ బయటకొచ్చి ఓటు వేయాలని కోరుతున్నాను" అని అన్నారు.

## ప్రజాస్వామ్య దేశంలో ప్రతి ఓటూ ముఖ్యమే...



ఢిల్లీ: లోక్ సభ ఆరో దశ ఎన్నికలు జరుగుతున్న వేళ ప్రధాని మోదీ ఎక్స్ అకౌంట్లో ఆసక్తికర పోస్ట్ చేశారు. ఓటర్లు పెద్ద సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

"ప్రజాస్వామ్య దేశంలో ప్రతి ఓటూ ముఖ్యమే.

ఓటు హక్కును వినియోగించుకుంటేనే ప్రజాస్వామ్యం అభివృద్ధి చెందుతుంది. మహిళలు, యువత అధిక సంఖ్యలో తరలి వచ్చి ఓటు వేయాలని కోరుతున్నా" అని మోదీ అన్నారు.

బుజ్జగింపులు, అవినీతికి వ్యతిరేకంగా ఓటు వేయాలి..

బుజ్జగింపులు, అవినీతి రాజకీయాలకు వ్యతిరేకంగా ప్రజలు ఓటు వేయాలని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా అన్నారు. పెద్ద సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు తరలి వచ్చి ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటాలని పిలుపునిచ్చారు. లోక్‌సభ ఎన్నికల ఆరో దశ ఓటింగ్ ప్రశాంతంగా జరుగుతోంది. ఈ దశలో ఢిల్లీలోని మొత్తం ఏడు స్థానాలతో సహా.. ఆరు రాష్ట్రాలు, రెండు కేంద్రపాలిత ప్రాంతాల్లోని 58 స్థానాలకు శనివారం ఉదయం 7 గంటలకే పోలింగ్ ప్రారంభమైంది. ఈ దశలో 11 కోట్ల మంది ఓటర్లు 889 మంది అభ్యర్థుల ఎన్నికల భవితవ్యాన్ని నిర్ణయించనున్నారు.

## నెమ్మదిగా సాగుతున్న పోలింగ్..కారణం అదే..!




ఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఆరో విడతలో 8 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 58 లోక్‌సభ స్థానాలకు పోలింగ్ జరుగుతోంది. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. పలుచోట్ల ఈవీఎం మిషన్లు మొరాయించడంతో ఓటింగ్ ప్రక్రియ నెమ్మదిగా సాగుతోంది. పోలింగ్ బూత్‌ల వద్ద భారీగా క్యూలైన్లు కనిపిస్తున్నాయి. మరోవైపు ఈవీఎంలు పనిచేయడం లేదంటూ ఎన్నికల సంఘానికి వందల సంఖ్యలో ఫిర్యాదులు వస్తున్నాయి. దేశ రాజధాని ఢిల్లీతో పాటు.. పశ్చిమ బెంగాల్, జమ్మూ కాశ్మీర్‌లోని అనంత్‌నాగ్-రాజౌరీ, ఒడిశాలోని పూరీ లోక్‌సభ స్థానంలో ఈవీఎంలు పనిచేయడం లేదంటూ వివిధ పార్టీలు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశాయి. ఢిల్లీలో పోలింగ్ ప్రక్రియ నెమ్మదిగా సాగుతోందని.. ఓటింగ్ వేగంగా, సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎన్నికల కమిషన్‌ను ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ కోరారు. . ఢిల్లీలోని కొన్ని ప్రాంతాల్లో ఓటింగ్ ప్రక్రియ చాలా స్లోగా జరుగుతోందని ఆమ్ ఆద్మీ పార్టీ నేత అతిషి అన్నారు. చాందినీ చౌక్‌లోని ఢిల్లీ గేట్ ప్రాంతంలోని పోలింగ్ బూత్ వద్ద భారీ క్యూ ఉందని, గత 2 గంటలుగా ఇక్కడ ఈవియంలు పనిచేయలేదని ఆమ్‌ఆద్మీ పార్టీ నేతలు చెబుతున్నారు.

ఢిల్లీలో మొరాయించిన ఈవీఎంలు

ఢిల్లీలోని చాందినీ చౌక్‌లోని ఢిల్లీ గేట్ బూత్‌లో కూడా ఈవీఎం పనిచేయడంలేదని ఈసీకి ఫిర్యాదు అందింది. ఈవీఎంలు పనిచేయకపోవడంతో ఓటు వేసేందుకు మండుటెండలో ప్రజలు క్యూలో నిల్చున్నారు. ఓటు వేయడానికి రెండు గంటలకు పైగా సమయం పడుతుందని ఓటర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఒడిశాలోని పూరిలో..

ఒడిశాలోని పూరీ లోక్‌సభ స్థానంలో చాలా పోలింగ్ బూత్‌లలో ఈవీఎం మిషన్లు పనిచేయడం లేదని బీజేపీ అభ్యర్థి సంబిత్ పాత్ర ఎన్నికల సంఘం అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈవీఎం మెషిన్లు పనిచేయకపోవడంతో ఓటర్లు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కొంతమంది ఓటు వేయకుండానే వెనుదిరుగుతున్న పరిస్థితులు ఉన్నాయని.. తక్షణమే సమస్యను పరిష్కరించాలని సంబిత్ పాత్ర ఎన్నికల అధికారులను కోరారు. ఈవీఎం యంత్రాలు మొరాయిస్తున్న పోలింగ్ బూత్‌లలో ఓటు వేసేందుకు నిర్దేశించిన సమయాన్ని పొడిగించాలని తాము ఎన్నికల సంఘాన్ని కోరుతున్నామన్నారు.

# అందరిచూపు ఢిల్లీ వైపు!

దేశవ్యాప్తంగా ఆరో దశ ఎన్నికల పోలింగ్.. 6 రాష్ట్రాలు, 2 యూటీల్లో 58 సీట్లకు ఓటింగ్

ఢిల్లీ, హరియాణలోని అన్ని స్థానాలకు

యూపీలో 14, బిహార్, బెంగాల్లో 8 చోట్ల



## ఎన్డీయేను ఇండియా ఓడిస్తుందా?

న్యూఢిల్లీ, : లోక్‌సభ ఎన్నికల సమరంలో ఆరో దశ పోలింగ్‌కు రంగం సిద్ధమైంది. ఢిల్లీతో సహా ఆరు రాష్ట్రాలు, రెండు కేంద్రపాలిత ప్రాంతాల్లోని 58 నియోజకవర్గాల్లో శనివారం ఓటింగ్ జరగనుంది. దేశ రాజధానిలోని 7 స్థానాలు, హరియాణలోని మొత్తం 10 సీట్లకు ఈ విడతలోనే ఎన్నికలు జరుగుతున్నాయి. ఢిల్లీలో ఆరుచోట్ల సిటింగ్ ఎంపీలను మార్చిన బీజేపీకి, ఇండియా కూటమిలో భాగమైన ఆప్, కాంగ్రెస్ మధ్యన గట్టి పోటీ నెలకొంది. మద్యం కేసులో జైలుపాలై బెయిల్ మీద బయటకు వచ్చిన ఆప్ అధినేత, సీఎం కేజ్రీవాల్ ప్రధాని మోదీపై తీవ్ర ఆరోపణలతో ప్రచారం సాగించారు. ఇదే సమయంలో పార్టీ ఎంపీ స్వాతి మలీవాల్ తనపై సీఎం నివాసంలోనే దాడి జరిగిందని ఆరోపించడం, ఈ కేసులో కేజ్రీ పీఏ విభవ్ అరెస్టు కావడంతో ఎన్నికలకు మరింత ప్రాధాన్యత ఏర్పడింది. అంతేగాక ఆప్, కాంగ్రెస్ తొలిసారిగా బీజేపీపై సంయుక్త అభ్యర్థులను నిలిపిన నేపథ్యంలో ఢిల్లీ తీర్పుపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. కాగా, ఆరో దశలో యూపీలోని 14, పశ్చిమబెంగాల్, బిహార్‌లో 8 స్థానాల చొప్పున, ఒడిసాలో 6, జార?ండ్‌లో 4, జమ్మూకశ్మీర్‌లో ఒక్కో నియోజకవర్గంలో పోలింగ్ జరుగనుంది. వీటిలో మొత్తం 889 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. 11.13 కోట్ల మంది ఓటర్లు తమ హక్కును వినియోగించుకోనున్నారు. ఒడిసాలోని 42 అసెంబ్లీ సీట్లకూ శనివారం ఓటింగ్ నిర్వహించనున్నారు. మరోవైపు అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఇబ్బంది కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ఎన్నికల సంఘం ఆయా రాష్ట్రాల యంత్రాంగాన్ని ఆదేశించింది. కాంగ్రెస్ అగ్ర నేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీలు ఢిల్లీలో ఓటు వేయనున్నారు. బీజేపీ అభ్యర్థులు, కేంద్ర మంత్రులు ధర్మేంద్ర ప్రధాన్, ఇంద్రజీత్ సింగ్, క్రిషన్‌పాల్ గుర్జర్, మనేకా గాంధీ, సంబిత్ పాత్రా, మనోహర్‌లాల్ ఖట్టర్, పీడీపీ చీఫ్ మెహబూబా ముఫ్తీ, కాంగ్రెస్ నేతలు దీపేందర్‌సింగ్ హుడా, రాజ్ బబ్బర్ తదితరులు ఈ విడతలో పోటీలో ఉన్న ప్రముఖులు. ఢిల్లీలో ఉన్న తెలుగువారిని మెప్పించేందుకు శుక్రవారం ఆంధ్రా, తెలంగాణ భవన్‌లో భోజనం చేసి పలువురి దృష్టిని ఆకర్షించిన రాహుల్ గాంధీ శనివారం మెట్రోలో ప్రయాణించారు. ఈ ఎన్నికలు ధరల పెరుగుదల, నిరుద్యోగం, రాజ్యాంగ సంస్థలపై దాడులపై ప్రజల నిరసనకు సంకేతంగా నిలవాలని,, కాంగ్రెస్, ఇండియా కూటమి అభ్యర్థుల గెలుపునకు దోహదం చేయాలని సోనియా వీడియో విడుదల చేశారు.

జంగల్ మహల్

బెంగాల్‌లో పోలింగ్ జరగనున్న 8 స్థానాలూ గిరిజనుల పట్టున్న జంగల్ మహల్ ప్రాంతంలోనివే. వీటిలో గత ఎన్నికల్లో బీజేపీ 5, టీఎంసీ 3 చోట్ల గెలిచాయి. ఈసారి ఎన్నికలు తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, సీఎం మమత ప్రతిష్ఠకు సవాలుగా మారాయి. మేదినీపూర్, పురూలియా, బంకూర తదితర కీలక నియోజకవర్గాలున్న ఈ ప్రాంతంలో అత్యధికంగా సంతాల్, ముండా, ఒరాన్ తదితర ఆదివాసీ తెగల ప్రజలు నివసిస్తారు. కోల్‌కతా హైకోర్టు మాజీ జడ్జి జస్టిస్ అభిజిత్ గంగోపాధ్యాయ, ప్రతిపక్ష నేత సువేందు అధికారి సోదరుడు సుమేందు అధికారి ఈ విడతలో పోటీలో ఉన్నారు. వివిధ పార్టీలు, స్వతంత్రులు మొత్తంగా 79 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. కాగా, యూపీలోని సుల్తాన్‌పురి నుంచి మనేకాగాంధీ, ఆజంఘడ్ నుంచి సమాజ్ వాది పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్ అన్న కుమారుడు అభ్యర్థి ధర్మేంద్రయాదవ్ భవితవ్యం తేల్చుకోనున్నారు. లాల్‌బహదూర్‌శాస్త్రి, వీపీ సింగ్, మురళీ మనోహర్ జోషి వంటి ఉద్దండులు పోటీ చేసిన ప్రయాగ్‌రాజ్, తొలి ప్రధాని నెహ్రూ ప్రాతినిధ్యం వహించిన ఫూల్‌పూర్, శ్రావస్తి తదితర నియోజకవర్గాల్లో ఎన్నికలు జరుగుతున్నాయి.

# సంపన్నులపై 2 శాతం పన్ను

రూ.10 కోట్లకుపైగా నికర సంపదపై ఏటా విధించాలి

వారసత్వ సంపదపై 33శ వేయాలి

థామస్ పికెటీ తదితర ఆర్థికవేత్తల సిఫార్సులు




న్యూఢిల్లీ, : భారతదేశంలో పెరిగిపోతున్న ఆర్థిక అసమానతలను అరికట్టటానికి రూ.10కోట్లకన్నా ఎక్కువ నికర సంపద ఉన్న అతి ధనవంతులపై 2శ వార్షిక పన్ను విధించాలని ప్రఖ్యాత ఆర్థికవేత్త థామస్‌పికెటీ తదితరులు సూచించారు. రూ.10కోట్లకు మించిన వారసత్వ సంపదపై 33శ పన్ను విధించాలన్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయం భారీగా పెరుగుతుందని, అది జీడీపీలో 2.73శ ఉంటుందన్నారు. దీని నుంచి పేదలు, మధ్యతరగతి, నిమ్నకులాల వారికి సంపదను పునఃపంపిణీ చేయాలని సిఫార్సు చేశారు. పలు ప్రజాసంక్షేమ రంగాలకు బడ్జెట్‌ను పెంచటానికి దీనిద్వారా వీలవుతుందని చెప్పారు. ఉదాహరణకు.. విద్యారంగానికి బడ్జెట్‌లో కనీసం 6శనిధులు కేటాయించాలని ప్రభుత్వమే తీసుకొచ్చిన నూతన విద్యా విధానం-2000 చెబుతోందని, కానీ గత 15ఏళ్లుగా ఆ రంగానికి జీడీపీలో 2.9శాతానికి మించి కేటాయించటంలేదని గుర్తుచేశారు. దేశంలోని 99.96 శాతం జనాభాపై పన్ను ప్రభావంలేకుండా, మిగిలిన అతి ధనవంతులపైనే పన్నువేసి ప్రభుత్వ ఆదాయాన్ని పెంచుకోవాలన్నారు. 'భారత్‌లో విపరీతంగా పెరిగిన అసమానతలను ఎదుర్కోవటానికి సంపద పన్ను ప్రతిపాదనలు' అనే పేరుతో రూపొందించిన పరిశోధన పత్రంలో ఈ ప్రతిపాదనలు చేశారు. పారిస్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్‌కు చెందిన థామస్ పికెటీ, అన్‌మోల్ సోమాంచి, హార్వర్డ్ కెనడీ స్కూల్‌కు చెందిన ల్యూకాస్ చాన్సల్, న్యూయార్క్ యూనివర్సిటీకి చెందిన నితిన్ కుమార్ భారతి సంయుక్తంగా ఈ పత్రాన్ని రూపొందించారు. వీరు 'వరల్డ్ ఇనీక్వాలిటీ ల్యాబ్' సంస్థలోనూ పని చేస్తున్నారు. భారత్‌లో పన్ను ప్రతిపాదనలపై ప్రజాస్వామ్యబద్ధంగా, విస్తృతస్థాయిలో చర్చలు జరగాలని, అవన్నీ సంపద పునఃపంపిణీ, అసమానతలను రూపుమాపటం లక్ష్యంగా ఉండాలని వీరు పేర్కొన్నారు. దేశంలో అసమానతలపై ఇటీవలి కాలంలో చర్చలు బాగా పెరిగాయన్నారు. తాము మార్చి 20న విడుదల చేసిన 'భారత్‌లో ఆదాయం, సంపద అసమానతలు, 1922-2023: శత కోటీశ్వరుల రాజ్యం' పరిశోధన పత్రం కూడా దీనికి దోహదపడిందని గుర్తు చేశారు. కాగా భారత బిలియనీర్లు దాదాపుగా అందరూ అగ్ర కులాలకు చెందిన వారేనని తాజా పరిశోధన పత్రం సహ రచయిత అన్‌మోల్ సోమాంచి పేర్కొన్నారు. తాము ప్రతిపాదిస్తున్న పన్నును ప్రగతి పన్నుగా అభివర్ణించారు. 'సమానత్వ, సుసంపన్న భారత్‌ను నిర్మాణానికి ప్రగతి పన్ను విధింపు, సమర్థవంతమైన పునఃపంపిణీ, సామాజిక రంగాల్లో సమగ్రస్థాయిలో పెట్టుబడులు అత్యవసరంగా చేపట్టాల్సిన పని' అన్నారు.

# మోసపోతే గోస పడతారని చెప్పాం...

అయినా మార్పు కావాలని కాంగ్రెసను గెలిపించారు

హత్యా రాజకీయాలకు తెరతీసిన రేవంత్ సర్కార్

ఉచిత బస్సు హామీ తప్ప ఇంకేమీ చేయలేదు: కేటీఆర్



హైదరాబాద్, : "మోసపోతే గోస పడతారని, కాంగ్రెస్ మాయ మాటలు నమ్మొద్దని అసెంబ్లీ ఎన్నికల్లో చెప్పినప్పటికీ వినలేదు. కాంగ్రెసనే గెలిపించారు. రేవంత్ సర్కార్ రాష్ట్రాన్ని అభివృద్ధి చేయకుండా హత్యా రాజకీయాలు చేస్తోంది" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దామెరలో, నల్లగొండ జిల్లా దేవరకొండ, నకిరేకల్‌లలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక సన్నాహక సమావేశాల్లో ఆయన మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వం ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఫ్లోరైడ్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించి అన్ని గ్రామాలు, తండాలకు మిషన్ భగీరథ ద్వారా తాగునీరు అందించిందన్నారు. ఉచిత బస్సు హామీ తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందేమీ లేదని విమర్శించారు. కాంగ్రెసకు మొదటి హెచ్చరిక జారీ చేసేదే ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ఫలితమని అన్నారు. ఈ ఉపఎన్నికతో కాంగ్రెస్ ప్రభుత్వం ఏమీ పోదని, కానీ ప్రశ్నించే గొంతును గెలిపించాలని కోరారు. పదేళ్ల నిజం, ఆరు నెలల అబద్ధం మీ ముందు ఉన్నాయని, పట్టభద్రులు ఆలోచన చేయాలన్నారు. తనపై 54 క్రిమినల్ కేసులు ఉన్నాయని తీన్మార్ మల్లన్నే ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారని చెప్పారు. బీఆర్ఎస్ అభ్యర్థి గోల్డ్ మెడలిస్ట్ అని, కాంగ్రెస్ అభ్యర్థి బ్లాక్ మెయిలర్ అని కేటీఆర్ అన్నారు.

ఆర్టీసీ ఎండీని కోర్టుకు లాగుతాం

అధికారంలో ఉన్న వారి మాటలు విని వేధిస్తే కోర్టుకు లాగుతామని డీజీపీ రవిగుప్తా, ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌లను కేటీఆర్ హెచ్చరించారు. ఆర్టీసీ కొత్తలోగో ప్రచారం విషయంలో బీఆర్ఎస్ నేతలపై కేసులు నమోదు చేయడం పట్ల శుక్రవారం ఎక్స్ వేదికగా ఆయన స్పందించారు. ఆర్టీసీ కొత్తలోగో అంటూ ప్రచారం చేసిన ఎన్టీవీ, బిగ్‌టీవీ చానెళ్లు, వెలుగు దినపత్రికపై కేసులు ఎందుకు పెట్టలేదని నిలదీశారు. నిజాలను బట్టబయలు చేస్తున్న బీఆర్ఎస్ నేతలపై కేసులు పెడుతున్నారు.. మరి నకిలీవార్తలు ప్రచారం చేస్తున్న సీఎంను జైల్లో ఎందుకు పెట్టరని పోలీసులను ప్రశ్నించారు.

## మంత్రివర్గం నుంచి సీతక్క తొలిగింపు..కీలక పదవి!?



హైదరాబాద్ : జూన్ 4న ఎన్నికల ఫలితాల తరువాత తెలంగాణ రాజకీయం ఆసక్తికరంగా మారుతోంది. పలు కీలక నిర్ణయాల దిశగా సీఎం రేవంత్ అడుగులు వేస్తున్నారు. పార్టీ, పాలనా పరంగా ఆసక్తి నిర్ణయాలు వెలువడే అవకాశం కనిపిస్తోంది. పీసీసీ చీఫ్..సీఎంగా రేవంత్ ఇప్పటి వరకు కొనసాగుతున్నారు. ఇక..ఎన్నికలు పూర్తి కావటంతో పూర్తిగా పాలనకు పరిమితం కావాలని భావిస్తున్నారు. ఈ దశలో తెలంగాణ కొత్త పీసీసీ చీఫ్ నియామకం పైన కసరత్తు మొదలైంది. నూతన పీసీసీ చీఫ్ తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ..ప్రభుత్వంలో రేవంత్ మార్క్ నిర్ణయాలు అమలు అవుతున్నాయి. రేవంత్ కు ఫ్రీ హ్యాండ్ ఇచ్చిన పార్టీ హైకమాండ్ సీఎం అభిప్రాయాలకు ఆమోదం తెలుపుతోంది. రేవంత్ సీఎం అయిన తరువాత పీసీసీ చీఫ్ గా మరొకరికి అవకాశం ఇవ్వాలనే ప్రతిపాదన పైన చర్చ జరిగింది. అయితే, పార్లమెంట్ ఎన్నికలు పూర్తయ్యే వరకూ పీసీసీ చీఫ్ పదవిలోనూ కొనసాగాలని పార్టీ నాయకత్వం రేవంత్ కు నిర్దేశించింది. ఇప్పుడు ఎన్నికలు పూర్తి కావటంతో నూతన పీసీసీ చీఫ్ పదవి ఎంపిక పైన కసరత్తు మొదలైంది. రేవంత్ ను సీఎంగా చేసే సమయంలో భట్టికి డిప్యూటీ సీఎం తో పాటుగా పీసీసీ చీఫ్ పదవి పైన హామీ లభించినట్లు ప్రచారం జరిగింది. కానీ, ఇప్పుడు రేవంత్ కేబినెట్ మొత్తం కలిసి కట్టుగా పని చేస్తోంది. ఇక..పీసీసీ చీఫ్ పదవి ఖరారులోనూ రేవంత్ మాటకే అధినాయకత్వం ఆమోదం తెలపనుంది. అందులో భాగంగా పీసీసీ పదవి కోసం సీనియర్ నేతలు జగ్గారెడ్డి, మహేష్ కుమార్ గౌడ్, మధుయాష్కీలు పీసీసీ కోసం ప్రయత్నిస్తున్నారు. కానీ, అనూహ్యంగా రేవంత్ ఛాయిస్ గా మంత్రి సీతక్క పేరు తెర మీదకు వచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. గిరిజన మహిళకు పీసీసీ పగ్గాలు అప్పగించటం ద్వారా సానుకూలత పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. పీసీసీ పదవి కోసం పోటీ పడుతున్న నేతలు సైతం సీతక్కను ఎంపిక చేస్తూ సహకారం అందిస్తారని భావిస్తున్నారు. సీతక్క పైన పార్టీలో అందరికి సదభిప్రాయం ఉంది. పార్టీ కోసం కష్టపడి పని చేస్తారనే నమ్మకంతో పాటుగా రేవంత్ కు నమ్మినబంటుగా పేరుంది. దీంతో..ఇతరుల నుంచి అభ్యంతరం రాకుండా సీతక్కను మంత్రి పదవి నుంచి తొలిగించి పీసీసీ చీఫ్ బాధ్యతలు కేటాయిస్తారని పార్టీలో ప్రచారం సాగుతోంది. అయితే, మంత్రిగా కొనసాగుతూనే పీసీసీ చీఫ్ పదవి అప్పగించేలా మరో వాదన కూడా వినిపిస్తోంది. అయితే, ఎన్నికల ఫలితాల తరువాత ముందుగా పీసీసీ చీఫ్ నియామకం..ఆ వెంటనే మంత్రివర్గ విస్తరణ..నామినేటెడ్ పదవుల భర్తీ దిశగా వరుస నిర్ణయాలు ఉంటాయని సమాచారం. అయితే, సీతక్క ఎంపిక పైన పార్టీ హైకమాండ్ ఎన్నికల ఫలితాల తరువాత తెలంగాణ కాంగ్రెస్ ముఖ్యులతో చర్చించి..ఏకాభిప్రాయంతో నిర్ణయం ప్రకటించే అవకాశం ఉంది. సీతక్క కే పార్టీ పగ్గాలు అప్పగిస్తే..తెలంగాణ కాంగ్రెస్ పగ్గాలు చేపట్టిన తొలి గిరిజన మహిళా గుర్తింపు పొందనున్నారు.

## తొలిసారి సీఎం రేవంత్ రెడ్డి అక్కడికి..!



రేవంత్ రెడ్డి తొలిసారి ముఖ్యమంత్రి హోదాలో కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సందర్శించనున్నారు. బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 12లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు ఆయన మరికాసేపట్లో రానున్నారు. సెంటర్‌లో అధికారుల విధులు, ఇతర అంశాలపై సమీక్షించనున్నట్లు సమాచారం. నార్కోటిక్స్ బ్యూరో పనితీరు, పలు అంశాలపైనా సీఎం రేవంత్ ఆరా తీయనున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నార్కోటిక్స్ బ్యూరోకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించారు. తెలంగాణలో డ్రగ్స్ నిర్మూలనకు తీసుకోవాల్సిన అంశాలపై అధికారులతో సీఎం రేవంత్ రెడ్డి సమీక్షించనున్నారు. రాష్ట్రంలో ముఖ్యంగా హైదరాబాద్‌లో గంజాయి, డ్రగ్స్ వంటి మత్తుపదార్థాల బారిన యువత పడకుండా తగిన చర్యలు తీసుకోవడంపై చర్చించనున్నారు. తాజాగా బెంగళూరు శివారులో తెలుగు నటులు మత్తు పదార్థాలు వినియోగించి రేవ్ పార్టీలో పట్టుపడడంతో ఈ సమావేశంపై ఆసక్తి నెలకొంది. డ్రగ్స్ నిర్మూలనకు సీఎం ఎలాంటి చర్యలు చేపట్టనున్నారో వేచి చూడాల్సిందే..

## మోదీ 'ముజ్రా' వ్యాఖ్యలు..
## పీఎం కోలుకోవాలంటూ విపక్షం కౌంటర్



బీహార్: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఎన్నికల ప్రచారంలో విపక్షాలపై నిప్పులు చెరుగుతున్నారు. బీహార్‌లోని పాటలిపుత్రలో శనివారం జరిగిన ఎన్నికల ప్రచారంలో 'ఇండియా' కూటమి ముస్లిం ఓట్ బ్యాంకు కోసం బానిసత్వం చేస్తోందని, 'ముజ్రా' ఆడుతోందని వ్యాఖ్యానించారు. కాగా, పీఎం 'ముజ్రా' వ్యాఖ్యలపై విపక్ష నేతలు ఘాటుగా స్పందించారు. పీఎం మానసిక పరిస్థితికి ఆయన మాటలు అద్దం పడుతున్నాయని, చికిత్సతో త్వరగా కోలుకోవాలని ఆశిస్తున్నామని పేర్కొంది. మోదీ ఏమన్నార ఇండియా కూటమిలోని పలు ప్రధాన పార్టీలను ప్రధాని మోదీ శనివారంనాడు టార్గెట్ చేస్తూ, ముస్లిం ఓట్ల కోసం ఇండియా కూటమి బానిసత్వం చేస్తోందని ఆరోపించారు. "ముజ్రా" డాన్స్ ఆడుతోందన్నారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లను దోచుకునే ప్రయత్నాలను అడ్డుకుంటామన్నారు. సామాజిక న్యాయం కోసం దిశానిర్దేశం చేసిన భూమి బీహార్ అని, ఇక్కడ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ హక్కులను దోచుకోవడానికి, వాటిని ముస్లింలకు మళ్లించడానికి ఇండియ కూటమి ప్లాన్ చేస్తోందన్నారు.

### చికిత్స తీసుకోండి..

ప్రధానమంత్రి చేసిన 'ముజ్రా' (మొఘల్‌ల కాలంలోని నృత్యరీతి) వ్యాఖ్యలపై విపక్షాలు మండిపడ్డాయి. ప్రధాని నోటి వెంట 'ముజ్రా' మాట వచ్చినట్టు విన్నానని, ఆయన మానసిక స్థితిపై సందేహం కలుగుతోందని కాంగ్రెస్ ప్రతినిధి పవన్ ఖేర వ్యాఖ్యానించారు. "మోదీజీ...మీరు ఏదైనా చికిత్స తీసుకోండి. అమిత్‌షా, జేపీ నడ్డా అయినా ఆయనను తక్షణం చూపించాలి. బహుశా ఎండల కింద స్పీచ్‌లు ఇచ్చి మైండ్ మీద ఆ ప్రభావం పడినట్టు ఉంది" అని ఖేర సూచించారు. తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సాకేత్ గోఖలే మాట్లాడుతూ, నారీ శక్తితో మొదలు పెట్టి ఇప్పుడు 'ముజ్రా' వంటి వ్యాఖ్యల స్థాయికి మోదీ దిగిపోయారని ఆక్షేపించారు. పదేళ్ల పాటు ఎంత దాచుకోవాలనుకున్నా ఆయనలోని వ్యక్తి ఇప్పటికి బయటకు వచ్చారని, దిగజారుడు భాష మాట్లాడుతున్నారని ఆయన ట్వీట్ చేశారు. నిన్నమొన్నటి వరకూ 'మచిలీ, మటన్, మంగళసూత్ర' అంటూ వచ్చిన మోదీ ఇప్పుడు 'ముజ్రా' అంటున్నారని, ప్రధాని మాట్లాడాల్సిన భాష ఇదేనా అని ఆర్జేడీ నేత మనోజ్ ఝా ప్రశ్నించారు. శివసేన(యూబీటీ) నేత ప్రియాంక చతుర్వేది స్వయంగా మోదీ వీడియో క్లిప్‌ను జత చేస్తూ "త్వరలోనే కోలుకోవాలని ఆశిస్తున్నాను మోదీజీ.." అంటూ ట్వీట్ చేశారు.

## రాష్ట్రంలో శాంతిభద్రతలు
## రోజు రోజుకు అడుగంటి పోతున్నాయి..



నాగర్ కర్నూల్ లోక్?సభ బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో శాంతిభద్రతలు రోజు రోజుకు అడుగంటి పోతున్నాయని ఆరోపించారు. బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్త శ్రీధర్ రెడ్డి హత్య విషయంలో బాధతో మాట్లాడుతున్నామని తెలిపారు. పది రోజుల ముందే డీజీపీకి నాగర్ కర్నూల్ లో ఉన్న పరిస్థితులు వివరించామన్నారు. అయినా ఈ హత్య జరిగింది.. రాయలసీమ ఫ్యాక్షనిజం లాంటి పరిస్థితులు వచ్చాయని పేర్కొన్నారు. ఇప్పటివరకు శ్రీధర్ రెడ్డి హత్యలో ఒక్కర్ని కూడా అదుపులోకి తీసుకోలేదని ప్రవీణ్ కుమార్ చెప్పారు. పోలీసులు కాంగ్రెస్ ఏజెంట్లలా వ్యవహరిస్తూ ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని అన్నారు. శ్రీధర్ రెడ్డి హత్యకు పాల్పడిన నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని.. సిట్ ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. కొల్లాపూర్ ను కల్లోలిత ప్రాంతంగా ప్రకటించాలని ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. మరోవైపు.. కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, ఒక మంత్రి అండతోనే కొల్లాపూర్ లో హత్యలు జరుగుతున్నాయని ఆరోపించారు. శ్రీధర్ రెడ్డి తల్లిదండ్రులు చెప్పిన ప్రకారం పోలీసులు ఆ మంత్రిపై కేసు నమోదు చేయాలని కోరారు. కొన్ని సామాజిక వర్గాల మీద అతను ప్రత్యేకంగా దాడులకు పురి కోల్పోతున్నారని అన్నారు. సీఎం రేవంత్ ఈ కేసు పై స్పందించాలని తెలిపారు. తక్షణమే ఆ మంత్రిని మంత్రివర్గం నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. ధాన్యం గోడౌన్ లలో ఆ మంత్రి మనుషులు దొంగతనాలు చేస్తే సామాన్యుల పై కేసులు పెడుతున్నారని అన్నారు. మంత్రి ఏ విచారణకైనా సిద్ధం అంటున్నారు.. సీబీఐ విచారణకు తాము డిమాండ్ చేస్తున్నాం.. అతను ఒప్పుకోవాలని అన్నారు.

# మండుతున్న కూరగాయల ధరలు..

### రాష్ట్రంలో తగ్గిన సాగు విస్తీర్ణం.. పెరిగిన రవాణా ఖర్చులు

### హైదరాబాదీలకు ఇతర రాష్ట్రాల కూరగాయలే ఆధారం



హైదరాబాద్: కూరగాయల ధరలు మండిపోతున్నాయి. రైతు బజార్లు, వారపు సంత, కూరగాయల మార్కెట్.. ఎక్కడ చూసినా ధరల మోతే. ఏ కూరగాయ చూసినా పావు కేజీ రూ.15 నుంచి రూ.20 పలుకుతోంది. సాగు నీరు అందుబాటులో ఉన్న రోజుల్లో కిలో కూరగాయలు రూ.20 నుంచి రూ.40 వరకు లభించేవి. ప్రస్తుతం హోల్‌సేల్ మార్కెట్‌లో రూ.20 నుంచి రూ.25 వరకు ధర పలుకుతుండగా వారాంతపు సంతల్లో కిలో రూ.60-80 పలుకుతున్నాయి.

### గ్రేటర్‌కు కష్టాలు..

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో సుమారు 1.5 కోట్ల మంది ప్రజలు నివసిస్తున్నారు. స్థానిక ప్రజల అవసరాలకు ఏడా దికి సుమారు 40 లక్షల మెట్రిక్ టన్నుల కూరగాయలు అవసరం ఉంటాయని అంచనా. నగర పరిసర ప్రాంతాలైన వికారాబాద్, సంగారెడ్డి, రంగారెడ్డి, మేడ్చల్, మెదక్ ఇతర జిల్లాల నుంచి ఇక్కడికి కూరగాయలు వస్తున్నాయి. స్థానికంగా సుమారు 19 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి 25 మెట్రిక్ టన్నులు వరకు కూరగాయలు అందుబాటులో ఉంటున్నాయని అంచనా వేస్తున్నారు. ఆపై అవసరాలకు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్.. తదితర రాష్ట్రాలపై ఆధారపడాల్సి వస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలో సాగు నీటి ఎద్దడి తీవ్రంగా ఉంది. దీంతో సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. ఫలితంగా ఇతర రాష్ట్రాల కూరగాయలే దిక్కవుతున్నాయి. కూరగాయల దిగుమతికి రవాణా చార్జీలు, లోడింగ్, అన్‌లోడింగ్, మార్కెట్ ఫీజులు, ఇతర ఖర్చులు కలిపి తడిపి మోపెడు అవుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. ఫలితంగా నెల రోజుల క్రితం టమోటా కిలో రూ.15 ఉంటే ప్రస్తుతం రూ.40కి చేరింది. గతంలో పచ్చిమిర్చి కిలో రూ.60 ఉండగా ఇప్పుడు రూ.120కి పెరిగింది.

### పావు కిలో రూ. 20కి అమ్ముతున్నారు..

వారపు సంతలో కూరగాయలు ఏవి అడిగినా పావుకిలో రూ.15 నుంచి రూ.20 చెబుతున్నారు. నెల క్రితం వరకు కిలో టమాటా రూ.15 ఉండేది ప్రస్తుతం కిలో రూ.40కి అమ్ముతున్నారు. పచ్చిమిర్చి పావు కిలో రూ.20కి దొరికేది. ప్రస్తుతం రూ.40కి అమ్ముతున్నారు. ఇలా అన్ని ధరలు పెరగడంతో తక్కువ కూరగాయలు కొనుగోలు చేస్తున్నాం. - అనిత, ఎల్.బి.నగర్.

### ధర ఉన్నా ఫలితం లేదు..

ఎకరన్నరలో కూరగాయలు సాగు చేస్తున్నా. వేసవి ఎండలకు బోర్లలో నీరు అడుగంటింది. సమయానికి నీటి తడులు అందక దిగుబడి తగ్గింది. మార్కెట్‌లో కూరగాయలకు మంచి ధర ఉన్నా దిగుబడులు లేకపోవడంతో ఫలితం లేకపోయింది. చేతి నిండా పంట ఉన్నపుడు ధర ఉండదు. - రైతు, చించల్‌పేట్, నవాబుపేట్ మండలం

### రొటేషన్ అయితే చాలు..

ఆంధ్రప్రదేశ్ నుంచి కూరగాయలు తెస్తున్నాం. రవాణా చార్జీలు, హమాలీ, సిబ్బంది వేతనాలు, ఇతర ఖర్చులు అన్నీ కలిపి తక్కువ లాభంతో అ మ్ముతున్నాం. ఒక్కోసారి వదిలించుకోవాల్సిన పరిస్థితులు ఎదురవుతాయి. పెట్టిన పెట్టుబడి డబ్బులు రొటేషన్ అయితే చాలు అనిపించిన రోజులు ఉంటాయి. మా దగ్గర కిలో రూ.20కి కొనుగోలు చేసి వారపు సంతలో కిలో రూ.40 వరకు అమ్ముతున్నారు.

### ప్రస్తుతం కూరగాయల ధరలు ఇలా..

కిలో ధర (రూ.లో) టమాటా 40 ఉల్లి 38 మునగకాడలు 40 క్యారెట్ 50 వంగ 45 బెండ 52 పచ్చిమిర్చి 120

# జూన్ 27 నుంచి ఇంజినీరింగ్ ప్రవేశాలకు కౌన్సిలింగ్

### 29 నుంచి ధ్రువపత్రాల పరిశీలన- జులై 8 వరకు వెబ్‌ఆప్షన్ల నమోదు

### 12న తొలివిడత సీట్ల కేటాయింపు

### మూడు విడతల్లో ఎప్సెట్ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల



హైదరాబాద్ రాష్ట్రంలో ఇంజినీరింగ్ ప్రథమ సంవత్సరంలో 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం వచ్చేనెల 27 నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. శుక్రవారం హైదరాబాద్లో ఎప్సెట్ ప్రవేశాల కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం, ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి, ఇతర సభ్యులు పాల్గొన్నారు. అనంతరం ఎప్సెట్ కౌన్సెలింగ్ షెడ్యూల్ను విడుదల చేశారు. వచ్చేనెల 27 నుంచి ఆగస్టు ఎనిమిదో తేదీ వరకు మూడు విడతల్లో ఇంజినీరింగ్ ప్రవేశాల కౌన్సెలింగ్ ప్రక్రియను నిర్వహిస్తామని తెలిపారు. అదేనెల 27 నుంచి జులై ఐదో తేదీ వరకు ఆన్లైన్లో ప్రాథమిక సమాచారం, ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, ధ్రువపత్రాల పరిశీలన కోసం స్లాట్ బుకింగ్ చేసుకోవాలని సూచించారు. వచ్చేనెల 29 నుంచి జులై ఆరో తేదీ వరకు ధ్రువపత్రాల పత్రాల పరిశీలన నిర్వహిస్తామని వివరించారు. అదేనెల 30 నుంచి జులై ఎనిమిదో తేదీ వరకు వెబ్‌ఆప్షన్లను నమోదు చేసేందుకు అవకాశముందని తెలిపారు. అదేనెల 12న తొలివిడత సీట్ల కేటాయింపు ఉంటుందని పేర్కొన్నారు. అదేనెల 12 నుంచి 16వ తేదీ వరకు ఫీజు చెల్లించాలనీ, వెబ్సైట్ ద్వారా సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని సూచించారు. జులై 19 నుంచి ఇంజినీరింగ్ ప్రవేశాలకు రెండో విడత కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందని బుర్రా వెంకటేశం తెలిపారు. అదేరోజు ఆన్లైన్లో ప్రాథమిక సమాచారం, ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, ధ్రువపత్రాల పరిశీలన కోసం స్లాట్ బుకింగ్ వంటి ప్రక్రియను చేపట్టేందుకు అవకాశముందని వివరించారు. అదేనెల 20న ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని పేర్కొన్నారు. జులై 20, 21 తేదీల్లో వెబ్‌ఆప్షన్లను నమోదు చేయాలని కోరారు. అదేనెల 24న రెండో విడత సీట్లు కేటాయిస్తామని వివరించారు. అదేనెల 24 నుంచి 26 వరకు ఫీజు చెల్లింపుతోపాటు వెబ్సైట్ ద్వారా సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని సూచించారు. 27న విద్యార్థుల ప్రవేశాల వివరాలను కాలేజీలు అప్డేట్ చేయాలని కోరారు.

### జులై 30 నుంచి తుదివిడత కౌన్సెలింగ్

ఇంజినీరింగ్ ప్రవేశాల కోసం జులై 30 నుంచి తుదివిడత కౌన్సెలింగ్ ప్రక్రియను చేపడతామని బుర్రా వెంకటేశం తెలిపారు. అదేరోజు ప్రాథమిక సమాచారం అందుబాటులో ఉంటుందనీ, ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాలనీ, ధ్రువపత్రాల పరిశీలనకు స్లాట్ బుకింగ్ చేసుకోవాలని కోరారు. అదేనెల 31న ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని తెలిపారు. అదేనెల 31 నుంచి ఆగస్టు రెండో తేదీ వరకు వెబ్‌ఆప్షన్ల నమోదుకు అవకాశముందని పేర్కొన్నారు. ఆగస్టు ఐదో తేదీన తుదివిడత సీట్లు కేటాయిస్తామని వివరించారు. ఐదు నుంచి ఏడో తేదీ వరకు ఫీజు చెల్లింపుతోపాటు వెబ్సైట్ ద్వారా సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని సూచించారు. ఆయా తేదీల్లోనే అభ్యర్థులకు కేటాయించిన కాలేజీల్లో రిపోర్టు చేయాలని కోరారు. ఆగస్టు 17న స్పాట్ అడ్మిషన్ల కోసం మార్గదర్శకాలను విడుదల చేస్తామని తెలిపారు. గతేడాది ఏ ర్యాంకు వారికి ఏ కాలేజీలో సీటు వచ్చిందన్న వివరాలను %షుషు.:ÿ/స్త్రముజాఎవ్.అఱఎ.ఱఅ% వెబ్సైట్ను సంప్రదించాలని సూచించారు. వచ్చేనెల 19న పూర్తిస్థాయి నోటిఫికేషన్తోపాటు తాజా మార్గదర్శకాలు ఆ వెబ్సైట్లో అందుబాటులో ఉంటాయని వివరించారు. అభ్యర్థులు, తల్లిదండ్రులు కౌన్సెలింగ్కు అవసరమైన ధ్రువపత్రాలను సిద్ధం చేసుకోవాలని కోరారు.

# పంట బీమాపై రైతుల గంపెడాశలు

### వానాకాలం నుండే పంటల బీమా అమలుకు సిద్ధమైన ప్రభుత్వం- కసరత్తు చేస్తున్న వ్యవసాయశాఖ ప్రీమియం చెల్లించనున్న ప్రభుత్వం.?



కోరుట్ల ప్రకృతి వైపరీత్యాల జరిగినప్పుడు పంట నష్ట పోయిన రైతులను ఆదుకునేందుకు ఈ వానాకాలం సీజన్లో పంటల బీమా పథకాన్ని అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. కేంద్రం అమలు చేస్తున్న ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనలో చేరడం, ప్రీమియం చెల్లింపు బీమా పరిహారం తదితర వాటితో పాటు పొరుగు రాష్ట్రాల్లో పంటల బీమా పథకం అమలు తీరుపై అధ్యయనం చేస్తున్నారు. గతంలో అమలు చేసిన పంటల బీమా పథకంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 95 శాతం ప్రీమియాన్ని, మిగిలిన 5 శాతం ప్రీమియాన్ని రైతులు చెల్లించే వారు. పరిహారం పొందడంలో సమస్యలు ఉండటం, పెద్దగా రైతులకు ఉపయోగం ఉండటం లేదనే కారణంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం బీమా పథకాన్ని అమలు చేయ లేదు. కొత్తగా రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి పథకాన్ని అమలు చేయాలని, ప్రీమియం మొత్తం ప్రభుత్వమే చెల్లించాలనే నిర్ణయం తీసుకుంది.

### యేటా ఏదో రకంగా పంట నష్టం

కోరుట్ల డివిజన్లో ప్రధాన పంటగా వరితో పాటు మొక్కజొన్న, సోయా, పత్తి, పెసర్లు, కందులు, చెరకు, పంటలను సాగు చేస్తారు. ప్రకృతి వైపరీత్యాల జరిగినప్పుడు రైతులు పంట నష్టపోతున్నారు. ఇలాంటి సమయంలో రైతులను ఆదుకునేందుకు వీలుగా ప్రభుత్వం పంట బీమా పథకం అమలు చేస్తోంది. గతంలో బ్యాంకు నుండి రుణం తీసుకున్న రైతులకు బ్యాంక్ అధికారులు పంట బీమా పథకాన్ని తప్పనిసరి చేశారు. రుణంతో సంబంధం లేకుండా పంటలను సాగు చేసే రైతులు మాత్రం బీమా చేయడమనేది వారి ఇష్టంపై ఆధారపడి ఉంటుంది. తర్వాత ప్రీమియం చెల్లింపు అనేది రైతుల ఇష్టానికి వదిలేశారు. వాతావరణ ఆధారిత పంటలైన పత్తి, సోయా యూనిట్ల వారిగా బీమా పథకాన్ని అమలు చేస్తారు. నూతన ప్రభుత్వం ఏయే పంటలకు బీమా వర్తింపజేయాలని, ప్రీమియం, పరిహారం, బీమా ఎలా అమలు చేయాలనేది తేల్చాల్సి ఉంది. వీటిపై వ్యవసాయశాఖ వీటిపై అధ్యయనం చేయనుంది.

### పక్కాగా బీమా అమలు

రాష్ట్ర ప్రభుత్వం పంటల బీమా పథకాన్ని పక్కాగా అమలు చేయాలని భావిస్తోంది. దీనికి ఇప్పటికే క్లస్టర్ల వారిగా వ్యవసాయశాఖ నిర్వహిస్తున్న క్రాప్ బుకింగ్ను పరిగణనలోకి తీసుకొనున్నారు. పంట ఉత్పత్తుల క్రయ విక్రయాల్లో పంటల నమోదుపై గొడవలు జరుగుతుండడంతో పాటు రైతుల నుండి డిక్లరేషన్ తీసుకోవాలని ఉన్నతాధికారులు బావిస్తున్నారు. ఎందుకంటే ఏఈవోలు పంట పొలాలకు పోకుండా రైతులను అడిగి రాస్తుండటం వలన ఇలా చేస్తున్నారని తెలుస్తుంది. ఈ మేరకు ఇప్పటికే డివిజన్లా వారిగా పంటల సాగు అంచనాలు, ప్రీమియం తదితర వాటికి సంబంధించిన ప్రాథమిక సమాచారాన్ని వ్యవసాయ అధికారులను కోరారు. పంటల బీమాకు సంబంధించిన మార్గదర్శకాలను రూపొందించడం తో పాటు బీమా కంపెనీలను సంప్రదించడం, ప్రీమియాన్ని నిర్ధారించడం, ప్రభుత్వ బడ్జెట్ విడుదల చేయాల్సి ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫసల్బీమా యోజనతో వచ్చే ప్రయోజనాలు వినియోగించుకొని పాటు రైతులపై ఎలాంటి భారం పడకుండా పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. వానాకాలం నుండే అమలు చేయనున్న పంటల బీమా పథకంపై రైతులు గంపెడాశతో ఎదురు చేస్తున్నారు.

### ప్రభుత్వ నిర్ణయం మేరకే - నాగమణి ఏవో కోరుట్ల

కోరుట్ల మండలంలో 17వేల ఎకరాల వరి, 3800 వందల హార్టికల్చర్, 3200 ఎకరాల మొక్కజొన్న లాంటి ఇతర పంటలు సాగు ఈ వర్షాకాలంలో చేస్తారు. ప్రభుత్వ నిర్ణయం మేరకే కోరుట్ల మండలంలో పంట బీమా పథకాన్ని అమలు చేయడానికి అవసరమైన ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం. దీని కోసం అవసరమైన సమాచారాన్ని సిద్ధం చేశామని రానున్న వానకాంలో సాగయ్యే పంటల వివరాలు సాగు అంచనా వేసి అధికారులకు పంపామని ఏవో తెలిపారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల ప్రచారం ముగింపు.. ఎంత మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారో తెలుసా



పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల ప్రచారం ముగిసింది. దీంతో 48 గంటల పాటు సైలెన్స్ పిరియడ్ ఉండనుంది. ఎల్లుండి ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 వరకు పోలింగ్ జరగనుంది. 605 పోలింగ్ బూత్‌లలో ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. మొత్తం 4,63,839 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉన్నారు. ఈ ఉప ఎన్నికల్లో 52 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. వరంగల్, ఖమ్మం, నల్గొండ మూడు ఉమ్మడి జిల్లాల పరిధి 34 అసెంబ్లీ నియోజక వర్గాలలో విస్తరించి ఉంది ఈ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ నియోజకవర్గం. ఉమ్మడి వరంగల్ జిల్లాలో అత్యధికంగా 1,73,406 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉన్నారు. ఆ తర్వాత ఉమ్మడి నల్గొండ జిల్లాలో 1,66,448 మంది, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 1,23,985 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థుల మధ్యే పోటీ ఎక్కువగా ఉంది. పట్టభద్రులను ఆకట్టుకునేందుకు ఆయా పార్టీలు ఎన్నో వ్యూహాలు అమలు చేశాయి. ఆయా పార్టీల కీలక నేతలు అభ్యర్థుల తరుపున ప్రచారం నిర్వహించారు. బీజేపీ అభ్యర్థి ప్రేమెందర్ రెడ్డికి మద్దతుగా కిషన్ రెడ్డి, ఈటల రాజేందర్ తో పాటు పలువురు బీజేపీ నేతలు ప్రచారంలో పాల్గొన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి ప్రచారంలో కేటీఆర్, హరీశ్ రావు, పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్ రావు, పలువురు కీలక నేతలు పాల్గొన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి చింతపండు నవీన్ (తీన్మార్ మల్లన్న)కు మద్దతుగా స్థానిక మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రచారం చేశారు.

## కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఇచ్చిన మాటలు నిలబెట్టుకోలేదు




కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఇచ్చిన మాటలు నిలబెట్టుకోలేదని మల్కాజ్ గిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ పేర్కొన్నారు. మణుగూరులో పట్టభద్రుల ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు ఈటల రాజేందర్. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పడి నుండి ప్రజలకి ఇచ్చిన ఎలాంటి హామీ నెరవేర్చలేదు. కేవలం మహిళలకు ఉచిత బస్సు తప్ప వారు చేసిందేమీ లేదు. కేవలం ఆరు నెలలోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎంతో వ్యతిరేకత పెరిగింది. బీఆర్ఎస్ పార్టీపై గత అసెంబ్లీ ఎన్నికలలోనే ప్రజలకు నమ్మకం పోయింది. బీజేపీ పార్టీ తెలంగాణలో రోజురోజుకీ బలపడుతోంది. ప్రధాని మోదీ హయాంలో దేశం ఎంత అభివృద్ధి చెందిదో మనందరకూ తెలుసు. రాబోయే కాలంలో తెలంగాణ ప్రజలు ఆశీర్వదిస్తే అధికారంలోకి వచ్చేది భారతీయ జనతా పార్టీనే. అందుకే సర్పంచ్ ఎన్నికల మొదలుకొని, మున్సిపల్ ఎన్నికలు, కార్పొరేషన్ ఎన్నికలు, ఎమ్మెల్సీ ఎన్నికలలో సీరియస్‌గా పోటీ చేసి గెలుపొందాలని, కార్యకర్తలందరూ సహకరించాలని కోరుతున్నాను. కాంగ్రెస్ పార్టీ, బీఆర్ఎస్ పార్టీలు ఇచ్చిన మాటలు నిలబెట్టుకోలేదు. చిరుద్యోగులకు, కాంట్రాక్టు ఉద్యోగులకు, ఆర్టీసీ, సింగరేణి ఉద్యోగులకు, నిరుద్యోగులకు బీజేపీ పార్టీ అండగా ఉంటుందని హామీ ఇస్తున్నాను. గత పదేళ్లలో ప్రధాని నరేంద్రమోదీ తనదైన ముద్ర వేశారు. ప్రధాని మోడీ ప్రభావం దేశ వ్యాప్తంగా ఉంది. ప్రజలకు ప్రధాని మోడీ గ్యారెంటీపై విశ్వాసం ఉంది. ఎక్కడికి వెళ్లినా ప్రధాని మోడీనే మళ్లీ ప్రధాని కావాలంటున్నారు. బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్ రెడ్డిని గెలిపించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాను.

## ముగిసిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ప్రచారం




హైదరాబాద్: 2023 అసెంబ్లీ ఎన్నికల్లో జనగామ ఎమ్మెల్యేగా పల్లా రాజేశ్వర్ రెడ్డి విజయం సాధించడంతో నల్లగొండ, వరంగల్, ఎమ్మెల్సీ పదవికి ఆయన రాజీనామా చేశారు. దీంతో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈ ఉప ఎన్నికలను రాష్ట్రంలోని అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. వీరితో పాటు స్వాతంత్ర్య అభ్యర్థిగా అశోక్ కుమార్ ఉన్నారు. దీంతో ఉప ఎన్నిక మొత్తం ఈ నలుగురు అభ్యర్థుల మధ్య నువ్వా నేనా అన్నట్లుగా సాగనుంది. ఈ పోరులో మొత్తం 52 మంది అభ్యర్థులు పోటీ పడుతుండగా.. ఈ రోజు(25 శనివారం) 3.30 గంటలకు ప్రచారం ముగిసింది. ఈ ఉప ఎన్నికల ఈ నెల 27న సోమవారం జరగనుంది. ఉదయం 7 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఈ పోలింగ్ నిర్వహించనున్నారు. ఈ ఉప ఎన్నిక ఫలితాలు జూన్ 5న వెలువడనున్నాయి.

## ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు కేసీఆర్ వస్తారా



రేవంత్ రెడ్డి సర్కార్.. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు సన్నాహలు చేస్తుంది. ఈ వేడుకలకు కాంగ్రెస్ పార్టీ అగ్రనేత సోనియా గాంధీని ఆహ్వానించేందుకు సీఎం రేవంత్ రెడ్డి ఆదివారం ఢిల్లీ వెళ్లనున్నారనే ఓ చర్చ అయితే రాజకీయ వర్గాల్లో వైరల్ అవుతుంది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు ద్వారా ఆ ప్రాంత ప్రజలు కన్న కలలను సోనియాగాంధీ సాకారం చేసిందని గతంలోనే ఆ పార్టీ నేతలు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ఈ వేడుకల వేళ.. సోనియాగాంధీని ఘనంగా సన్మానించాలని ఆ పార్టీ నేతలంతా నిర్ణయించారని సదరు వర్గాల్లో ఓ చర్చ నడుస్తుంది. తెలంగాణ తల్లిగా సోనియాగాంధీని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇప్పటికే అభివర్ణించారు. అదీకాక రాష్ట్రం ఏర్పాడి దశాబ్దం పూర్తి చేసుకుంటుంది. దీంతో ఈ వేడుకలకు కాంగ్రెస్ పార్టీ అత్యధిక ప్రాధాన్యం ఇస్తుంది. ఈ వేడుకలకు ఉద్యమకారుల కుటుంబాలను సైతం ఆహ్వానిస్తుంది. వారిని సైతం సన్మానించేందుకు ఈ ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తుంది. ఆ క్రమంలో ఈ వేడుకలకు బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను రేవంత్ రెడ్డి సర్కార్ ఆహ్వానిస్తుందా? ఓ వేళ ఆహ్వానించినా.. రేవంత్ సర్కార్ సోనియాగాంధీ, ఉద్యమకారుల కుటుంబాలతోపాటు కేసీఆర్‌ను సైతం సన్మానిస్తుందా? అనే ఓ చర్చ సైతం రాజకీయ వర్గాల్లో హల్‌చల్ చేస్తుంది. ఇక 2014లో తెలంగాణ రాష్ట్ర కల సాకారం కాగానే.. కేసీఆర్ ఫ్యామిలీలోని ఒకరు ఇద్దరు కాదు.. ఏకంగా 13 మంది న్యూఢిల్లీ వెళ్లి నాటి యూపీఏ అధ్యక్షురాలు సోనియా గాంధీతో ఫొటో దిగి వచ్చారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రం ఇచ్చినా.. ప్రాణాలకు తెగించి తాను కొట్లాడి మరీ తెచ్చానంటూ టీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్.. తన ఎన్నికల ప్రచారంలో స్వయంగా ప్రకటించుకున్నారు. అలా 2014, 2019 ఎన్నికల్లో కేసీఆర్ పార్టీ వరుసగా తెలంగాణలో అధికారాన్ని కైవసం చేసుకుంది. ఇక 2023 ఎన్నికల్లో తెలంగాణ ఓటరు.. కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాడు. దీంతో రేవంత్ రెడ్డి సర్కార్ కొలువు తీరింది. మరి రేవంత్ సర్కార్ నిర్వహిస్తున్న ఈ దశాబ్ది వేడుకలకు కేసీఆర్‌ను ఆహ్వానిస్తారా? ఓ వేళ ఆహ్వానం అందినా కేసీఆర్ ఈ వేడుకలకు హాజరవుతారా? కేసీఆర్ ఈ వేడుకలకు వస్తే.. సభ వేదిక మీద ఆయన ఆసీనులవుతారా? లేకుంటే ఆహ్వానితుల్లో ఒకరుగా ఆయన కూర్చుంటారా? అనే సందేహం సైతం రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతుంది. ఇక అసెంబ్లీ ఎన్నికల తర్వాత కేసీఆర్ పార్టీ ప్రతిపక్షానికి పరిమితమైంది. ఇంకోవైపు కేసీఆర్ కుమార్తె ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత.. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ప్రస్తుతం తీహార్ జైల్లో ఉన్నారు. దీంతో కేసీఆర్ అండ్ కో దాదాపుగా సైలెన్స్ మెయింటేన్ చేస్తుంది. ఆ క్రమంలో లోక్‌సభ ఎన్నిక వేళ.. బీఆర్ఎస్ పార్టీ నేతలు సైతం ప్రచారానికి దాదాపుగా దూరంగా ఉన్నారనే ఓ ప్రచారం సైతం సాగుతుంది. అలాంటి వేళ.. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు కేసీఆర్ హాజరవుతారా? అనే సందేహాలు సైతం రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతుంది.

# రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవ నిర్వహణకు ఈసీ పచ్చజెండా

### ఉత్సవాలకు ఓకే

### జూన్ 2న పరేడ్ గ్రౌండ్‌లో వేడుక.. సోనియాకు సన్మానం

### రాష్ట్ర గేయం, తెలంగాణ తల్లి విగ్రహం, చిహ్నం ఆవిష్కరణ



దశాబ్దాల తెలంగాణ కల సాకారమై దశాబ్దం కావొస్తోంది! అందునా రాష్ట్రంలో అధికారంలో ఉన్నది.. ఆ కలను సాకారం చేసిన కాంగ్రెస్ పార్టీ!! ఈ నేపథ్యంలో రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాన్ని ఘనంగా నిర్వహిం చేందుకు రేవంత్ సర్కారు ఉవ్విళ్లూరుతోంది. కానీ.. కోడ్ అమల్లో ఉన్నందున ఇందుకు అనుమతి కోరుతూ ప్రభుత్వం లేఖ రాయగా.. ఈసీ పచ్చజెండా ఊపుతూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది!!

హైదరాబాద్, : రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాన్ని నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర ఎన్నికల కమిషన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ వేడుకల నిర్వహణకు అనుమతి కోరుతూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాసిన లేఖపై ఈసీ సానుకూలంగా స్పందించి.. శుక్రవారం ఈమేరకు ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో జూన్ 2న సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో దశాబ్ది ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు రేవంత్ సర్కారు కసరత్తు ప్రారంభించింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శుక్రవారం సచివాలయంలో అన్ని శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఏర్పాట్లు ఘనంగా చేయాలని ఆదేశించారు. కాగా.. యూపీఏ చైర్ పర్సన్ హోదాలో అన్ని వర్గాలనూ ఒప్పించి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన సోనియాగాంధీకి ప్రభుత్వ పరంగా ఉత్సవ వేదికపై సన్మానం జరగనుంది. అలాగే, తెలంగాణ రాష్ట్ర గేయం 'జయజయహే తెలంగాణ'ను ఇదే వేదిక ద్వారా సీఎం రేవంత్‌రెడ్డి జాతికి అంకితం చేయనున్నారు. అలాగే తెలంగాణ తల్లి విగ్రహాన్ని, రాష్ట్ర చిహ్నాన్ని ఆవిష్కరించాలన్న ప్రతిపాదనా పరిశీలనలో ఉంది. ప్రత్యేక రాష్ట్రం కోసం అసువులు బాసినవారి కుటుంబాలకు సన్మానం, అమరవీరుల కుటుంబాలు, ఉద్యమకారులకు ఇచ్చిన హామీల అమలుపై స్పష్టత ఇచ్చే అంశాలపైనా పరిశీలన జరుగుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న స్వయం సహాయక మహిళా సంఘాలను ఆహ్వానించి వారి సమక్షంలో ఈ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు తెలుస్తోంది.

### రాహుల్, ప్రియాంకకూ ఆహ్వానం!

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన సోనియాగాంధీకి ఈ వేడుకల్లో ఘన సన్మానం చేయాలని తీర్మానించిన రాష్ట్ర మంత్రిమండలి.. ఈ మేరకు ఆమెకు ఇప్పటికే ప్రతిపాదన పంపింది. అలాగే రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో పాలుపంచుకోవాల్సిందిగా ఏఐసీసీ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీలనూ ఆహ్వానించినట్లు తెలుస్తోంది. ఈ వేడుకల నిర్వహణకు ఈసీ అనుమతించిన నేపథ్యంలో శనివారం లేదా ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీకి వెళ్లి సోనియాగాంధీని కలిసి ఆహ్వానించే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ఆయనతోపాటు అందుబాటులో ఉన్న మంత్రులూ వెళ్లే అవకాశం ఉన్నట్టు సమాచారం. అయితే ప్రభుత్వపరంగా నిర్వహించే కార్యక్రమానికి సోనియాను ఆహ్వానించడంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డితో సహా ఆ పార్టీ నేతలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్న సంగతి తెలిసిందే. కానీ, సోనియా రాజ్యసభ సభ్యురాలు కాబట్టి ప్రభుత్వపరంగా నిర్వహించే కార్యక్రమానికి ఆహ్వానించడంపై ఎలాంటి సమస్యా ఉండదన్న ధీమాను కాంగ్రెస్ వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి.

### రాష్ట్ర గేయం.. రెండు వెర్షన్లూ..

కవి అందెశ్రీ రచించిన 'జయజయహే తెలంగాణ 'గీతాన్ని రాష్ట్ర గేయంగా ప్రభుత్వం స్వీకరించిన సంగతి తెలిసిందే. ప్రముఖ సంగీత దర్శకుడు కీరవాణి స్వరకల్పనలో ఈ గేయాన్ని తీర్చిదిద్దడం ఒక కొలిక్కి వచ్చింది. ఈ గేయాన్ని అధికారిక కార్యక్రమాల్లో వాడేందుకు నాలుగు చరణాలతో, 90 సెకన్ల నిడివితో ఒక వెర్షన్.. 14 చరణాలు, 6 నిమిషాల నిడివితో పూర్తి వెర్షన్ సిద్ధమయ్యాయి. రాష్ట్ర ఆవిర్భావ ఉత్సవ వేదికపై నుంచి ఈ రెండు వెర్షన్లనూ సీఎం రేవంత్ తెలంగాణ ప్రజలకు అంకితం చేయనున్నారు.

### కాంగ్రెస్ ముద్ర!

కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని యూపీఏ ప్రభునికల్లో ఆ క్రెడిట్‌ను కేసీఆర్ కొట్టేశారన్న అసంతృప్తి కాంగ్రెస్ నాయకత్వంలో ఉంది. అయితే రాష్ట్రం ఏర్పడి పదేళ్లు పూర్తవుతున్న సందర్భంలో తాము అధికారంలో ఉండత్వం తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసినా.. తొలి, మలి ఎన్డంతో.. దీన్ని సదవకాశంగా తీసుకుని ఈ వేడుకలను ఘనంగా నిర్వహించాలని, తమదైన ముద్ర వేయాలని కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు.

# డిసెంబరు 9 కటాఫ్ తేదీ!

- అసలు, వడ్డీ కలిపి రూ.2 లక్షల వరకు దంపతులకు రెండు లక్షలు
- ఈనెల 19 వరకున్న బకాయిల వివరాల సేకరణ
- రుణ సమాచార సేకరణకు బ్యాంకులకు ప్రొఫార్మా
- రుణమాఫీకి సిద్ధమౌతున్నమార్గదర్శకాలు




హైదరాబాద్, : పంద్రాగస్టును రుణమాఫీకి డెడ్‌లైన్‌గా పెట్టుకున్న రాష్ట్ర ప్రభుత్వం సమాచార సేకరణకు శ్రీకారం చుట్టింది. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, బ్యాంకుల నుంచి 4 విభాగాలు, 30 అంశాలతో కూడిన ప్రొఫార్మాతో సమాచారాన్ని అడిగారు. బ్యాంకుల సిబ్బంది ఇప్పటికే ఆ సమాచార సేకరణలో నిమగ్నమయ్యారు. రుణ మాఫీ పథకానికి డిసెంబరు 9నే కటాఫ్ తేదీగా తీసుకొంటుందని ప్రభుత్వ వర్గాల ద్వారా తెలుస్తోంది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రకటన జరిగిన రోజు, సోనియాగాంధీ పుట్టిన రోజు అయిన డిసెంబరు 9నే కొత్త ప్రభుత్వం పలు పథకాలు ప్రారంభించిన నేపథ్యంలో ఈ తేదీనే కటాఫ్ తేదీగా ఎంచుకోవడం ఖాయంగా కనిపిస్తోంది. గత ప్రభుత్వాలు అమలు చేసిన పద్ధతిలోనే రుణమాఫీ అమలు చేయాలని రేవంత్‌రెడ్డి సర్కారు భావిస్తోంది. కుటుంబానికి రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేయనున్నారు. అసలు, వడ్డీ కలిపి రూ.2 లక్షల లోపు బకాయిలు ఎంతుంటే అంత మొత్తం మాఫీ చేస్తారు. అంతకంటే ఎక్కువ ఉంటే రూ.2 లక్షల వరకు మాఫీ అవుతుంది. మిగతాది చెల్లించాల్సి ఉంటుంది. రైతు ఒకటి కంటే ఎక్కువ బ్యాంకుల్లో అప్పు తీసుకుంటే అన్నీ కలిపి లెక్కిస్తారు. భార్య/భర్త పేర్ల మీదున్న అన్ని ఖాతాల వివరాలు, అప్పులు, వడ్డీలను క్రోడీకరించి రుణమాఫీ పథకాన్ని అమలు చేస్తారు. గత ప్రభుత్వం బంగారం తాకట్టు పెట్టి తీసుకున్న రుణాలకు మాఫీని వర్తింపజేయలేదు. అంతకుముందు రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం కొన్ని పరిమితులతో బంగారం తాకట్టు పెట్టి తీసుకున్న రుణాలకు సంబంధించి మాఫీని అమలు చేసింది. తాజాగా ప్రభుత్వం బ్యాంకులకు పంపించిన ప్రొఫార్మాలో బంగారం రుణాలప్రస్తావన కూడా ఉంది. అంటే, రాష్ట్రంలో రైతులు ఎంతమేర బంగారం తాకట్టు పెట్టి రుణాలను తీసుకున్నారో సమాచారాన్ని సేకరిస్తారు. ఆ రుణభారం సమాచారం కూడా ప్రభుత్వానికి అందనుంది. ఎన్నికల మ్యానిఫెస్టోలో బంగారం తాకట్టు పెట్టి తీసుకున్న వ్యవసాయ రుణాల ప్రస్తావన లేకపోయినా గత కాంగ్రెస్ ప్రభుత్వం తరహాలో పరిమితులతో ఏమైనా బంగారం రుణమాఫీ చేస్తారేమోనని చర్చ జరుగుతోంది. దీర్ఘకాలిక వ్యవసాయ రుణాలు తీసుకున్న వారికి రుణమాఫీ పథకం వర్తించదు.

### డిసెంబరు తొమ్మిదో తేదీ కటాఫ్

2023 డిసెంబరు తొమ్మిదో తేదీ కటాఫ్ తేదీ అయితే అప్పటి వరకు రైతుల పేర్లమీద ఉన్న బకాయిలను మాఫీ చేస్తారు. 2023 డిసెంబరు తొమ్మిదో తేదీ లోపు గత ప్రభుత్వ హయాంలో గత రుణమాఫీ కటాఫ్ డేట్ తరువాత ఎన్ని పంట రుణాలు తీసుకున్నా అవన్నీ రుణమాఫీ పథకం పరిధిలోకి వస్తాయి. ప్రొఫార్మాలో మాత్రం 2024 మే 19 వరకున్న బకాయిలు(ఔట్ స్టాండింగ్ లోన్స్) వివరాలను కూడా సేకరించాలని పేర్కొన్నారు. దీంతో 2023 డిసెంబరు తేదీ వరకున్న బకాయులు, 2024 మే 19 తేదీ వరకున్న బకాయుల లెక్కలను కూడా అధికారులు సేకరిస్తున్నారు.

### 30 అంశాలతో ప్రొఫార్మా

ప్రొఫార్మాలో నాలుగు విభాగాలు ఉన్నాయి. అవి, పీఏసీఎసల వివరాలు, బ్యాంకుల వివరాలు, రైతుల వివరాలు, రుణం వివరాలు. రైతుకు సంబంధించి ఇంటిపేరుతో సహా రైతు పూర్తిపేరు, తండి/భర్త పేరు, రైతు ఆధార్ కార్డు నెంబరు, మొబైల్ నెంబర్, స్త్రీయా, పురుషుడా, జనరల్, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, చిరునామా సేకరిస్తున్నారు. ఇక నాలుగో విభాగం లో లోన్ వివరాలు అడిగారు. కస్టమర్ ఐడీ నెంబరు, లోన్ అకౌంట్ నెంబరు, టైప్ ఆఫ్ లోన్(అగ్రికల్చర్ క్రాప్ లోన్, అగ్రికల్చర్ గోల్డ్ లోన్), ఏ విధమైన అకౌంటు(డీసీసీబీ/సీడెడ్ సొసైటీ/బ్యాంకు), క్రాప్ లోన్ మంజూరైన తేదీ, అప్పు తీసుకున్న తేదీ నుంచి అసలు మొత్తం, వడ్డీ రేటు, 2023 డిసెంబరు 9 వరకు అసలు మొత్తం, వడ్డీ, ఇతర ఛార్జీలు, మొత్తం ఔట్ స్టాండింగ్ లోన్, అదేక్రమంలో 2024 మే 19 తేదీ నాటికి రైతులపై ఉన్న ఔట్‌స్టాండింగ్ లోన్ల వివరాలతోపాటు లోన్ అకౌంట్ ప్రస్తుత పరిస్థితి ఏమిటి? ఎన్‌పీఏ జాబితాలో పడిపోయిందా? స్టాండర్డ్‌గా ఉందా? రైతు సేవింగ్ బ్యాంకు అకౌంట్ నెంబరు ఏమిటి? ఐడీ నెంబరు ఏమిటి? తదితర వివరాలను కూడా ప్రొఫార్మాలో అడగటం గమనార్హం.

# ఈవీఎం వివాదం చల్లారేనా!




సార్వత్రిక ఎన్నికల రెండో దశ కూడా పూర్తికావస్తుండగా శుక్రవారం సర్వోన్నత న్యాయస్థానం ఈవీఎంల వినియోగంపై వచ్చిన వ్యాజ్యాలను తోసిపుచ్చింది. విపక్షాలను విమర్శించటానికీ, ఆరోప ణలు సంధించటానికీ వచ్చే ఏ అవకాశాన్నీ వదులుకోని ప్రధాని నరేంద్ర మోదీ... ఇంకా అయిదు దశల పోలింగ్ జరగాల్సిన తరుణంలో మౌనంగా ఎందుకుంటారు? అందుకే కాంగ్రెస్ నాయకత్వంలోని విపక్షాలకు ఈ తీర్పు చెంపపెట్టన్నారు. ఈవీఎంలపై సందేహాలు రేకెత్తించిన పాపానికి క్షమాపణలు చెప్పాలని కూడా మోదీ డిమాండ్ చేశారు. దేన్నయినా సందేహించటం దానికదే పాపం కాదు. పాపమే అనుకుంటే బీజేపీ, కాంగ్రెస్ సహా దాదాపు అందరికందరూ ఆ పాపం చేసినవారే. ఒకటి రెండు పార్టీలు మినహాయిస్తే పరాజితుల ప్రథమ కోపం ఎప్పుడూ ఈవీఎంలపైనే. వరసగా 2004, 2009 ఎన్నికల్లో ఓటమి ఎదురైనప్పుడు బీజేపీ ఈవీఎంలనే తప్పుబట్టింది. 2012 పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓడినప్పుడు కాంగ్రెస్ కూడా ఆ పనే చేసింది. హ్యాకర్ల ద్వారా ఈవీఎంల సోర్స్ కోడ్ మార్చి అకాలీదళ్ తమ విజయాన్ని దొంగిలించిందని ఆరోపించింది. ఇక యూటర్న్‌ల సిద్ధ హస్తుడైన తెలుగుదేశం అధినేత చంద్రబాబుకైతే ఇలాంటి ఆరోపణలు మంచినీళ్లప్రాయం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2004, 2009 అసెంబ్లీ ఎన్నికల్లో ఓడినప్పుడు ఈవీఎంలపైనే ఆయన ఆగ్రహం. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో నెగ్గినప్పుడు మాత్రం చప్పుడు చేయలేదు. మళ్లీ 2019 అసెంబ్లీ ఎన్నికల ఫలితాలొచ్చాక ఈవీఎంలపై వీరంగం వేశారు. మధ్యలో ఈవీఎంలు దొంగిలించిన నేరారోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తితో మీడియా సమావేశం ఏర్పాటు చేయించి వాటిని తారుమారు చేయొచ్చని చూపించే ప్రయత్నం చేసింది కూడా చంద్రబాబే. మళ్లీ ఎన్‌డీఏ పంచన చేరినందువల్ల ఈవీఎంల వివాదంపై ఇప్పుడాయన కిక్కురుమనటం లేదు. ఇతరుల మాటెలావున్నా ప్రస్తుతం ఈవీఎంల వినియోగాన్ని సవాలు చేసిన సంస్థల్లో విశ్వసనీయతగల అసోసియేషన్ ఫర్ డెమాక్రటిక్ రిఫార్మ్స్(ఏడీఆర్) సంస్థ కూడా వుంది. కనుక ఈవీఎంలను సందేహించటం స్వప్రయోజనాల కోసమేనని భావించలేం. అదో పెద్ద నేరంగా పరిగ ణించలేం. అలాగని పేపర్ బ్యాలెట్ విధానం సవ్యంగా సాగిందా? పోలింగ్ బూత్‌లు చేజిక్కించుకుని, బ్యాలెట్ పేపర్లు గుంజుకుని తమ గుర్తుపై ముద్రలు వేసుకుని పెత్తందారులు చెలరేగిపోలేదా? రిగ్గింగ్ ఆరోపణలు వచ్చినప్పుడల్లా ఎన్నిసార్లు రీపోలింగ్ జరపక తప్పలేదు! ఈవీఎంల వల్ల ఈ జాడ్యం ఎంతో కొంత కట్టడి అయింది. నిమిషానికి కేవలం అయిదు ఓట్లు మాత్రమే వాటిల్లో నమో దయ్యే అవకాశం వుండటం వల్ల పోలింగ్ కేంద్రాలు ఆక్రమించిన దుండగులకు గతంలోని వెసులు బాటు పోయింది. వెనువెంటనే బలగాలు ఆ పోలింగ్ కేంద్రాన్ని చేరుకుని పరిస్థితిని చక్కదిద్దే అవ కాశం వుండటం వల్ల వారి ఆటలు సాగటం లేదు. 1982లో తొలిసారి ఈవీఎంలతో కేరళలో ఒక ఉప ఎన్నిక నిర్వహించారు. అయితే తగిన చట్టం లేకుండా ఈవీఎంల వినియోగం చెల్లదంటూ సుప్రీంకోర్టు ఆ ఎన్నికను రద్దు చేసింది. 1998లో ఢిల్లీ, రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లలో కేవలం కొన్ని నియోజక వర్గాల్లో 45 ఈవీఎంలను ప్రయోగాత్మకంగా వినియోగించారు. ఈవీఎంలపై తరచు ఫిర్యాదులు వస్తున్నందువల్ల వాటికి ప్రింటర్లను అనుసంధానించాలని 2013లో సుప్రీంకోర్టు ఆదేశించింది. 2014 సార్వత్రిక ఎన్నికల్లో పరిమితంగా దాన్ని అమలు చేసినా... ఆ తర్వాత కాలంలో వీవీ ప్యాట్‌ల పూర్తిస్థాయి వినియోగం మొదలైంది. ఓటరు తనకు నచ్చిన గుర్తుకు ఓటేసిన వెంటనే ప్రింటర్‌పై ఆ పార్టీ పేరు, గుర్తు ఏడు సెకన్లపాటు కనబడే ఏర్పాటుచేశారు. ఆ వెంటనే ఒక స్లిప్‌పై అది ప్రింటయి దానికి అనుసంధానించిన బాక్స్‌లో పడుతుంది. పోలింగ్ సమయంలోనైనా, కౌంటింగ్ సమయంలోనైనా ఈవీఎంలను దేనితోనూ అనుసంధానించటం సాధ్యంకాదని... రిమోట్ కంట్రోల్, బ్లూటూత్, వైఫైలతో నియంత్రించటం కూడా అసాధ్యమని ఎన్నికల సంఘం పదే పదే చెబుతోంది. ప్రభుత్వ రంగ సంస్థలైన బెంగళూరు బెల్, హైదరాబాద్ ఈసీఐఎల్ వీటిని ఉత్పత్తి చేస్తున్నాయి. పోలింగ్‌కు ముందు ఈవీఎంల తనిఖీకి అభ్యర్థులకు అవకాశం ఇస్తున్నారు. చిత్రమేమంటే ఈ ప్రక్రియపై ఓటర్లనుంచి ఎప్పుడూ ఫిర్యాదులు లేవు. ఇప్పుడు మళ్లీ బ్యాలెట్ పేపర్‌కు మళ్లాలన్న వినతిని తోసిపుచ్చటంతోపాటు వీవీ ప్యాట్ స్లిప్ లను ఓటర్లే తీసుకునేలా, పరిశీలించుకున్నాక వారే బ్యాలెట్ బాక్స్‌లో వేసేలా చూడాలన్న కోరికను సుప్రీంకోర్టు ధర్మాసనం అంగీకరించలేదు. ఈవీఎంల ద్వారా వెల్లడయ్యే ఓట్ల సంఖ్యనూ, వీవీప్యాట్ స్లిప్‌లనూ లెక్కించి రెండూ సరిపోలినప్పుడే ఫలితం ప్రకటించాలన్న పిటిషనర్ల వినతిని కూడా తిరస్కరించింది. అయితే పార్టీల గుర్తులను కంప్యూటర్ ద్వారా ఈవీఎంలలో లోడ్ చేయటానికి ఉప యోగించే సింబల్ లోడింగ్ యూనిట్ (ఎస్ఎల్‌యూ)లను ఎన్నికల పిటిషన్లు పడిన సందర్భాల్లో పరిశీలించేందుకు అనువుగా 45 రోజులు భద్రపరచాలని ఆదేశించింది. అంటే ఇకపై ఈవీఎంలతో పాటు ఎస్ఎల్‌యూలు కూడా సీల్ చేసివుంచటం తప్పనిసరి. అలాగే రెండు, మూడు స్థానాల్లో నిలిచిన అభ్యర్థులు ఫిర్యాదుచేస్తే ప్రతి పార్లమెంట్ నియోజకవర్గంలోనూ 5 శాతం ఈవీఎంలనూ, ఎస్ఎల్‌యూలనూ ఇంజనీర్ల, ఉత్పత్తిదారుల సమక్షంలో తనిఖీకి అనుమతించవచ్చు. అయితే ఫలితాలొచ్చిన ఏడు రోజుల్లో ఫిర్యాదులు చేయాలి. అలాగే వీవీ ప్యాట్ స్లిప్‌లు లెక్కించే యంత్రాలు సమకూర్చుకునే ఆలోచన చేయాలని ఈసీని కోరింది. ఏదేమైనా బాహాటంగా బయట పడిన సంద ర్భాలుంటే తప్ప ఈవీఎంలపై అనవసర రాద్ధాంతానికి ముగింపు పలకటం అవసరం. ఇందుకు బదులు ప్రజల్లో విశ్వసనీయత పెంచుకోవటం ఎలా అన్న అంశంపై పార్టీలు దృష్టి సారించాలి.

## ఉక్రెయిన్‌కు మరో విడత అమెరికా మిలటరీ సాయం



వాషింగ్టన్: ఉక్రెయిన్ ఈశాన్య ప్రాంతంలోని ఖర్కీవ్‌పై రష్యా తీవ్రస్థాయిలో దాడులకు తెగబడుతోంది. శుక్రవారం రష్యా జరిపిన దాడుల్లో రైలు పట్టాలు, రైల్వే ఆస్తులు దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో ఉక్రెయిన్‌కు అమెరికా మరో విడత సైనిక సాయాన్ని అందించనున్నట్లు ప్రకటించింది. "తమ దేశం కోసం ధైర్యం వహిస్తున్న ఉక్రెయిన్ ప్రజలకు మద్దతుగా ఆయుధాలు, సామాగ్రి అందించడానికి అమెరికా మరో విడత సైనిక సాయాన్ని ఉక్రెయిన్ అందించనున్నట్లు ప్రకటించింది. రష్యా దాడులకు వ్యతిరేకంగా పోరాడుతున్న ఉక్రెయిన్‌కు 275 మిలియన్ డాలర్ల సైనిక సామాగ్రి సాయం అందించనున్నాం. ఇంతకు ముందు విడుదల చేసని మలిటరీ సాయం యుద్ధ రంగంలో ఉపయోగిస్తున్నారు. తాజాగా ప్రకటించిన మిలిటరీ సాయం సాధ్యమైనంత తొందరగా అందజేస్తాం" అని అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోని బ్లింకెన్ తెలిపారు. గత నెల ప్రకటించిన 61 బిలియన్ డాలర్ల మిలటరీ సాయం అందటంలో ఆలస్యం కావటంతో ఉక్రెయిన్ సైన్యం యుద్ధభూమిలో ఆయుధాలు, యుద్ధ సామాగ్రి లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రష్యా దాడుల నేపథ్యంలో ఖర్కీవ్ ప్రాంతంలోని చిన్నారులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నట్లు అధికారులు తెలిపారు. అదే విధంగా రష్యా దాడుల్లో భవనాలు కూడా దెబ్బతిన్నట్లు పేర్కొన్నారు. కాగా, ఈ నెల 10 నుంచి ఖర్కీవ్ ప్రాంతంపై రష్యా విరుచుకుపతున్న విషయం తెలిసిం?దే. రష్యా దాడులను నుంచి తప్పించుకోవడానికి అప్పటి నుంచి 11 వేల మందిని సురక్షిత ప్రాంతాలకు అధికారులు తరలించారు. రెండేళ్లుగా సాగుతున్న యుద్ధంతో కుదేలైన ఉక్రెయిన్‌కు శుక్రవారం రష్యా చేసిన దాడుల్లో.. రైల్వే నెట్‌వర్క్ ధ్వంసంతో మరిన్ని కష్టాలు వచ్చిపడ్డాయి. గురువారం జరిగిన రష్యా దాడుల్లో సైతం ఏడుగురు ఉక్రెయిన్ పౌరులు మృతి చెందినట్లు అధికారులు పేర్కొన్నారు.

## మహిళా ఎంపీలు 9 మందే! ఢిల్లీ పేలవ రికార్డు




ఢిల్లీ: మహిళలను లోక్‌సభకు పంపే విషయంలో ఢిల్లీ పేలవమైన రికార్డు మూటగట్టుకుంది. స్వాతంత్ర్యానంతరం ఇప్పటిదాకా నగరం నుంచి ఎంపీలుగా ఎన్నికైన మహిళలు కేవలం తొమ్మిది మంది మాత్రమే! రాజధాని నుంచి లోక్‌సభ ఎన్నికల్లో గెలిచిన తొలి మహిళగా ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధురాలు సుచేతా కృపలానీ నిలిచారు. ఆమె 1952లో తొలి లోక్‌సభకు ఎన్నికయ్యారు. 1957లో కూడా గెలిచారు. 1963లో ఆమె యూపీ సీఎం అయ్యారు. మళ్లీ తొమ్మిదేళ్లకు 1971లో సుభద్రా జోషీ, ముకుల్ బెనర్జీ ఢిల్లీ నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు. సుభద్ర లోక్‌సభ ఎంపీ అయిన తొలి పంజాబీ మహిళ కూడా. ఆమె 1962లో యూపీలోని బలరాంపూర్‌లో దివంగత ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయిని ఓడించడం విశేషం. తర్వాత 1980లో సుందర్‌వతీ నావల్ ప్రభాకర్ చాందినీచౌక్ లోక్‌సభ స్థానం నుంచి గెలిచారు. అనంతరం 1996, 1998 ఎన్నికల్లో మీరాకుమార్, సుష్మా స్వరాజ్ ఎంపీలయ్యారు. లోక్‌సభ తొలి మహిళా స్పీకర్‌గా మీరాకుమార్ నిలవగా, ఢిల్లీ నుంచి తొలి కాంగ్రెసేతర మహిళా ఎంపీగా సుష్మా స్వరాజ్ రికార్డులెక్కారు. 1999లో బీజేపీకి చెందిన అనితా ఆర్య కరోల్ బాగ్ నుంచి గెలుపొందారు. 2004, 2009ల్లో కాంగ్రెస్‌కు చెందిన కృష్ణ తీర్థ్ ఢిల్లీ నుంచి ఎంపీ అయ్యారు. 2014, 2019ల్లో మీనాక్షి లేఖి బీజేపీ నుంచి న్యూఢిల్లీ స్థానంలో నెగ్గారు.

బీజేపీ నుంచి బరిలో ఇద్దరు

ఢిల్లీ మాజీ సీఎం షీలా దీక్షిత్, కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ ఢిల్లీ నుంచి లోక్‌సభ బరిలో దిగినా ఓటమి చవిచూశారు. ఈసారి బీజేపీ సుష్మా స్వరాజ్ కూతురు బాసురి (న్యూఢిల్లీ), కమల్‌జీత్ షెరావత్ (వెస్ట్ ఢిల్లీ) రూపంలో ఇద్దరు మహిళలకు ఢిల్లీలో టికెట్లిచ్చింది. కాంగ్రెస్ మాత్రం ఒక్క మహిళకు కూడా ఢిల్లీలో అవకాశమివ్వలేదు.

## లోక్‌సభ బరిలో ప్యాడ్ ఉమన్

ఝార్‌గ్రామ్ నుంచి పోటీ చేస్తున్న సోనామణి



బెంగాల్–జార?ండ్ సరిహద్దుల్లోని గిరిజన గ్రామాలు. అక్షరాస్యత అంతంతే. మహిళల రుతు సమస్యలపై చర్చ కూడా నిషిద్ధమే. దాన్ని బ్రేక్ చేశారామె. సమస్యపై మహిళలకు అవగాహన కల్పించడమే గాక శానిటరీ న్యాప్‌కిన్ల వాడకం నేర్పించారు. జార?ండ్–బెంగాల్ సరిహద్దుల్లో ప్యాడ్ ఉమన్‌గా పేరొందారు. పశ్చిమ బెంగాల్లో శనివారం పోలింగ్ జరగనున్న ఝార్‌గ్రామ్ లోక్‌సభ స్థానం నుంచి సీపీఎం అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. ఆమే జార?ండ్ మట్టి బిడ్డ, బెంగాల్ కోడలు సోనామణి ముర్ము... సోనామణి జార?ండ్‌లోని తూర్పు సింగ్‌భూమ్ జిల్లా కొడియాలో జన్మించారు. జంషెడ్‌పూర్‌లో సైకాలజీలో పీజీ చేశారు. నిరక్షరాస్యతకు అమాయకత్వం తోడవటంతో స్థానిక మహిళల్లో అనేక ఆరోగ్య సమస్యలు. టీనేజ్ అమ్మాయిలతో మొదలు పెట్టిన మహిళలందరికీ రుతుక్రమ సమస్యలపై అవగాహన కల్పించారు. పెళ్లికి ముందు స్థానిక పంచాయతీ ఎన్నికల్లో గెలిచి ప్రధాన్‌గా బాధ్యతలు నిర్వహించారు. 2016లో బెంగాల్‌లోని బంద్వాన్ నివాసి మనీష్ తుడును పెళ్లాడారు. పంచాయతీ ఎన్నికల్లో సీపీఎం అభ్యర్థిగా విజయం సాధించారు. ఇప్పుడు ఏకంగా లోక్‌సభ బరిలో నిలిచారు.

దీదీ, మోదీలతో విసిగిపోయారు..

ఝార్‌గ్రామ్ ఒకప్పుడు సీపీఎం కంచుకోట. జంగల్‌మహల్‌లో మావోయిస్టుల హింస తరువాత తృణమూల్ అధికారంలోకి వచ్చింది. ఎర్రకోట పచ్చగా మారింది. సీపీఎం కార్యకర్తలు ఇళ్లు వీడాల్సి వచ్చింది. గత లోక్‌సభలో అక్కడ బీజేపీ గెలిచింది. ఈసారి మాత్రం లాల్ జెండా ఎగరడం ఖాయమంటున్నారు గిరిజన బిడ్డ సోనామణి. "దీదీ, మోదీ చిత్రహింసలతో జనం విసిగిపోయారు. అందుకే ఎర్రజెండాను కోరుతున్నారు. ఝార్‌గ్రామ్‌లో పేదరికం ఎక్కువ. రెండు పూటలా కడుపునిండా తిండి దొరకని స్థితి. ఉపాధి లేదు. ఉపాధి హామీ పనులూ లేవు. సాగుపైనే ఆధారపడే అటవీ ప్రాంతాల ప్రజలకు ఎరువులు, విత్తనాల ధరలు అందుబాటులో లేవు. పాఠశాలల పరిస్థితి అధ్వానం. చదువుకున్నవారికి ఉద్యోగాలు లేవు. ఈ పరిస్థితిని మారుస్తా" అంటూ ఇంటింటికీ ప్రచారం చేసి ఆకట్టుకున్నారామె.

# ఇండియా కూటమి ఎఫెక్ట్..! కన్ఫ్యూజన్‌లో ఎగ్జిట్ పోల్స్




ఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల్లో ఆరు విడుతల పోలింగ్ పూర్తయ్యేసరికి ఫలితాలపై ఆసక్తికరమైన చర్చ ప్రారంభమైంది. అసలు పోటీలో లేదనుకున్న ఇండియా కూటమి కొన్ని రాష్ట్రాల్లో గట్టిపోటీ ఇస్తోందనే వార్తలొస్తున్నాయి. దీంతో జూన్ ఒకటిన జోస్యం చెప్పబోయే ఎగ్జిట్ పోల్ సంస్థలు కన్ఫ్యూజన్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. 'అబ్‌కీ బార్ చార్సౌ పార్' నినాదంతో.. ఈసారి బీజేపీ ప్రచారంలో అందరికంటే ముందు నిలిచింది. మోదీ చరిష్మాతో మరోసారి అధికారం చేజిక్కించుకోవాలనే పక్కా ప్రణాళికతో బీజేపీ ఎన్నికల ప్రచారం కొనసాగించింది. ఓ వైపు మోదీ మరోవైపు అమిత్ షా దేశాన్ని చుట్టేశారు. నాలుగు వందల సీట్లు గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. అయితే మొదటి రెండు విడతల పోలింగ్ ముగిసిన తరువాత ఇండియా కూటమి సైతం కాస్త పోటీపడినట్లు కనిపించింది. బీహార్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో కూటమి బలం పుంజుకుందనే వార్తలు వచ్చాయి. దీంతో ఎన్నికలు ఏకపక్షం కాదనే వాదనలు ప్రారంభమయ్యాయి. యూపీలో సైతం తాము చాలా సీట్లు గెలుస్తామని ఇండియా కూటమి ప్రకటించడంతో.. ఫలితాలపై ఆసక్తికరమైన చర్చ ప్రారంభమైంది. ఎలక్షన్ చివరి అంకానికి చేరుకున్న నేపథ్యంలో ఎన్నికలు నువ్వా.. నేనా.. అన్నట్లు జరిగాయనే అభిప్రాయమూ వ్యక్తం అవుతోంది. దీంతో అసలు దేశంలో ఏం జరగబోతుందనే కొత్త చర్చ ప్రారంభం అయింది. చాలామంది ఎలక్షన్ పండితులు బీజేపీ సీట్లు తగ్గుతాయనే అభిప్రాయం చెబుతున్నా.. ఇండియా కూటమి అధికారంలోకి వస్తుందా అనే విషయంపై మాత్రం ఏ ఒక్కరూ కాన్ఫిడెంట్‌గా లేరు. 400సీట్ల టార్గెట్‌తో రంగంలోకి దిగిన బీజేపీ.. నిజంగా తన లక్ష్యాన్ని సాధిస్తుందా అనే చర్చతో ఈ సారి సార్వత్రిక ఎన్నికలు ప్రారంభమయ్యాయి. 2019లో సింగిల్‌గా 303సీట్లు సాధించిన బీజేపీ చరిత్రను తిరగరాసింది. ఇందిరాగాంధి మరణానంతరం వచ్చిన సానుభూతితో 1984లో కాంగ్రెస్ పార్టీ 300 మార్కును దాటింది. ఆ తరువాత మళ్లీ ఏ పార్టీ కూడా సింగిల్‌గా 300మార్కు దాటలేదు. కూటమిగా ఎన్డీయే 2019లో ఏకంగా 353 స్థానాలు సాధించింది. ఇది నిజంగా భారీ రికార్డు. తన రికార్డునే తానే తిరగరాస్తానంటూ మోదీ 400 సీట్లు సాధిస్తామని ప్రకటించారు. దీంతో కాంగ్రెస్ కూటమి ప్రచారం కంటే ముందే కుదేలైపోయింది. బీజేపీ ట్రాప్‌లో పడిపోయిన ఇండియా కూటమి నాయకులు.. బీజేపీ 400 సాధించలేదంటూ ప్రకటనలు చేసేశారు. కాని బీజేపీ మళ్లీ అధికారంలోకి రావడానికి 272 సీట్లు చాలన్న చిన్న లాజిక్‌ను కాంగ్రెస్ కూటమి మరిచిపోయింది. తప్పును ఆలస్యంగా తెలుసుకున్న ఇండియా కూటమి నాయకులు తరువాతి కాలంలో అసలు బీజేపి అధికారంలోకి రాలేదంటూ ప్రకటనలు చేయడం ప్రారంభించారు. అయితే అప్పటికే కీలకమైన రెండు విడతల పోలింగ్ పూర్తైపోయింది. ఈ రెండు విడతల్లో జాతీయ స్థాయిలో మోదీ ఉండాలా వద్దా అనే విషయంపై రెఫరెండంగా ఎన్నికలు జరిగినట్లు పరిశీలకులు అంచనా వేస్తున్నారు. అందుకే మొదటి రెండు విడతల్లో.. పోలింగ్ జరిగిన 190 స్థానాల్లో బీజేపీ హవా కొనసాగినట్లు పోల్ పండిట్లు అంచనా వేస్తున్నారు. మోదీ హాట్రిక్ నినాదంతో ఎన్నికలు ప్రారంభం కావడానికి ముందే బీజేపీ గెలిచేసిందనే వాదనలు ప్రారంభమయ్యాయి. అయితే మూడు, నాలుగు విడతల పోలింగ్ జరిగే సరికి లోక్‌సభ ఎన్నికల్లో లోకల్ ఫ్యాక్టర్స్ ఎక్కువగా ప్రభావితం చూపించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా 40 స్థానాలున్న బీహార్‌లో తేజస్వీ యాదవ్ తన ప్రచారంలో ఎక్కువగా నిరుద్యోగం అంశాన్ని హైలైట్ చేశారు. 2019లో బీహార్‌లో ఎన్డీయే కూటమి 39 స్థానాలు గెలుచుకుని క్లీన్ స్వీప్ చేసింది. ఈసారి ఇక్కడ కాంగ్రెస్ కూటమి కొన్ని స్థానాలు గెలుస్తుందనే వార్తలు వస్తున్నాయి. యూపీలో అఖిలేష్ మీటింగ్లకు సైతం భారీగా జనం హాజరవడం ఎన్నికల సరళిపై కొత్త చర్చకు తెరలేపింది. 80 లోక్‌సభ స్థానాలున్న యూపీలో బీఎస్పీ ఈసారి తన ప్రాభవాన్ని కోల్పోతుందని.. దీనివల్ల లాభపడేది ఎవరనే దానిపై యూపీ రిజల్ట్స్ ఆధారపడి ఉంటాయనేది విశ్లేషకుల అంచనా. ఇక యూపీ తరువాత అతిపెద్ద రాష్ట్రం మహారాష్ట్రలో మరాఠా అస్మితా పేరుతో ఉద్ధవ్ ఠాక్రే తీసుకొచ్చిన ఆత్మగౌరవం నినాదంపైనా పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. అటు కర్ణాటకలోనూ ప్రజ్వల్ రేవన్న అంశం బీజేపీ కూటమికి వ్యతిరేకంగా పనిచేసినట్లు తెలుస్తోంది. దీంతో మూడునాలుగు విడతల పోలింగ్ పూర్తయ్యేసరికి ఇండి కూటమి పోటీలోకి వచ్చిందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. బీజేపీ 400 సీట్ల నినాదం కేవలం ప్రతిపక్షాలను ట్రాప్ చేయడానికే అనేది స్పష్టమైపోయింది. అయితే బీజేపీ మాత్రం ఇప్పటికీ 400 సీట్లు సాధ్యమనే అంటోంది. 2019లో 353 సీట్లు సాధించిన ఎన్డీయే మరో 40 సీట్లు సాధించడం కష్టమేమి కాదని కొంతమంది ఎన్నికల విశ్లేషకులు అంటున్నారు. ముఖ్యంగా ప్రతిపక్షం బలహీనంగా ఉండటం వల్ల బీజేపీకి పోటీలేకుండా పోయిందని.. కొంతమంది పోల్స్టర్స్ విశ్లేషిస్తున్నారు. మోదీకి ప్రత్యామ్నాయం లేకపోవడం విదేశీవిధానం, ఆర్థిక పురోగతిలాంటి అంశాలు బీజేపీకి కలిసివచ్చే అంశాలనే వీరు వాదిస్తున్నారు. నాలుగు వందల సీట్లు సాధ్యమే అని ఒకవేళ 400సాధ్యం కాకపోయినా.. గతం కంటే బీజేపీ సీట్లు పెరుగుతాయని వీరు వాదిస్తున్నారు. ఇక బీజేపీ ఈసారి ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని బీజేపీ సొంతంగా 300 సీట్లు గెలుస్తుందని సీఎస్డీఎస్ సంస్థకు చెందిన సంజీవ్ కుమార్ అంటున్నారు. అయితే బీజేపీ మిత్రపక్షాలు మాత్రం చాలా ఘోరంగా ఓడిపోతారని దీంతో నాలుగు వందల సీట్లు సాధ్యం కాదని సంజీవ్ అంచనా వేస్తున్నారు. రాక్ఫెల్లర్ ఇంటర్నేషనల్ చైర్మన్ రుచిర్ శర్మ ఇటీవల ఒక సమావేశంలో మాట్లాడుతూ.. ఈసారి పోటీ నువ్వా నేనా అన్నట్లు ఉందని.. అయితే ఇప్పటికీ బీజేపీకే ఎక్కువ అవకాశాలున్నాయని స్పష్టం చేశారు. అమెరికాలో స్థిరపడ్డ రుచిర్ శర్మ గత పాతికేళ్లుగా భారత ఎన్నికల సరళిపై అధ్యయనం చేస్తున్నారు. ఇక కాంగ్రెస్ పార్టీకి కాస్త అనుకూలంగా వ్యవహరించే యోగేంద్రయాదవ్ లాంటి సెఫాలజిస్టులు కాస్త డిఫరెంట్ వాదన ముందుకు తెస్తున్నారు. ముఖ్యంగా యూపీ, బీహార్, కర్ణాటక, మహారాష్ట్రలో బీజేపీదాని మిత్రపక్షాలు గతంతో పోలిస్తే 60 నుంచి 70స్థానాలు కోల్పోతారని యాదవ్ అంటున్నారు. బీజేపీ సొంతంగా 250 సీట్లకు పరిమిత అవుతుందని యోగేంద్రయాదవ్ బాంబు పేలుస్తున్నారు. ఇదే నిజం అయితే బీజేపీ కూటమి మద్దతు లేకుండా ప్రభుత్వం నడపలేదని స్పష్టం అవుతోంది. ఎన్నికల చివరి అంకానికి చేరుకున్న నేపథ్యంలో ఇప్పుడు.. ఎగ్జిట్ పోల్స్‌పై చాలా సర్వే సంస్థలు గుంభనంగా ఉన్నాయి. డేటాను విశ్లేషించడంలో తలమునకలైన కీలక సంస్థలన్నీ ఈ సారి ఎన్నికల సరళిపై ఎగ్జిగ్ పోల్స్ ఇవ్వడం అంత ఆశామాషీ కాదనే అభిప్రాయానికి వచ్చాయి. 2019లో కొంత ఈజీగా అనిపించిన ఎగ్జిట్ పోల్స్ ఈసారి మాత్రం కత్తిమీద సాము అని పొలిటికల్ పండిట్లు అంటున్నారు.

# తెలంగాణ కాంగ్రెస్‌కు కొత్త తలనొప్పి తప్పదా?

లోక్‌సభ ఎన్నికల తర్వాత కొత్త పీసీసీ చీఫ్!

కసరత్తులు ప్రారంభించిన హైకమాండ్

ఆశలు పెట్టుకున్న సీనియర్లు

తమకే ఇవ్వాలంటూ హైకమాండ్‌కు ఇప్పటికే విజ్ఞప్తులు

అసంతృప్తులు బయటకు రాకుండా.. ఆచితూచి నిర్ణయం తీసుకోనున్న అధిష్టానం

సీఎం రేవంత్‌తో కలుపుగోలుగా ఉండేవాళ్లకే ఛాన్స్?




హైదరాబాద్, : తెలంగాణ కాంగ్రెస్‌కు సంబంధించిన నిర్ణయాల కోసం హైకమాండ్ ఎంతగా మల్లగుల్లాలు పడుతోంది గత కొన్ని నెలలుగా చూస్తున్నాం. ఈ క్రమంలో లోక్‌సభ ఎన్నికల తర్వాత.. కాంగ్రెస్ హైకమాండ్‌కు కొత్త తలనొప్పి తప్పదనిపిస్తోంది. తెలంగాణ పీసీసీ చీఫ్‌గా ఎవరిని ఎంపిక చేయబోతోంది. గాంధీభవన్‌కు కొత్త బాస్ ఎవరు కానున్నారు?.. సీనియర్ల అభ్యంతరాలు–గ్రూప్ రాజకీయాలకు చెక్ పెట్టి ఆ నియామకాన్ని కాంగ్రెస్ ఎలా పూర్తి చేయబోతోంది?.. పీసీసీ చీఫ్, ముఖ్యమంత్రిగా జోడు పదవులు నిర్వహిస్తున్న ఎనుముల రేవంత్ రెడ్డి స్థానంలో.. పార్టీకి కొత్త చీఫ్‌గా ఎవరు రాబోతున్నారు?. అసలు ఆ రేసులో ఉన్న నాయకులు ఎవరు? ఈసారి అగ్ర వర్ణాలకు ఇస్తారా? బీసీలకు ప్రాధాన్యమిస్తారా? లేక ఎస్సీ వర్గంలో సీనియర్ నేతకు ఛాన్స్ ఇస్తారా? అసలు కాంగ్రెస్ హైకమాండ్ మదిలో ఏముంది? పార్టీ నాయకత్వం దృష్టిని ఆకర్షించినవారు ఎవరు?.. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ముందు పీసీసీ చీఫ్‌గా ఉన్న రేవంత్‌రెడ్డి...పార్టీ అధికారంలోకి రావడంతో ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. పార్లమెంట్ ఎన్నికలు దగ్గరపడుతుండటంతో వెంటనే పీసీసీ అధ్యక్షుడిని మారిస్తే ఇబ్బంది అవుతుందని భావించిన హైకమాండ్ ఎన్నికల తర్వాతే కొత్త పీసీసీ చీఫ్ వస్తారని తెలిపింది. ఇక ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికలు ముగిసాయి గనుక.. ఫలితాలు రాగానే కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడిగా కొత్త నేత వస్తారంటున్నారు. రేవంత్‌రెడ్డి కూడా పార్టీ బాధ్యతల నుంచి తప్పుకుని పూర్తిగా పాలనపైనే దృష్టి పెట్టాలనుకుంటున్నారు. ఇక హైకమాండ్ కూడా గాంధీభవన్‌కు కొత్త బాస్‌గా ఎవరిని నియమించాలనే విషయంపై కసరత్తు ప్రారంభించినట్లు తెలుస్తోంది. పీసీసీ చీఫ్ ఎవరిని నియమిస్తే బాగుంటుందనే చర్చ కాంగ్రెస్ క్యాడర్లో విస్తృతంగా జరుగుతోంది. తర్వాత పీసీసీ చీఫ్ గా ఎవరు వస్తారనే విషయాన్ని సీఎం రేవంత్ దగ్గర ప్రస్తావిస్తే ఆ విషయం తన పరిధిలో లేని అంశమని, హై కమాండ్ ఎవరిని నియమించినా తనకు సమ్మతమేనని రేవంత్ రెడ్డి చెప్తున్నారట. పార్టీని ప్రతిపక్షం నుంచి అధికారంలోకి తీసుకొచ్చిన రేవంత్ రెడ్డి స్థాయిలో పనిచేయగలిగే వ్యక్తి ఎవరున్నారనే అంశంపై




పార్టీ అధిష్ఠానం ఫోకస్ చేసినట్టు తెలుస్తోంది. పీసీసీ అధ్యక్షుడిగా ఎవరైతే బాగుంటుంది? ఎవరైతే నేతలందరినీ కలుపుకొని వెళ్ళగలరు అనే దానిపై హై కమాండ్ సమాచారం సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. పీసీసీ చీఫ్ పదవిపై చాలా మంది సీనియర్ నేతలు ఆశలు పెట్టుకున్నట్లు బహిరంగంగానే ప్రకటిస్తున్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జగ్గారెడ్డి తనకు పీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వాలని చాలారోజుల నుండి అడుగుతున్నారు. ఇప్పుడు కూడా తాను పీసీసీ చీఫ్ రేసులో ఉన్నట్లు చెబుతున్నారు. ఇక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి సైతం తనకు పీసీసీ చీఫ్ పదవి కావాలని హై కమాండ్ కి రిక్వెస్ట్ చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ముఖ్యమంత్రి సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కాబట్టి పీసీసీ చీఫ్ పదవి రెడ్డి సామాజిక వర్గానికి ఇవ్వరనే వాదన బలంగా వినిపిస్తోంది. దీంతో బీసీ, ఎస్సీ సామాజిక వర్గాల నేతలు పీసీసీ చీఫ్ పదవిపై ఆశలు పెట్టుకున్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పీసీసీ చీఫ్ తనకి ఇవ్వాలని చాలా రోజుల నుండి అడుగుతున్నారట. కర్ణాటకలో డీకే శివకుమార్ డిప్యూటీ సీఎంతో పాటు పీసీసీ చీఫ్ గా ఉన్నారని తెలంగాణలో సైతం అలాంటి నిర్ణయాన్నే తీసుకోవాలని భట్టి పట్టుపడుతున్నట్లు సమాచారం. మంత్రి పొన్నం ప్రభాకర్ సైతం పీసీసీ చీఫ్ రేసులో ఉన్నారు. తాను విద్యార్థి దశ నుండి కాంగ్రెస్ పార్టీలో పనిచేస్తున్నానని తనకి అధ్యక్షుడిగా అవకాశం ఇస్తే బాగుంటుందని కాంగ్రెస్ పెద్దల దగ్గర చెబుతున్నట్లు సమాచారం. పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ సైతం పీసీసీ రేసులో తాను ఉన్నట్లు ప్రకటించారు. మరో బీసీ నేత మధుయాష్కీ గౌడ్ కూడా పీసీసీ చీఫ్ రేసులో ఉన్నట్లు ఆయన సన్నిహితులు చెబుతున్నారు. ఏఐసీసీ సెక్రటరీ సంపత్‌కుమార్ సైతం పీసీసీ పదవి తనకి వస్తుందనే ధీమాలో ఉన్నారు. మొన్న నాగర్ కర్నూల్ ఎంపీ టికెట్ ఆశించారు. మాదిగలకు కాంగ్రెస్ సరైన గౌరవం ఇవ్వడం లేదనే చర్చ నేపథ్యంలో పార్టీ అధ్యక్ష పదవి మాదిగ సామాజికవర్గానికి చెందిన సంపత్ కి ఇస్తే బాగుంటుందనే వాదన నడుస్తోంది. ఇక మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, అద్దంకి దయాకర్ లాంటి వాళ్ళ పేర్లు కూడా పీసీసీ చీఫ్ పదవి కోసం పరిశీలనలో ఉన్నట్లు వినిపిస్తోంది. అయితే ప్రధానంగా జగ్గారెడ్డి, మహేష్ కుమార్ గౌడ్, సంపత్ కుమార్ ల మధ్యే ప్రధాన పోటీ ఉన్నట్లు సమాచారం. అధికార పార్టీ అధ్యక్ష పదవి కోసం పదికి పైగా మంది నేతలు సీరియస్ గా ప్రయత్నిస్తున్నారు. రెడ్డి సామాజికవర్గం నుంచి సీఎం ఉండడంతో బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల నేతలనుంచి ఒకరికి పీసీసీ పదవి దక్కనుందని గాంధీభవన్‌లో జోరుగా చర్చ జరుగుతోంది.

## రాంచీలో ఓటేసిన ధోనీ.. ఎగబడ్డ అభిమానులు



టీమిండియా మాజీ కెప్టెన్, చెన్నై సూపర్ కింగ్స్ ఐకాన్ ఎంఎస్ ధోనీ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. శనివారం దేశ వ్యాప్తంగా ఆరో విడత ఎన్నికల పోలింగ్ జరుగుతోంది. దీంతో తన స్వస్థలం రాంచీలో ఎంఎస్. ధోనీ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. కొద్దిరోజుల క్రితమే ధోనీ బెంగళూరు నుంచి రాంచీ వరకు ఎకానమీ క్లాస్‌లో ప్రయాణిస్తూ వెళ్లారు. ఒక సాధారణ వ్యక్తిలా ప్రయాణించడంపై నెటిజన్లు ప్రశంసలతో ముంచెత్తుతున్నారు. అలాగే ధోనీ ఓటు వేయడాన్ని కేంద్ర ఎన్నికల సంఘం కూడా తన ఎక్స్‌లో పోస్టు చేసింది. శనివారం ఆరు రాష్ట్రాలు, రెండు కేంద్ర పాలిత ప్రాంతాల్లో కలిపి మొత్తంగా 58 లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నారు. బీహార్‌లో ఎనిమిది, హర్యానాలో పది, జమ్మూ-కశ్మీర్‌లో ఒకటి, జార?ండ్‌లో నాలుగు, ఢిల్లీలో ఏడు, ఒడిశాలో ఆరు, ఉత్తరప్రదేశ్‌లో పద్నాలుగు, పశ్చిమ బెంగాల్‌లో ఎనిమిది స్థానాలకు పోలింగ్ జరుగుతుండగా.. 889 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ధోనీ కుటుంబంతో కలిసి రాంచీలోని సమీప పోలింగ్ బూత్‌కు వెళ్లి ఓటేశారు. ధోనీ పోలింగ్ కేంద్రానికి రాగానే అభిమానులు, ఓటర్లు, భద్రతా సిబ్బంది చుట్టుముట్టేశారు. మొబైల్‌లో ఫొటోలు తీసేందుకు ఉత్సాహం చూపించారు. మొత్తానికి అతి కష్టం మీద.. భారీ భద్రత నడుమ ధోనీ ఓటేశారు. ఇందుకు సంబంధించిన వీడియోలు వైరల్ అవుతుండగా.. భారత ఎన్నికల సంఘం సైతం.. "తలా ఫర్ రీజన్" అంటూ ప్రజాస్వామ్యంలో ధోనీ సిక్సర్ బాదాడంటూ ఫొటోను షేర్ చేసింది. అలాగే మాజీ క్రికెటర్లు కపిల్ దేవ్, గౌతం గంభీర్, రెజ్లర్ బబితా ఫొగట్ తదితరులు తమ నియోజకవర్గాల్లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఐపీఎల్-2024 ఆరంభానికి ముందే చెన్నై సూపర్ కింగ్స్ కెప్టెన్‌గా ధోని వైదొలిగారు. ఆ బాధ్యతలను రుతురాజ్ గైక్వాడ్‌కు అప్పగించారు. ధోనీ వికెట్ కీపర్‌గా.. బ్యాటర్‌గా కొనసాగారు. ఇక డిఫెండింగ్ చాంపియన్ చెన్నై ఈసారి కనీసం ప్లే ఆఫ్స్ చేరకుండానే నిష్క్రమించింది. రాయల్ చాలెంజర్స్ బెంగళూరుతో కీలక మ్యాచ్‌లో ఓడిపోయి ఇంటిబాట పట్టింది. ఢిల్లీలోని ఏడు పార్లమెంటరీ నియోజకవర్గాలు చాందినీ చౌక్, తూర్పు ఢిల్లీ, న్యూఢిల్లీ, ఈశాన్య ఢిల్లీ, వాయువ్య ఢిల్లీ, దక్షిణ ఢిల్లీ మరియు పశ్చిమ ఢిల్లీ స్థానాలకు ఓటింగ్ జరుగుతోంది. ఇక ఇద్దరు మాజీ ముఖ్యమంత్రులు బరిలో ఉన్నారు. కర్నాల్ నుంచి బీజేపీ అభ్యర్థిగా మనోహర్‌లాల్ ఖట్టర్, అనంతనాగ్ నుంచి పీడీపీ అభ్యర్థిగా మెహబూబా ముఫ్తీ పోటీ చేస్తున్నారు. 889 మంది అభ్యర్థుల భవితవ్యాన్ని నిర్ణయించేందుకు 11.13 కోట్ల మంది ఓటర్లు ఆరో దశ సార్వత్రిక ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

## రేవంత్ సమర్ధతకు పరీక్ష - పట్టు నిలిచేనా..!!




తెలంగాణలో మరో ఎన్నికకు సర్వం సిద్దమైంది. పార్లమెంట్ ఎన్నికలు హోరా హోరీగా ముగిసాయి. ఈ నెల 27న జరిగే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నిక కు ప్రచారం ముగిసింది. మొత్తం 52 మంది అభ్యర్దులు ఈ ఎన్నికలో పోటీ పడుతున్నారు. ఈ ఎన్నికలో మూడు ప్రధాన పార్టీల అభ్యర్దులకు గెలుపు ప్రతిష్ఠాత్మకంగా మారింది. అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి సీఎం అయిన రేవంత్ కు పీసీసీ చీఫ్ హోదాలోనూ ఉన్నారు. ఈ ఎన్నికలో గెలుపు రేవంత్ సమర్ధతకు పరీక్షగా నిలుస్తోంది. ఈ నెల 27న జరగబోయే ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ నియోజకవర్గ గ్రాడ్యుయేట్ ఉప ఎన్నికకు ప్రచారం ముగిసింది. మొత్తం నాలుగు లక్షల 63 వేల 839 మంది పట్టభద్రులు ఓటు హక్కు వినియోగించు కోనున్నారు. ఈ ఎన్నికలో 52 మంది అభ్యర్దులు తల పడుతున్నారు. ఈ నెల 27న పోలింగ్.. జూన్ 5న కౌంటింగ్ జరగనుంది. గ్రెస్ పార్టీ నుంచి తీన్మార్ మల్లన్న, బీజేపీ అభ్యర్థిగా గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, గులాబీ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఏనుగుల రాకేశ్ రెడ్డి పోటీ చేస్తున్నారు. నియోజకవర్గంలో ఓటు ఉన్న ప్రభుత్వ ఉద్యోగులకు ప్రత్యేక క్యాజువల్ సెలవు ఇవ్వాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రచారం ముగియటంతో ఎన్నికల్లో గెలుపు కోసం మూడు పార్టీలు వ్యూహాలకు పదును పెడుతున్నాయి. ఈ ఎన్నికల్లో ప్రధానంగా బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థుల మధ్యే పోటీ నెలకొంది. పట్టభద్రులను ఆకట్టుకునేందుకు అత్మీయ సమ్మేళనాలు, సభలు నిర్వహిస్తూ అభ్యర్థులు ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. ఈసారి ఎలాగైనా గెలవాలన్న లక్ష్యంతో... బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి ముమ్మర ప్రచారం నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్ ఆరుగురు మంత్రులను ప్రచారంలోకి దించింది. కాంగ్రెస్ అభ్యర్ధి గెలుపు కోసం పార్టీ సర్వశక్తులు ఒడ్డుతోంది. ఈ ఎన్నికల్లో సిట్టింగ్ స్థానం నిలబెట్టుకోవటం గులాబీ పార్టీకి అదే స్థాయిలో ప్రతిష్టాత్మకంగా మారుతోంది. దీంతో..ఈ హోరా హోరీ పోరులో గెలుపు కోసం మూడు పార్టీలు తమ చివరి ప్రయత్నాలు కొనసాగిస్తున్నాయి.

## వాతావరణ మార్పులకు అనుగుణంగా పంటల మార్పిడి



హైదరాబాద్: వాతావరణ మార్పులకు అనుగుణంగా పంటల మార్పిడి చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. హోటల్ టూరిజం ప్లాజా సోమాజిగూడలో హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో "ఎనర్జీ ట్రాన్స్మిషన్ ఇన్ ఇండియా ఫోకస్ ఆన్ తెలంగాణ" అనే అంశంపై వర్క్ షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హాజరయ్యారు. ఈ వర్క్ షాప్ మంచి ఫలితాలు ఇవ్వాలని కోరుకుంటున్నానని అన్నారు. హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వర్క్ షాప్ మంచి ఫలితాలు ఇవ్వాలని కోరుకుంటున్నానని అన్నారు. మేధావులు పర్యావరణవేత్తలు కలిసి వాతావరణ పరిరక్షణ క్లీన్ ఎనర్జీ కోసం డాక్యుమెంట్ రూపంలో తమకు ఇస్తే ప్రభుత్వం ద్వారా కచ్చితంగా చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తానని తెలిపారు. వాతావరణంలో చాలా మార్పులు జరిగాయి...కొన్ని సార్లు అంచనాలకు అందకుండా మార్పులు జరుగుతున్నాయని చెప్పుకొచ్చారు. పంటల మార్పిడి కూడా జరిగిందని, భూమిని రక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. క్లీన్ ఎనర్జీ కోసం తన వంతు కృషి చేస్తానని .. వాటర్ బాడీస్‌ను రక్షిస్తాం...ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

# దశాబ్ది కాలంలో ఉన్నత విద్య అధోగతి



దక్షిణాఫ్రికా లోని ఒక విశ్వవిద్యాలయ శిలాఫలకం మీద ఇలా వుంది. "ఏ దేశమైనా నాశనమవ్వడానికి అణుబాంబులు అక్కర్లేదు. అణ్వస్త్ర ఆయుధాలు అంతకంటే అక్కర్లేదు. ఆ దేశంలో లోపభూయిష్టమైన, నిర్వీర్యమైన విద్యావ్యవస్థ అన్ని వ్యవస్థలను నీచ స్థితికి దిగజార్చుతుంది". నేడు దేశవ్యాప్తంగా ప్రభుత్వ కళాశాలలు విశ్వ విద్యాలయాలలో విద్యా ప్రమాణాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. గణితం, సైన్స్, సోషల్ స్టడీస్, ఇంగ్లీష్‌లలో పదవ తరగతి విద్యార్థుల అభ్యసన సామర్థ్యం వరుసగా 32 శాతం, 35 శాతం, 37 శాతం, 43 శాతంగా నమోదయ్యాయని 'నేషనల్ అఛీవ్‌మెంట్ సర్వే' పేర్కొన్నది. 2017 నాటి జాతీయ సర్వేతో పోల్చితే, 2021 సర్వేలో సగటు ఫలితాలు పడిపోయాయని తెలిపింది. తమిళనాడు, తెలంగాణ, మేఘాలయ, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో జాతీయ సగటు కన్నా దిగువన ఫలితాలు నమోదయ్యాయి. ముఖ్యంగా కరోనా సంక్షోభం విద్యార్థుల చదువుల్ని కకావికలం చేసింది. సామాజికంగా, ఆర్థికంగా మెరుగైన కుటుంబాల పిల్లలకు ఆన్‌లైన్ చదువులు అందుబాటులో ఉన్నాయని, మిగతావారికి కష్టసాధ్యమైందని సర్వే ఫలితాలు తెలిపాయి. ఆన్‌లైన్ ద్వారా సమాన విద్యావకాశాలు పూర్తిగా సన్నగిల్లాయని సర్వేలు చెబుతున్నా దిద్దుబాటు చర్యలకు ప్రభుత్వాలు పూనుకోవడం లేదు. భాషా నైపుణ్యం, పర్యావరణ శాస్త్రం, సైన్సు, గణితం, సామజిక శాస్త్రాలలో పిల్లలు వెనుకబడ్డారు. తాజాగా కాగ్ నివేదిక ఆసక్తికర అంశాలను బయట పెట్టింది. ఐఐటి, ఎన్ఐటి లలో పీజీ, పిహెచ్‌డి కోర్సుల్లో ఏటా సీట్లు భారీగా మిగిలి పోతున్నాయని వెల్లడించింది. ఇక రెండు తెలుగు రాష్ట్రాలలో పరిశోధన పడకేసి దశాబ్దం అవుతున్నది. ప్రతి సంవత్సరం నిర్వహించాల్సిన రీసెట్ ఎంట్రన్స్ పరీక్ష మూడు సంవత్సరాలకొకసారి నిర్వహిస్తూ ఇంటర్వ్యూలు అడ్మిషన్లకు సంవత్సర కాలం తీసుకుంటున్నారు. చాలా విశ్వవిద్యాలయాలలో అధ్యాపకులు లేక విభాగాలు మూసివేశారు. నకిలీ విశ్వవిద్యాలయాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి. 2020లో అడ్మిట్ అయిన స్కాలర్‌కు 2022 పట్టా ఇస్తున్నారు. విశ్వవిద్యాలయంలో కంప్యూటర్, ఎంబిఏ విభాగాలలో చదువు చెప్పేవారే లేరు. బాసరలో వెలసిన ట్రిపుల్ ఐఐటి పరిస్థితి ఎలా ఉందో అనంతపురంలో వెలసిన కేంద్ర విశ్వవిద్యాలయం పరిస్థితి అలాగే ఉంది. అక్కడ వి.సి, అధ్యాపకులు లేరు. మౌలిక సదుపాయాలు లేవు. ఇక్కడ కేంద్ర విశ్వవిద్యాలయం పెట్టి ఏడు సంవత్సరాలు కావస్తున్నా అద్దె భవనంలోనే ఉంది. అక్కడ ఉన్న శాతవాహన, తెలంగాణ, మహాత్మా గాంధీ, కాకతీయ విశ్వవిద్యాలయాలలో పట్టుమని పది మంది శాశ్వత అధ్యాపకులు లేరు. చివరికి వంద సంవత్సరాల ఘన కీర్తి ఉన్న ఉస్మానియాలో అరవై మంది అధ్యాపకులు లేరు. ఆంధ్రాలో వెలసిన నన్నయ్య, యోగి వేమన, ద్రావిడ, అంబేద్కర్, విక్రమ్ సింహపురి, పద్మావతీ, రాయలసీమ విశ్వవిద్యాలయాలలో పట్టుమని పదిమంది శాశ్వత అధ్యాపకులు లేరు. కర్నూల్ జిల్లాలో రాయలసీమ విశ్వవిద్యాలయం, ఐఐటిడిఎం, ఆంధ్రప్రదేశ్ ఉర్దూ విశ్వవిద్యాలయం ఉన్నాయి. అవి ఎలా ఉన్నాయనే సంగతి పక్కన పెడితే ఇప్పుడు కొత్తగా జగన్నాథ గట్టు దగ్గర క్లస్టర్ యూనివర్సిటీకి శంకుస్థాపన చేశారు. అధ్యాపకులు లేక కీలక విభాగాలు మూసివేతకు గురైనాయి. పొలిటికల్ సైన్స్, పాలిమర్ సైన్స్, స్టాటిస్టిక్స్, సెరికల్చర్, జువాలజీ, బయో కెమిస్ట్రీ, ఇంగ్లీష్, తెలుగు, హిందీ, ఎకనామిక్స్, హిస్టరీ, సోషల్ వర్క్, రూరల్ అడ్మినిస్ట్రేషన్, ఎకనామిక్స్, జియాలజీ, మ్యాథమెటిక్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇలా చెప్పుకుంటూ పోతే అన్ని విభాగాల్లోను ఒకే ఒక్కరితో నడుపుతున్నారు. ఇక్కడ పని చేసే శాశ్వత అధ్యాపకులు మైనర్, మేజర్ రీసర్చ్ ప్రాజెక్టులకు అప్లై చేసిన పాపాన పోవడం లేదు. రీసర్చ్ గ్రాంట్ అనేది తెలియని స్థితిలో అధ్యాపకులు ఉన్నారు. రీసర్చ్ గ్రాంట్లే కాదు కాన్ఫరెన్సులు, సెమినార్, ఫ్యాకల్టీ డెంట్ ప్రోగ్రాంలకు, స్టాఫ్ డెవలప్‌మెంట్ కోర్సులు, రిఫ్రెషర్, ఓరియంటేషన్ కోర్సులు దశాబ్ద కాలంలో జరగలేదు. అకడమిక్ స్టాఫ్ కాలేజీలు, ఎలక్ట్రానిక్ మల్టీ మీడియా రీసర్చ్ సెంటర్లు నిధులు లేక వెలవెలబోతున్నాయి. ఇక ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంజనీరింగ్, ఇన్‌స్ట్రుమెంటేషన్, ఎలక్ట్రానిక్స్, జువాలజీ, వృక్ష శాస్త్ర విభాగంలో టెక్నీషియన్లు, ల్యాబ్ అటెండర్లు లేక ప్రయోగశాలలు మూతపడ్డాయి. యుజిసి, స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఇతర నియంత్రణ సంస్థల పర్యవేక్షణ లేకపోవడంతో ప్రైవేటు విశ్వవిద్యాలయాల అడ్డు అదుపు లేకుండా పోయింది. అడుగు వ్యవసాయ భూమి లేకపోయినా అగ్రికల్చర్, హార్టికల్చర్, ఫారెస్ట్రీ, అగ్రికల్చర్ మేనేజ్‌మెంట్ కోర్సులు నడుపుతూ ఎలాంటి గుర్తింపు లేకున్నా విద్యార్థుల జీవితాలను అంధకారంలోకి నెడుతున్న విశ్వవిద్యాలయాలపై ప్రభుత్వాలకు అదుపు లేకుండా పోయింది. రాష్ట్రంలో కొన్ని నర్సింగ్, బిఎస్సి అగ్రికల్చర్, హార్టికల్చర్, ఫారెస్ట్రీ కళాశాలలు, విశ్వవిద్యాలయాలు షాపింగ్ కాంప్లెక్స్ లోను, కమర్షియల్, లాడ్జిలో, అద్దె భవనాలలో ఉంటున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. సువిశాలమైన అత్యాధునిక వసతులతో శాశ్వత భవనాలు అని ప్రచారం చేస్తూ ఏడు సంవత్సరాలుగా కాలం వెళ్ళబుచ్చుతున్నా పట్టించుకునే నాథుడే లేడు. బిఎస్సి అగ్రికల్చర్, బిఎస్సి హార్టికల్చర్, బిఎస్సి ఫారెస్ట్రీ, ఎంబిఏ అగ్రికల్చర్.ఏ ఒక్క కోర్సుకు ఐ కార్ అనుమతి లేదు. ఇండియన్ కౌన్సిల్ ఫర్ అగ్రికల్చర్ రీసర్చ్ గుర్తింపు ఉండాలంటే కనీసం వంద ఎకరాల వ్యవసాయ భూమి ఉండాలి. ఇలాంటి విశ్వవిద్యాలయాలకు సెంటు భూమి లేదు. కళాశాలలో అగ్రికల్చర్, హార్టికల్చర్, ఫారెస్ట్రీ కోర్సులు బోధించడానికి పట్టుమని నలుగురు అధ్యాపకులు ఉండరు. ప్రైవేటు విశ్వవిద్యాలయాల ఉప కులపతులు, కులపతులు ఎక్కువగా నియంత్రణ మండళ్లల్లో పని చేసి రిటైర్ అయిన వారిని నియమించడం జరుగుతుంది. ఎందుకంటే వీరి పరపతి ఉపయోగించి కోర్సులకు అప్రూవల్ తెస్తారని ధీమా. ఇలాంటి విశ్వవిద్యాలయంలో మూడు సంవత్సరాల విద్యనభ్యసించే విద్యార్థులకు వ్యవసాయంపై కనీస అవగాహన ఉండదు. అగ్రానమి, సాయిల్ సైన్స్, క్రాప్ ప్రొడక్షన్, హార్వెస్టింగ్, పెస్ట్ కంట్రోల్, ప్లాంట్ పాథాలజీ, వీడ్ మేనేజ్‌మెంట్, పెస్ట్ మేనేజ్‌మెంట్‌పై అవగాహన లేదు. సుదూర ప్రాంతాల నుంచి, ఇతర రాష్ట్రాల నుంచి పిల్లలు ఇలాంటి విశ్వవిద్యాలయంలో విద్యనభ్యసిస్తున్నారు. మూడు నాలుగు సంవత్సరాల తరువాత ఐ కార్ గుర్తింపు లేని, వ్యవసాయంపై కనీస అవగాహన లేని విద్యార్థులకు వీళ్ళిచ్చే సర్టిఫికెట్‌తో ఎవరికీ ఉద్యోగం రాదు. కనీసం వీరికి ఏమైనా వ్యవసాయం, ఫలసాయం, ఫారెస్ట్రీపై ఏమైనా ప్రవేశం ఉన్నదా అంటే అదీ లేదు. రాష్ట్రంలో చాలా ప్రైవేటు విశ్వవిద్యాలయాలు రీసర్చ్ సూపర్‌వైజర్లు లేకున్నా పిహెచ్‌డిలు నడుపుతున్నాయి. రీసర్చ్ విభాగం ఉండదు, గైడ్లు ఉండరు. ఎక్కడో ఉత్తరాదిన ఇలాంటి బోగస్ విశ్వవిద్యాలయాలు ఉండేవి. అనంతపురంలో వెలసిన ప్రైవేటు విశ్వవిద్యాలయం పట్టుమని ముగ్గురు డాక్టరేట్లు లేరు. 28 కోర్సులలో పిహెచ్‌డి ప్రవేశ పరీక్షలు నిర్వహించింది. ఐదు వేలు అప్లికేషన్ ఫీజు, రూ.25000 అడ్మిషన్ ఫీజు, ప్రతి సంవత్సరం లక్ష రూపాయలు ట్యూషన్ ఫీజు. విదేశీ విద్యార్థులు రీసర్చ్ స్కాలర్లుగా ఉన్నారు. ప్రభుత్వ విశ్వవిద్యాలయాలకు రీసర్చ్ గ్రాంట్లు లేవు. ఉన్న అరకొర నిధులు, బ్లాక్ గ్రాంట్లు జీతభత్యాలకు సరిపోవడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం మొద్దు నిద్ర మాని విద్యారంగంలో చోటు చేసుకుంటున్న ఇటువంటి అవకతవకలను సరిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# విదేశాల్లో ఉద్యోగమా..అప్రమత్తత అవసరం

'విదేశాల్లో పెద్ద ఉద్యోగం. ఏసీ రూముల్లో డేటా ఎంట్రీ ఆపరేటర్ పని. రూ.లక్షల్లో సంపాదన' అని చెప్పి నిరుద్యోగ యువతను నమ్మించి విదేశీ ముఠాలకు విక్రయిస్తున్న ముగ్గురు సభ్యులను విశాఖ పోలీసులు ఇటీవల అరెస్ట్ చేశారు. అంతే కాకుండా చాలా మంది గల్ఫ్ దేశాల్లో ఉద్యోగాల పేరుతో విజిటింగ్ వీసాలపై పంపి మోసం చేస్తున్న ఘటనలు తరచూ వెలుగు చూస్తూనే ఉన్నాయి. అందుకే విదేశాల్లో ఉద్యోగం అంటే ఒకటికి రెండు సార్లు పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

### విజిటింగ్, స్టూడెంట్ వీసాలపై..

టర్కీ సమీపంలోని అజర్ బైజాన్‌కు 29 మందిని స్టూడెంట్ వీసాపై తీసుకెళ్లి ఉద్యోగాలు కల్పించకుండా మోసం చేసిన ఘటన గతంలో శ్రీకాకుళంలో వెలుగుచూసింది. అక్కడి పోలీసులు గుర్తించి బాధితులను ఇండియాకు తిరిగి పంపించారు. విశాఖపట్నంలో ఓ కన్సల్టెన్సీ సంస్థ సౌదీలో రెండేళ్ల పాటు ఉద్యోగ అవకాశం కల్పిస్తామని 76 మంది నుంచి రూ. 60వేల చొప్పున వసూలు చేసింది. విజిటింగ్ వీసాపై సౌదీకి తీసుకెళ్లి పని కల్పించింది. అయితే ఆరు నెలలకే వీసా గడువు ముగియడంతో ఆ దేశం వారందరినీ ఇండియాకు వెనక్కి పంపించేసింది. బాధితులంతా పోలీసులను ఆశ్రయించారు.

### డబ్బులు వసూలు చేసి..

విదేశాల్లో ఉద్యోగాల ఆశ చూపి నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేసిన ఘటనలు గతంలో అనేకం వెలుగుచూశాయి. స్వీడన్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ విశాఖలో ఓ సంస్థ నిరుద్యోగులకు టోకరా వేసింది. 70 మంది నుంచి రూ.కోటి వరకు వసూలు చేసి బోర్డు తిప్పేసింది. యూరప్, మలేషియా పంపిస్తామని ఏజెంట్లు మోసం చేశారని జగిత్యాలలో చాలా మంది పోలీసులను ఆశ్రయించారు. అంతేకాకుండా తెలుగు రాష్ట్రాలలో గల్ఫ్ మోసాలు తరచూ బయటపడుతూనే ఉంటాయి. గల్ఫ్ పంపిస్తానని నిజామాబాద్ జిల్లాలో ఓ ఏజెంట్ రూ. 4 కోట్ల వరకు వసూలు చేసి పరారయ్యాడు.



### హెచ్చరిస్తున్న విదేశీ మంత్రిత్వ శాఖ

విదేశీ ఉద్యోగాల పేరుతో జరుగుతున్న మోసాలు ఎక్కువగా తూర్పు ఐరోపా దేశాలు, గల్ఫ్ కంట్రీస్, ఇజ్రాయిల్, కెనడా, మయన్మార్ వెళ్లే నిరుద్యోగులకు ఎదురవుతున్నట్లు భారత విదేశాంగ శాఖ గుర్తించింది. అందుకే విదేశాల్లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఉద్యోగాలు చేయాలనుకుంటే రిజిస్టర్డ్ రిక్రూటింగ్ ఏజెంట్లను మాత్రమే సంప్రదించాలని, చట్టపరమైన నిబంధనలను అనుసరించి మాత్రమే విదేశాలకు వెళ్లాలని సూచిస్తున్నది. విదేశాల్లో ఉద్యోగాల పేరిట మోసాలకు పాల్పడేవారు ఎక్కువగా వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విటర్ లాంటి సామాజిక మాధ్యమాల ద్వారానే సంప్రదిస్తున్నారని, తమ ఆఫీసు అడ్రస్‌గానీ, ఇంటి అడ్రస్‌గానీ తెలియనివ్వడం లేదని గుర్తించింది. అందుకే రిజిస్టర్డ్ ఏజెంట్లందరూ తమ కార్యాలయం ఎదుట ప్రభుత్వం జారీ చేసిన లైసెన్స్‌ను కచ్చితంగా డిస్‌ప్లే చేయాలని కేంద్రం ఆదేశించింది. ప్రభుత్వ గుర్తింపు లేని రిక్రూటింగ్ ఏజెంట్లెవరైనా నిరుద్యోగులకు మాయమాటలు చెప్పి విదేశాలకు పంపిస్తే కఠిన శిక్షలు ఉంటాయని హెచ్చరించింది. ఇమ్మిగ్రేషన్ చట్టం-1983 ప్రకారం ఇది మానవ అక్రమ రవాణా కిందికి వస్తుందని స్పష్టం చేసింది. కాని మోసాలు జరుగుతూనే వున్నాయి. కట్టడి కరువౌతోంది.

### నిశిత పరిశీలన అవసరం

మెరుగైన ఉపాధి కోసం చాలా మంది భారతీయులు విదేశాలకు వెళ్లడానికి ఆసక్తి చూపుతున్నారు. అయితే చాలా మంది నకిలీ ఏజెంట్ల చేతుల్లో మోసపోతూ, ఆర్థికంగా నష్టపోవడమే కాకుండా ప్రాణాల మీదకు తెచ్చు కుంటున్నారు. అందుకే విదేశీ ఉద్యోగ ప్రకటనల పట్ల అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా రిజిస్టర్ చేయని రిక్రూట్‌మెంట్ ఏజెంట్ల ద్వారా ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవద్దని పేర్కొంటున్నారు. ఉద్యోగం కోసం విదేశాలకు వెళ్లాలనుకునేవారు ముందుగా ఏజెంట్ వివరాలను తెలుసుకోవాలి. విదేశాంగ శాఖలో ఏజెంట్‌గా నమోదు చేసుకున్నారా లేదా పరిశీలించాలి. ఏజెంట్స్ రిజిస్ట్రేషన్ నంబర్ చెక్ చేయడానికి అనే భారత ప్రభుత్వ వెబ్‌సైట్‌ను విజిట్ చేయాలి. అసట్‌లో లిస్ట్ అయి ఉంటాయి. అంతేకాకుండాలైన ఏజెంట్ల రిజిస్ట్రేషన్ నంబర్లు ఈ వెబ్‌సైఆఫర్ లెటర్‌ను నిశితంగా పరిశీలించాలి. ఉద్యోగ నిబంధనలు, షరతులతో పాటు జీతం, జాబ్ కాంట్రాక్ట్ వివరాలు లేకుంటే ఆ ఆఫర్ లెటర్ మోసపూరితమని గ్రహించాలి.

# తెలంగాణ కాంగ్రెస్‌కు కొత్త తలనొప్పి తప్పదా

లోక్‌సభ ఎన్నికల తర్వాత కొత్త పీసీసీ చీఫ్!

కసరత్తులు ప్రారంభించిన హైకమాండ్

ఆశలు పెట్టుకున్న సీనియర్లు

తమకే ఇవ్వాలంటూ హైకమాండ్‌కు ఇప్పటికే విజ్ఞప్తులు

అసంతృప్తులు బయటకు రాకుండా.. ఆచితూచి నిర్ణయం తీసుకోనున్న అధిష్టానం

సీఎం రేవంత్‌తో కలుపుగోలుగా ఉండేవాళ్లకే ఛాన్స్?



హైదరాబాద్, : తెలంగాణ కాంగ్రెస్‌కు సంబంధించిన నిర్ణయాల కోసం హైకమాండ్ ఎంతగా మల్లగుల్లాలు పడుతోంది గత కొన్ని నెలలుగా చూస్తున్నాం. ఈ క్రమంలో లోక్‌సభ ఎన్నికల తర్వాత.. కాంగ్రెస్ హైకమాండ్‌కు కొత్త తలనొప్పి తప్పదనిపిస్తోంది. తెలంగాణ పీసీసీ చీఫ్‌గా ఎవరిని ఎంపిక చేయబోతోంది. గాంధీభవన్‌కు కొత్త బాస్ ఎవరు కానున్నారు?.. సీనియర్ల అభ్యంతరాలు-గ్రూప్ రాజకీయాలకు చెక్ పెట్టి ఆ నియామకాన్ని కాంగ్రెస్ ఎలా పూర్తి చేయబోతోంది?.. పీసీసీ చీఫ్, ముఖ్యమంత్రిగా జోడు పదవులు నిర్వహిస్తున్న ఎనుముల రేవంత్ రెడ్డి స్థానంలో.. పార్టీకి కొత్త చీఫ్‌గా ఎవరు రాబోతున్నారు?. అసలు ఆ రేసులో ఉన్న నాయకులు ఎవరు? ఈసారి అగ్ర వర్ణాలకు ఇస్తారా? బీసీలకు ప్రాధాన్యమిస్తారా? లేక ఎస్సీ వర్గంలో సీనియర్ నేతకు ఛాన్స్ ఇస్తారా? అసలు కాంగ్రెస్ హైకమాండ్ మదిలో ఏముంది? పార్టీ నాయకత్వం దృష్టిని ఆకర్షించినవారు ఎవరు?.. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ముందు పీసీసీ చీఫ్‌గా ఉన్న రేవంత్‌రెడ్డి...పార్టీ అధికారంలోకి రావడంతో ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. పార్లమెంట్ ఎన్నికలు దగ్గరపడుతుండటంతో వెంటనే పీసీసీ అధ్యక్షుడిని మారిస్తే ఇబ్బంది అవుతుందని భావించిన హైకమాండ్ ఎన్నికల తర్వాతే కొత్త పీసీసీ చీఫ్ వస్తారని తెలిపింది. ఇక ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికలు ముగిసాయి గనుక.. ఫలితాలు రాగానే కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడిగా కొత్త నేత వస్తారంటున్నారు. రేవంత్‌రెడ్డి కూడా పార్టీ బాధ్యతల నుంచి తప్పుకుని పూర్తిగా పాలనపైనే దృష్టి పెట్టాలనుకుంటున్నారు. ఇక హైకమాండ్ కూడా గాంధీభవన్‌కు కొత్త బాస్‌గా ఎవరిని నియమించాలనే విషయంపై కసరత్తు ప్రారంభించినట్లు తెలుస్తోంది. పీసీసీ చీఫ్ ఎవరిని నియమిస్తే బాగుంటుందనే చర్చ కాంగ్రెస్ క్యాడర్లో విస్తృతంగా జరుగుతోంది. తర్వాత పీసీసీ చీఫ్ గా ఎవరు వస్తారనే విషయాన్ని సీఎం రేవంత్ దగ్గర ప్రస్తావిస్తే ఆ విషయం తన పరిధిలో లేని అంశమని, హై కమాండ్ ఎవరిని నియమించినా తనకు సమ్మతమేనని రేవంత్ రెడ్డి చెప్తున్నారట. పార్టీని ప్రతిపక్షం నుంచి అధికారంలోకి తీసుకొచ్చిన రేవంత్ రెడ్డి స్థాయిలో పనిచేయగలిగే వ్యక్తి ఎవరున్నారనే అంశంపై పార్టీ అధిష్ఠానం ఫోకస్ చేసినట్టు తెలుస్తోంది. పీసీసీ అధ్యక్షుడిగా ఎవరైతే బాగుంటుంది? ఎవరైతే నేతలందరినీ కలుపుకొని వెళ్ళగలరు అనే దానిపై హై కమాండ్ సమాచారం సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. పీసీసీ చీఫ్ పదవిపై చాలా మంది సీనియర్ నేతలు ఆశలు పెట్టుకున్నట్లు బహిరంగంగానే ప్రకటిస్తున్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జగ్గారెడ్డి తనకు పీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వాలని చాలారోజుల నుండి అడుగుతున్నారు. ఇప్పుడు కూడా తాను పీసీసీ చీఫ్ రేసులో ఉన్నట్లు చెబుతున్నారు. ఇక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి సైతం తనకు పీసీసీ చీఫ్ పదవి కావాలని హై కమాండ్ కి రిక్వెస్ట్ చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ముఖ్యమంత్రి సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కాబట్టి పీసీసీ చీఫ్ పదవి రెడ్డి సామాజిక వర్గానికి ఇవ్వరనే వాదన బలంగా వినిపిస్తోంది. దీంతో బీసీ, ఎస్సీ సామాజిక వర్గాల నేతలు పీసీసీ చీఫ్ పదవిపై ఆశలు పెట్టుకున్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పీసీసీ చీఫ్ తనకి ఇవ్వాలని చాలా రోజుల నుండి అడుగుతున్నారట. కర్ణాటకలో డీకే శివకుమార్ డిప్యూటీ సీఎంతో పాటు పీసీసీ చీఫ్ గా ఉన్నారని తెలంగాణలో సైతం అలాంటి నిర్ణయాన్నే తీసుకోవాలని భట్టి పట్టుపడుతున్నట్లు సమాచారం. మంత్రి పొన్నం ప్రభాకర్ సైతం పీసీసీ చీఫ్ రేసులో ఉన్నారు. తాను విద్యార్థి దశ నుండి కాంగ్రెస్ పార్టీలో పనిచేస్తున్నానని తనకి అధ్యక్షుడిగా అవకాశం ఇస్తే బాగుంటుందని కాంగ్రెస్ పెద్దల దగ్గర చెబుతున్నట్లు సమాచారం. పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ సైతం పీసీసీ రేసులో తాను ఉన్నట్లు ప్రకటించారు. మరో బీసీ నేత మధుయాష్కీ గౌడ్ కూడా పీసీసీ చీఫ్ రేసులో ఉన్నట్లు ఆయన సన్నిహితులు చెబుతున్నారు. ఏఐసీసీ సెక్రటరీ సంపత్‌కుమార్ సైతం పీసీసీ పదవి తనకి వస్తుందనే ధీమాలో ఉన్నారు. మొన్న నాగర్ కర్నూల్ ఎంపీ టికెట్ ఆశించారు. మాదిగలకు కాంగ్రెస్ సరైన గౌరవం ఇవ్వడం లేదనే చర్చ నేపథ్యంలో పార్టీ అధ్యక్ష పదవి మాదిగ సామాజికవర్గానికి చెందిన సంపత్ కి ఇస్తే బాగుంటుందనే వాదన నడుస్తోంది. ఇక మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, అద్దంకి దయాకర్ లాంటి వాళ్ళ పేర్లు కూడా పీసీసీ చీఫ్ పదవి కోసం పరిశీలనలో ఉన్నట్లు వినిపిస్తోంది. అయితే ప్రధానంగా జగ్గారెడ్డి, మహేష్ కుమార్ గౌడ్, సంపత్ కుమార్ ల మధ్యే ప్రధాన పోటీ ఉన్నట్లు సమాచారం. అధికార పార్టీ అధ్యక్ష పదవి కోసం పదికి పైగా మంది నేతలు సీరియస్ గా ప్రయత్నిస్తున్నారు. రెడ్డి సామాజికవర్గం నుంచి సీఎం ఉండడంతో బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల నేతలనుంచి ఒకరికి పీసీసీ పదవి దక్కనుందని గాంధీభవన్‌లో జోరుగా చర్చ జరుగుతోంది.

## అతను వెళ్లిపోతేనే ఆర్సీబీకి టైటిల్

# రాయుడు సంచలన కామెంట్స్



టీమిండియా మాజీ క్రికెటర్ అంబటి రాయుడు మరోసారి వివాదస్పద వ్యాఖ్యలు చేశాడు. గత కొన్ని రోజులుగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు గురించి ఘాటు విమర్శలు చేస్తున్న రాయుడు తాజాగా సంచలన ట్వీట్‌తో వివాదాన్ని ముదిరేలా చేశాడు. ఆటగాళ్ల పేర్లను ప్రస్తావించకుండా పరోక్షంగా దారుణంగా విమర్శించాడు. అసలేం జరిగిదంటే.. ప్లేఆఫ్స్‌కు వెళ్లాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో సీఎస్కేపై ఆర్సీబీ ఘన విజయం సాధించింది. ఈ గెలుపుతో చెన్నై ఇంటికి, బెంగళూరు ముందుకు వెళ్లింది. అయితే మ్యాచ్ అనంతరం ఆర్సీబీ ఆటగాళ్లు, అభిమానులు సంబరాలు చేసుకున్న తీరుపై రాయుడు వ్యంగ్యంగా మాట్లాడాడు. అప్పుడే ఆర్సీబీ టైటిల్ సాధించినట్లుగా ఫీల్ అవుతుందని అన్నాడు. అయితే ఆ తర్వాత రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన ఎలిమినేటర్ మ్యాచ్‌లో బెంగళూరు ఓటమిపాలైంది. దీంతో రాయుడు ఆర్సీబీని మరోసారి విమర్శించాడు. సంబరాలు, దూకుడుగా ఉంటే కప్ ఇవ్వరని, సీఎస్కేపై గెలిస్తే ట్రోఫీ సాధించనట్లు కాదని రాయుడు తీవ్ర వ్యాఖ్యలు చేశాడు. తొలి ఎనిమిది మ్యాచ్‌ల్లో కేవలం ఒకే విజయంతో టోర్నీ నుంచి నిష్క్రమణ దాదాపు ఖరారైన స్థితి నుంచి ఆర్సీబీ గొప్పగా పోరాడి వరుసగా ఆరు విజయాలు సాధించింది. బలమైన సీఎస్కే జట్టుపై గెలిచి తదుపరి దశకు చేరింది. టైటిల్ మిస్ అయినప్పటికీ, ఆర్సీబీ అసాధారణ ప్రదర్శనను కొనియాడుతూ వెస్టిండీస్ క్రికెటర్ నికోలస్ పూరన్ పోస్ట్ చేశాడు. కానీ సీఎస్కే ప్లేయర్లు తుషార్ దేశ్‌పాండే, దీపక్ చాహర్, మాజీ ఆటగాడు అంబటి రాయుడు ఆర్సీబీని ట్రోల్ చేయడం గమనార్హం. ఫ్యాన్ వార్‌లా తమ స్థాయికి మించి ప్రవర్తించారని ఈ ఆటగాళ్లపై నెట్టింట్లో విమర్శలు వచ్చాయి. అయితే రాయుడు దానికి వివరణ ఇస్తున్నట్లుగా చేసిన తాజా ట్వీట్ వివాదం సద్దుమణిగేలా కాకుండా రెట్టింపు చేసేలా ఉంది. 'ఎన్నో ఏళ్లుగా ఆర్సీబీని సపోర్ట్ చేస్తున్న అభిమానుల పట్ల నాకెంతో ప్రేమ ఉంది. కానీ టీమ్ మేనేజ్మెంట్, లీడర్స్.. వ్యక్తిగత మైలు రాళ్ల కోసం కాకుండా జట్టు గురించి ఆలోచిస్తే ఇప్పటికీ ఆర్సీబీ ఎన్నో టైటిళ్లు సాధించేది. ఎంతో మంది అద్భుతమైన ఆటగాళ్లు జట్టును వీడారో ఓ సారి గుర్తు చేసుకోండి. జట్టు కోసం ఆడే ఆటగాళ్లను తీసుకు రమ్మని మేనేజ్మెంట్‌పై ఒత్తిడి చేయండి. మెగా వేలం నుంచి కొత్త అధ్యాయం ప్రారంభం కానుంది" అని అంబటి రాయుడు ట్వీట్ చేశాడు.

## టీమిండియాలో పెద్ద ఎత్తున రాజకీయాలు..

# కేఎల్ రాహుల్ సంచలన వ్యాఖ్యలు!



టీ20 ప్రపంచకప్ 2024 ముగిసిన తర్వాత టీమిండియా హెడ్ కోచ్‌గా రాహుల్ ద్రవిడ్ పదవీకాలం ముగుస్తుంది. నివేదికల ప్రకారం ద్రవిడ్ మరోసారి కోచ్‌గా కొనసాగడానికి ఆసక్తిగా లేనట్లు తెలుస్తోంది. దాంతో కొత్త కోచ్ కోసం బీసీసీఐ వెతుకుతోంది. ఇందుకోసం బీసీసీఐ ఇప్పటికే దరఖాస్తులను ఆహ్వానించగా.. మే 27 ఆఖరి గడువు. హెడ్ కోచ్ పదవిని బీసీసీఐ ఎవరితో భర్తీ చేస్తుందనే ఆసక్తి అందరిలో నెలకొంది. ప్రస్తుతానికి కోచ్ రేసులో స్టీఫెన్ ఫ్లెమింగ్, జస్టిన్ లాంగర్, రికీ పాంటింగ్, గౌతమ్ గంభీర్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. అయితే టీమిండియా కోచ్ పదవిపై విదేశీ మాజీలు పెద్దగా ఆసక్తి చూపించట్లేదట. అందుకు కారణాలు లేకపోలేదు. టీమిండియాకు హెడ్ కోచ్‌గా ఉంటే.. కుటుంబంతో ఎక్కువ సమయాన్ని గడపలేమని రికీ పాంటింగ్ చెప్పాడు. స్టీఫెన్ ఫ్లెమింగ్ కూడా అదే కారణం చెప్పాడు. అయితే లక్నో సూపర్ జెయింట్స్ కోచ్ జస్టిన్ లాంగర్ చెప్పిన కారణం మాత్రం అందర్నీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. టీమిండియా కోచ్‌గా బాధ్యతలు చేపడితే.. ఎలాంటి పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందో లక్నో కెప్టెన్ కేఎల్ రాహుల్ తనకు చెప్పాడని ఓ బాంబు పేల్చాడు. భారత జట్టులో ఐపీఎల్ కంటే వెయ్యి రెట్ల ఒత్తిడి, పాలిటిక్స్ ఉంటాయని రాహుల్ తనకు చెప్పాడని లాంగర్ పేర్కొన్నాడు. బీబీసీ స్టంప్డ్ పాడ్‌కాస్ట్‌లో ఆస్ట్రేలియా మాజీ కోచ్ జస్టిన్ లాంగర్ మాట్లాడుతూ%% 'భారత జట్టు కోచ్ పదవి అద్భుతమైనది. కానీ నేను పోటీలో ఉండట్లేదు. టీమిండియా కోచ్ పదవి అందరినీ ఆకట్టుకునే పాత్ర అని నాకు తెలుసు. ఆస్ట్రేలియా జట్టుతో నాలుగేళ్లు పని చేశా. నిజాయితీగా చెప్పాలంటే నేను చాలా అలసిపోయా. భారత జట్టులో అధిక ఒత్తిడి ఉంటుంది. నేను కేఎల్ రాహుల్‌తో మాట్లాడాను. 'ఐపీఎల్‌లో ఒత్తిడి, రాజకీయాలు ఉన్నాయని మీకు తెలుసు. దానికి వెయ్యి రెట్లు అక్కడ ఉంటుంది' అని రాహుల్ చెప్పాడు. ఇదో మంచి సలహా. టీమిండియా కోచ్ మంచి జాబే, కానీ నాకు కాదు' అన్నాడు. రాహుల్ చేసిన సంచలన వ్యాఖ్యలు నెట్టింట దుమారం రేపుతున్నాయి.

# శ్రమించి గెలిచిన సింధు

## ప్రపంచ 10వ ర్యాంకర్‌పై అష్మిత విజయం

### డబుల్స్‌లో ముగిసిన భారత్ పోరు



కౌలాలంపూర్: మలేసియా మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల సింగిల్స్ విభాగంలో భారత స్టార్ పీవీ సింధు, రైజింగ్ స్టార్ అష్మిత చాలిహా క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లారు. గురువారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో సింధు 21-13, 12-21, 21-14తో ప్రపంచ 34వ ర్యాంకర్ సిమ్ యు జిన్ (దక్షిణ కొరియా)పై కష్టపడి గెలుపొందగా... ప్రపంచ 53వ ర్యాంకర్ అష్మిత 21-19, 16-21, 21-12తో ప్రపంచ 10వ ర్యాంకర్ బీవెన్ జాంగ్ (అమెరికా)ను బోల్తా కొట్టించింది. 2022 ఇండియా ఓపెన్‌లో క్వార్టర్ ఫైనల్ చేరిన అష్మిత మళ్లీ రెండేళ్ల తర్వాత సూపర్-500 టోర్నీలో క్వార్టర్ ఫైనల్ చేరడం విశేషం. సిమ్‌తో 59 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో సింధు నిలకడలేమితో ఇబ్బంది పడింది. తొలి గేమ్‌ను అలవోకగా నెగ్గిన సింధు రెండో గేమ్‌లో తడబడింది. రెండుసార్లు వరుసగా ఐదు పాయింట్ల చొప్పున ప్రత్యర్థికి కోల్పోయింది. అయితే నిర్ణాయక మూడో గేమ్‌లో గాడిలో పడిన సింధు స్కోరు 16-14 వద్ద వరుసగా ఐదు పాయింట్లు నెగ్గి విజయాన్ని ఖరారు చేసుకుంది. పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో కిరణ్ జార్జి (భారత్) 13-21, 18-21తో లీ జి జియా (మలేసియా) చేతిలో ఓడిపోయాడు. మహిళల డబుల్స్‌లో భారత పోరు ముగిసింది. ప్రిక్వార్టర్స్‌లో పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ ద్వయం 70 నిమిషాల్లో 18-21, 22-20, 14-21తో సుంగ్ షువో యున్-యు చెయున్ హుయ్ (దక్షిణ కొరియా) జోడీ చేతిలో పోరాడి ఓడిపోగా... రితిక-సిమ్రన్ జంట 17-21, 11-21తో పియర్లీ టాన్-థినా మురళీధరన్ (మలేసియా) ద్వయం చేతిలో ఓటమి పాలైంది. మిక్స్‌డ్ డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో సిక్కి రెడ్డి-సుమీత్ రెడ్డి (భారత్) జంట 9-21, 15-21తో టాప్ సీడ్ చెన్ టాంగ్ జి-టో ఈ వె (మలేసియా) జోడీ చేతిలో పరాజయం పాలైంది. పురుషుల డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో గరగ కృష్ణప్రసాద్-సాయిప్రతీక్ ద్వయం 11-21, 9-21తో హి జి టింగ్-రెన్ జియాంగ్ యు (చైనా) జోడీ చేతిలో ఓటమి పాలైంది. నేడు జరిగే క్వార్టర్ ఫైనల్స్‌లో టాప్ సీడ్ హాన్ యువె (చైనా)తో సింధుబీ ఆరో సీడ్ జాంగ్ యి మాన్ (చైనా)తో అష్మిత తలపడతారు.

## ఆర్చరీ వరల్డ్ కప్ స్టేజ్2లో..సెమీఫైనల్లో ప్రథమేశ్




యెంచియోన్ (సౌత్ కొరియా) : ఆర్చరీ వరల్డ్ కప్ స్టేజ్2లో ఇండియా యంగ్ ఆర్చర్ ప్రథమేశ్ వరల్డ్ ఆరో ర్యాంకర్‌కు షాకిస్తూ సెమీఫైనల్ చేరుకున్నాడు. గురువారం జరిగిన మెన్స్ కాంపౌండ్ క్వార్టర్ ఫైనల్లో 146-145తో 2021 వరల్డ్ చాంపియన్‌నికో వీనర్ (ఆస్ట్రియా )ను ఓడించాడు. అభిషేక్ వర్మ రెండో రౌండ్‌లోనే ఓడగా, ప్రియాన్ష్ ప్రిక్వార్టర్ ఫైనల్లో వెనుదిరిగాడు. విమెన్స్ కాంపౌండ్ క్వార్టర్ ఫైనల్లో స్టార్ ఆర్చర్ జ్యోతి సురేఖ 142 145తో సారా లోపేజ్ (కొలంబియా) చేతిలో ఓడిపోయింది. మెన్స్ రికర్వ్ టీమ్ ఈవెంట్‌లో ధీరజ్, తరుణ్ దీప్, మ్రినాల్ చౌహాన్‌తో కూడిన ఇండియా తొలి రౌండ్‌లోనే 3-5తో కెనడా చేతిలో చిత్తయింది. దీపిక కుమారి, అంకితా భకత్, భజన్ కౌర్‌తో కూడిన విమెన్స్ టీమ్ 4-5తో వియత్నాం చేతిలో షూటౌట్‌లో ఓడి ఇంటిదారి పట్టింది.

# ధోని ఉన్నా.. పోరాటమే శ్వాసగా



దిల్లీ: దాదాపు రెండు దశాబ్దాల సుదీర్ఘ కెరీర్. మధ్యలో ఎన్నో ఆటుపోట్లు. వికెట్‌కీపర్ బ్యాటర్‌గా మహేంద్ర సింగ్ ధోని జట్టులో పాతుకుపోవడంతో అతను వెనుకాలే ఆగిపోయాడు. కానీ పోరాటాన్ని మాత్రం ఆపలేదు. టీమ్‌ఇండియాకు ఆడుతూనే ఉండాలనే ఆశ వదులుకోలేదు. లేటు వయసులోనూ ధనాధన్ ఇన్నింగ్స్‌లతో అదరగొట్టిన ఆ క్రికెటరే దినేశ్ కార్తీక్. బుధవారం ఎలిమినేటర్‌లో రాజస్థాన్ చేతిలో బెంగళూరు ఓటమితో ఈ సీనియర్ ఆటగాడి ఐపీఎల్ కెరీర్ ముగిసింది. తన్నుకువస్తున్న భావోద్వేగాలను నియంత్రించుకుంటూ.. కన్నీళ్లను దాచుకుంటూ.. సహచర ఆటగాళ్ల గార్డ్ ఆఫ్ హానర్ మధ్య అతను మైదానాన్ని వీడాడు. ఇప్పుడు ఐపీఎల్‌కు రిటైర్మెంట్ ప్రకటిస్తున్నట్లు అతను అధికారికంగా ప్రకటించకపోయినా.. లీగ్ డిజిటల్ ప్రసారదారు జియో సినిమా ఈ విషయాన్ని స్పష్టం చేసింది. ఈ సీజన్‌తో ఐపీఎల్ కెరీర్ ముగిస్తానని అతను గతంలో సంకేతాలిచ్చాడు. అంతర్జాతీయ క్రికెట్‌కు కూడా కార్తీక్ అధికారికంగా వీడ్కోలు పలకలేదు. కానీ 38 ఏళ్ల కార్తీక్ తిరిగి భారత జట్టులోకి వచ్చే అవకాశం లేదు. దీంతో టీమ్‌ఇండియా తరపునా అతని ఇన్నింగ్స్ ముగిసిందనే చెప్పాలి. ఈ చెన్నై ఆటగాడు 19 ఏళ్ల వయసులోనే 2004లో ఇంగ్లాండ్‌తో వన్డేతో అంతర్జాతీయ అరంగేట్రం చేశాడు. ఆ తర్వాత మూడు నెలలకే టెస్టుల్లోనూ అడుగుపెట్టాడు. ధోని రాకతో కార్తీక్ ఓపెనర్‌గా మారి 2007లో ఇంగ్లాండ్‌తో టెస్టుల్లోనూ సత్తాచాటాడు. కానీ ఆ తర్వాత క్రమంగా జట్టుకు దూరమయ్యాడు. ధోని కెప్టెనయ్యాక జట్టులో వికెట్‌కీపర్ బ్యాటర్ స్థానానికి ఖాళీ లేకుండా పోయింది. 2010 నుంచి 2017 మధ్యలో ఐపీఎల్‌లో నిలకడగా రాణించిన కార్తీక్ జాతీయ జట్టులోకి మాత్రం వస్తూ వెళ్లాడు. 2018 నిదహాస్ ట్రోఫీ ఫైనల్లో చివరి బంతికి సిక్సర్‌తో అతను జట్టును గెలిపించిన క్షణాలు ఎప్పటికీ ప్రత్యేకమే. 2022లో ఆర్సీబీ తరపున ఫినిషర్‌గా అదరగొట్టడంతో టీ20 ప్రపంచకప్‌లో అవకాశం దక్కించుకున్నాడు. ఈ ఐపీఎల్‌లోనూ సత్తాచాటి టీ20 ప్రపంచకప్‌కు ఎంపికయ్యేలా కనిపించాడు. అయితే సెలక్టర్లు యువ ఆటగాళ్లకే పెద్దపీట వేయడంతో కార్తీక్‌కు నిరాశ తప్పలేదు. దీంతో మరోసారి భారత జట్టులోకి వచ్చే అవకాశం లేదని అతనికి కూడా అర్థమైపోయింది. టీమ్‌ఇండియా తరపున అతను 26 టెస్టులు, 94 వన్డేలు, 60 టీ20లు ఆడాడు. ఐపీఎల్‌లో ఆరు జట్లకు ప్రాతినిథ్యం వహించిన కార్తీక్.. 257 మ్యాచ్‌ల్లో 4842 పరుగులు చేశాడు. ఇప్పటికే వ్యాఖ్యాతగా మారిన అతను ఇకపైనా మాటలతోనే అలరించనున్నాడు.

# ఆరేళ్ల తర్వాత ఐపీఎల్ ఫైనల్లో హైదరాబాద్!



ఐపీఎల్ ఫైనల్స్ కు ఆరేళ్ల తరువాత హైదరాబాద్ జట్టు చేరుకొంది. రెండో క్వాలిఫైయర్స్ పోరులో రాజస్థాన్ రాయల్స్ ను 36 పరుగులతో చిత్తు చేసింది. ఐపీఎల్ -17వ సీజన్ ఫైనల్స్ కు మాజీ చాంపియన్ హైదరాబాద్ సన్ రైజర్స్ ఆరేళ్ల విరామం తరువాత చేరుకొంది. సెమీఫైనల్స్ లాంటి క్వాలిఫైయర్స్ -2 పోరులో స్థాయికి తగ్గట్టుగా ఆడి మాజీ చాంపియన్ రాజస్థాన్ రాయల్స్ ను అలవోకగా ఓడించింది. సూపర్ సండే టైటిల్ పోరులో రెండుసార్లు విజేత కోల్ కతా నైట్ రైడర్స్ తో అమీతుమీ తేల్చుకోనుంది.

### చెపాక్ పిచ్ పైన రాజస్థాన్ కు షాక్...

తనకు అత్యంత అనుకూలమైన చెన్నై చెపాక్ స్టేడియం పిచ్ వేదికగా జరిగిన క్వాలిఫైయర్స్ -2 పోరులో హైదరాబాద్ సన్ రైజర్స్ కు రాజస్థాన్ రాయల్స్ సరిజోడీ కాలేకపోయింది. కీలక టాస్ నెగ్గి ఫీల్డింగ్ ఎంచుకొన్నా పరిస్థితిని తనకు అనువుగా మలచుకోడంలో సంజు శాంసన్ నాయకత్వంలోని రాజస్థాన్ జట్టు విఫలమయ్యింది. ప్రధానంగా..తురుపుముక్క లాంటి స్పిన్ జోడీ రవిచంద్రన్ అశ్విన్, యజువేంద్ర చహాల్ లు కేవలం 80 ఓవర్లలోనే 80 పరుగులు సమర్పించుకొని..కనీసం ఒక వికెట్టూ పడగొట్టలేక తమ జట్టు ఓటమికి ప్రధాన కారకులుగా నిలిచారు.

### హెడ్, రాహుల్, క్లాసెన్ ధూమ్ ధామ్ బ్యాటింగ్...

టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్ కు దిగిన హైదరాబాద్ సన్ రైజర్స్..బ్యాటింగ్ కు అంతగా అనువుకాని చెపాక్ పిచ్ పైన 20 ఓవర్లలో 175 పరుగుల మ్యాచ్ విన్నింగ్ స్కోరు సాధించగలిగింది. ఓపెనర్ ట్రావిస్ హెడ్ 34, వన్ డౌన్ రాహుల్ త్రిపాఠీ 37, వికెట్ కీపర్ బ్యాటర్ క్లాసెన్ 50, ఆల్ రౌండర్ షాబాజ్ అహ్మద్ 18 బంతుల్లో 18 పరుగులు సాధించడంతో సన్ రైజర్స్ 175 పరుగుల స్కోరు సాధించగలిగింది. రాజస్థాన్ బౌలర్లలో పేస్ జోడీ ట్రెంట్ బౌల్ట్, ఆవేశ్ ఖాన్ చెరో 3 వికెట్లు, సందీప్ శర్మ 2 వికెట్లు పడగొట్టారు. అశ్విన్ 4 ఓవర్లలో 43 పరుగులు, చహాల్ 4 ఓవర్లలో 34 పరుగులు ఇవ్వటంతో సన్ రైజర్స్ కు సంజు సేన పగ్గాలు వేయలేకపోయింది.

### రైజర్స్ స్పిన్ లో జైపూర్ గల్లంతు...

మ్యాచ్ నెగ్గాలంటే 20 ఓవర్లలో 176 పరుగుల లక్ష్యంతో చేజింగ్ కు దిగిన రాజస్థాన్ మిడిల్ ఓవర్లలో రైజర్స్ స్పిన్ జోడీ షాబాజ్, అభిషేక్ శర్మల మ్యాజిక్ లో గల్లంతయ్యింది. వరుసగా 5 వికెట్లు కోల్పోడంతో మరి తేరుకోలేకపోయింది. ఓపెనర్ యశస్వీ జైశ్వాల్ 42, మరో ఓపెనర్ టామ్ 10, కెప్టెన్ సంజు శాంసన్ 10, స్టార్ బ్యాటర్ రియాన్ పరాగ్ 6 పరుగుల స్కోర్లకే దొరికిపోయారు. మిడిలార్డర్లో ధృవ్ జురెల్ ఒక్కడే పోరాడినా ప్రయోజనం లేకపోయింది. ధృవ్ 35 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్సర్లతో 56 పరుగుల అజేయ స్కోరుతో నిలిచినా...రాజస్థాన్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 139 పరుగులు మాత్రమే చేయగలిగింది. సన్ రైజర్స్ బౌలర్లలో లెఫ్టామ్ స్పిన్ జోడీ షాబాజ్, అభిశేక్ కలిసి 5 వికెట్లు, కమిన్స్ , నటరాజన్ చెరో వికెట్ పడగొట్టారు. ఆఖరి 6 బంతుల్లో 42 పరుగులు చేయాల్సిన రాజస్థాన్ రాయల్స్ 36 పరుగుల ఓటమితో టోర్నీ నుంచి నిష్క్రమించింది. సన్ రైజర్స్ విజయంలో ప్రధానపాత్ర వహించిన షాబాజ్ కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది.

### 2016 తరువాత తొలి ఫైనల్స్...

ఐపీఎల్ చరిత్రలో రెండుసార్లు విజేతగా నిలిచిన హైదరాబాద్ ఫ్రాంచైజీ జట్టు 2016 టైటిల్ విజయం తరువాత ఐపీఎల్ ఫైనల్స్ చేరడం ఇదే మొదటిసారి. గతంలో డెక్కన్ చార్జర్స్ పేరుతో తొలి టైటిల్ నెగ్గిన హైదరాబాద్ 2016లో డేవిడ్ వార్నర్న నాయకత్వంలో హైదరాబాద్ సన్ రైజర్స్ గా రెండో టైటిల్ గెలుచుకొంది. ప్రస్తుత 17వ సీజన్లో యాండీ కమిన్స్ కెప్టెన్సీలో లీగ్ దశ నుంచి క్వాలిఫైయర్స్ వరకూ పరుగుల హోరు, రికార్డుల జోరుతో మరోసారి ఫైనల్స్ చేరడం విశేషం. ఆదివారం జరిగే టైటిల్ పోరులో మాజీ చాంపియన్, లీగ్ టేబుల్ టాపర్ కోల్ కతా నైట్ రైడర్స్ తో సన్ రైజర్స్ ఢీ కోనుంది. 10 జట్ల లీగ్ టేబుల్ మొదటి రెండుస్థానాలలో నిలిచినజట్లే చివరకు టైటిల్ పోరులో నిలవడం మరో విశేషం.

# తుది జట్టు ఇదే
# ఆ భారత హిట్టర్‌పై వేటు!



ఐపీఎల్ 2024లో ఛాంపియన్‌గా నిలవడానికి సన్‌రైజర్స్ హైదరాబాద్ మరో అడుగు దూరంలో నిలిచింది. మరో ఒక్క విజయం సాధిస్తే ఎస్ఆర్‌హెచ్ విజేతగా నిలుస్తుంది. గత సీజన్‌లో ఎదురైన గుణపాఠాలను నేర్చుకుని, పొరపాట్లను పునరావృతం చేయకుండా ఈ సీజన్‌లో సన్‌రైజర్స్ ఫైనల్‌కు దూసుకొచ్చింది. ఐపీఎల్-2024లో మన తెలుగు జట్టు పోరాటం స్టయిలే సెపరేటు. క్రికెట్ ప్రపంచం ఒక్కసారి ఉలిక్కిపడేలా పరాక్రమం చూపించింది. టీ20 ఫార్మాట్ అంటే ఊచకోత కామన్ అని సగటు అభిమానికి అనిపించేలా చేసింది. 11 ఏళ్లుగా బూజు పట్టి ఉన్న ఆర్సీబీ అత్యధిక టీమ్ రికార్డును దుమ్ముదులిపే ప్రదర్శనతో బద్దలుకొట్టింది. ఒక్కసారి కాదు ఏకంగా కొన్నిరోజుల వ్యవధిలోనే చరిత్ర తిరగరాసింది. సన్‌రైజర్స్ గెలుపు మంత్రాన్ని ఇతర జట్లు కూడా ఫాలో అవ్వడంతో ఐపీఎల్ హోరాహోరీగా మారింది. అయితే ఎస్ఆర్‌హెచ్ ఫైనల్ తలపడే ప్రత్యర్థి అంత తేలికైనది కాదు. ఓటమిని ఆఖరి వరకు అంగీకరించదు. భీకర హిట్టర్లు, క్వాలిటీ బౌలర్లు కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టులోనూ ఉన్నారు. దీంతో ఫైనల్ పోరు హైవోల్టేజ్ మ్యాచ్‌గా జరుగుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. అయితే కేకేఆర్‌ను ఓడించడానికి హైదరాబాద్ ప్రత్యేక వ్యూహాలు రచిస్తోంది. ప్రత్యర్థి బలాల కంటే తమ బలహీనతలపై ఫోకస్ పెట్టింది. ఈ క్రమంలో భారత యువ హిట్టర్ అబ్దుల్ సమద్‌పై వేటు వేయాలని మేనేజ్మెంట్ భావిస్తోంది. అబ్దుల్ ఈ సీజన్‌లో నిరాశపరిచాడు. క్వాలిఫయిర్-1తో పాటు క్వాలిఫయిర్-2లోనూ విఫలమయ్యాడు. ఫినిషర్‌గా జట్టుకు ఉపయోగపడతాడని సీజన్ ఆరంభం నుంచి ఇప్పటి వరకు అబ్దుల్‌కు అవకాశం ఇచ్చింది. కానీ ఈ యువ బ్యాటర్ అవకాశాలను సద్వినియోగం చేసుకోలేకపోయాడు. దీంతో అతని స్థానంలో మరో బ్యాటర్‌కు అవకాశం ఇవ్వాలని యాజమాన్యం భావిస్తోంది. మరోవైపు ఫైనల్‌కు ఆతిథ్యం ఇచ్చే చెపాక్ పేస్ కంటే స్పిన్‌కు ఎక్కువగా అనుకూలిస్తోంది. దీంతో అబ్దుల్ సమద్ స్థానంలో వాషింగ్టన్ సుందర్‌కు ఛాన్స్ ఇవ్వాలని ఎస్ఆర్‌హెచ్ భావిస్తోంది. సుందర్ దూకుడుగా బ్యాటింగ్ చేయడంతో పాటు బంతితోనూ సత్తాచాటగలడు. అయితే పిచ్‌ను బట్టి ప్లాన్-బి కూడా సిద్ధంగా ఉంచుకోవాలని మేనేజ్మెంట్ భావిస్తుంది. స్పెషలిస్ట్ బ్యాటర్ అబ్దుల్ సమద్‌ను జట్టులోనే కొనసాగించి మార్క్రమ్‌కు బదులుగా గ్లెన్ ఫిలిప్స్‌ను బరిలోకి దించే ఆలోచనతోనూ ఉంది. ఈ సీజన్‌లో ఫిలిప్స్ ఇప్పటివరకు ఆడలేదు. దీంతో ఫిలిప్స్ గురించి కేకేఆర్ దాదాపు ఎలాంటి ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేయదు. ప్రత్యర్థికి ఊహలకు అందకుండా ఫిలిప్స్‌ను బరిలోకి దించితే మంచి ఫలితం వస్తుందని ఎస్ఆర్‌హెచ్ భావిస్తోంది. సన్‌రైజర్స్ హైదరాబాద్ తుది జట్టు (అంచనా) ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ, రాహుల్ త్రిపాఠి, గ్లెన్ ఫిలిప్స్/మార్క్రమ్, నితీశ్ రెడ్డి, హెన్రిచ్ క్లాసెన్, అబ్దుల్ సమద్/వాషింగ్టన్ సుందర్, షాబాజ్ అహ్మద్, ప్యాట్ కమిన్స్, భువనేశ్వర్ కుమార్, నటరాజన్ ఇంపాక్ట్ ప్లేయర్: జయదేవ్ ఉనద్కత్

## రైడర్స్ విజయాలకు సన్‌రైజర్స్ 'ఫైనల్' చెక్ వేసేనా




ఇంటర్నెట్ డెస్క్: తొలి క్వాలిఫయర్ ఓటమికి ప్రతీకారం తీర్చుకొనే మంచి అవకాశం హైదరాబాద్ ఎదుట నిలిచింది. ఇదే సీజన్‌లో కోల్‌కతా చేతిలో రెండుసార్లు ఎదురైన పరాభవాలకు 'ఫైనల్' విజయంతో చెక్ పెట్టేందుకు సన్‌రైజర్స్ సిద్ధమవుతోంది. ఆదివారం 'చెపాక్' వేదికగా కోల్‌కతా - హైదరాబాద్ జట్ల మధ్య ఐపీఎల్ 17వ ఎడిషన్ టైటిల్ పోరు జరగనుంది. 'మూడు' ఎవరికి గౌతమ్ గంభీర్ మెంటార్‌గా వ్యవహరిస్తున్న కోల్‌కతా నైట్‌రైడర్స్ ఫైనల్‌కు చేరుకుంది. పాట్ కమిన్స్ నాయకత్వంలోని హైదరాబాద్ టైటిల్ రేసులో నిలిచింది. ఐపీఎల్‌లో కోల్‌కతా రెండుసార్లు విజేతగా నిలిచింది. హైదరాబాద్ కూడా ఒకసారి సన్‌రైజర్స్‌గా, మరొకసారి డెక్కన్ ఛార్జర్స్‌గా టైటిల్‌ను దక్కించుకుంది. దాదాపు పాతిక కోట్లు వెచ్చించి కొనుగోలు చేసిన మిచెల్ స్టార్క్ (3/34) కీలక సమయంలో ఫామ్‌లోకి రావడం కోల్‌కతాకు కలిసొచ్చే అంశం. ఆ జట్టులోని ప్రతి ఒక్కరూ విజయం కోసం కంట్రిబ్యూషన్ చేస్తున్నారు. హైదరాబాద్ గత కొన్ని మ్యాచుల్లో ఓపెనింగ్ ఇబ్బందిగా మారింది. ఆరంభంలో దూకుడుగా ఆడే క్రమంలో ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మలో ఒకరు త్వరగా పెవిలియన్‌కు చేరుతున్నారు. 'పవర్ ప్లే'లో 125 పరుగులు చేసిన ప్రదర్శనను మరోసారి పునరావృతం చేస్తే విజయం పక్కా. చెపాక్ పిచ్ స్పిన్నర్లకు సహకరిస్తుందని 'రెండో క్వాలిఫయర్' మ్యాచ్‌లో తేలింది. దీంతో కేకేఆర్ స్పిన్నర్లు సునీల్ నరైన్, వరుణ్ చక్రవర్తిలతో హైదరాబాద్ ఆటగాళ్లకు ముప్పు తప్పదు. కాసేపు కుదురుకుంటేనే పరుగులు చేయడం సులువుతుంది. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్, వన్డే ప్రపంచ కప్.. ఇప్పుడు ఐపీఎల్ ఫైనల్‌కు తన జట్టును చేర్చిన కెప్టెన్‌గా పాట్ కమిన్స్ నిలిచాడు. ఆ రెండింట్లో విజేతగా నిలపగా.. ఇప్పుడు కూడా టైటిల్‌ను అందిస్తే హ్యాట్రిక్ సొంతమవుతుంది. కోల్‌కతా - హైదరాబాద్ ఇప్పటి వరకు 27సార్లు ముఖాముఖిలో తలపడ్డాయి. కేకేఆర్ 18, ఎస్ఆర్‌హెచ్ 9 మ్యాచుల్లో గెలిచాయి. ఈ సీజన్‌లో ఇరు జట్ల మధ్య జరిగిన మ్యాచుల్లో నైట్‌రైడర్స్‌దే విజయం. తొలి క్వాలిఫయర్‌లో హైదరాబాద్ బౌలింగ్‌ను చిత్తు చేయడంలో కోల్‌కతా బ్యాటర్లు శ్రేయస్ అయ్యర్ - వెంకటేశ్ అయ్యర్ కీలక పాత్ర పోషించారు. హాఫ్ సెంచరీలు సాధించారు. ఓపెనర్ సునీల్ నరైన్ కూడా మంచి ఫామ్‌లో ఉన్నాడు. గత 8 మ్యాచుల్లో ఆరుసార్లు చెపాక్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన జట్టే గెలిచింది. అయితే, దీంతో టాస్ నెగ్గే టీమ్ బ్యాటింగ్‌కే మొగ్గు చూపే అవకాశాలు ఎక్కువ. అయితే, వర్షం పడే సూచనలూ ఉన్న నేపథ్యంలో ఫలితం ఎలా ఉంటుందనేది ఆసక్తికరంగా మారింది. ఒకవేళ వర్షం కారణంగా ఆదివారం మ్యాచ్ రద్దైనా.. రిజర్వ్‌డే ఉంది. అప్పుడూ జరగకపోతే మాత్రం కోల్‌కతా విజేతగా నిలుస్తుంది. పాయింట్ల పట్టికలో హైదరాబాద్ కంటే కోల్‌కతాకే ఎక్కువ పాయింట్లు ఉండటం వల్ల విజేతను అలా తేలుస్తారు.

తుది జట్టు (అంచనా)

కోల్‌కతా: రహ్మానుల్లా గుర్బాజ్ (వికెట్ కీపర్), సునీల్ నరైన్, వెంకటేశ్ అయ్యర్, శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), రింకు సింగ్, ఆండ్రి రస్సెల్, రమణ్‌దీప్ సింగ్, మిచెల్ స్టార్క్, వైభవ్ అరోరా, హర్షిత్ రాణా, వరుణ్ చక్రవర్తి

హైదరాబాద్:ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ, రాహుల్ త్రిపాఠి, నితీశ్ రెడ్డి, హెన్రిచ్ క్లాసెన్ (వికెట్ కీపర్), అబ్దుల్ సమద్, షాబాజ్ అహ్మద్, పాట్ కమిన్స్ (కెప్టెన్), భువనేశ్వర్ కుమార్, విజయకాంత్ వియస్కాంత్, నటరాజన్